

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసిన హసీనా

12

వచ్చే నెల స్వదేశం వెళ్ళేందుకు సన్నాహాలు

సంపుటి 29, సంచిక: 140 | మంగళవారం | 10-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



జనవరి 25 నుంచి

రాష్ట్రంలో జనగణన

- ఫిబ్రవరి 28వరకు ఇంటింటా లెక్కింపు
- జనవరి 10నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన 2027లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన తేదీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జిఒ ఎంఎస్ నెంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర హోం శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ కార్యాలయం అక్టోబర్ 30న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. జనగణన ప్రక్రియలో భాగంగా ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరించనున్నారు. ఈ ఇంటింటి లెక్కింపు ప్రక్రియ జనవరి 25 నుంచి తరువాయి 8లో



పోలేపల్లి నుంచి లగచర్ల బహిరంగ సభ వరకు పాదయాత్ర

కొడంగల్‌కు కృష్ణా నీరు తెస్తా

భూములను పచ్చని పొలాలుగా మారుస్తా

- 'రైతన్నతో ఆత్మీయ సభ'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా
- ప్రాజెక్టుల పనులు చేపడుతుంటే బిఆర్ఎస్‌కు ఎందుకు కడుపుమంట
- పాలమూరు ఎంపిగా కెసిఆర్‌ను గెలిపిస్తే ప్రజల గుండెలమీద తన్ని గజ్వేల్‌కు వెళ్లిపోయిండు...
- పదేళ్ల పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిండు
- మాజీ సిఎం కెసిఆర్‌పై ముఖ్యమంత్రి ధ్వజం

ప్రజాపక్షం/వికారాబాద్

పాలమూరు ప్రాంత అభివృద్ధి, రైతుల సాగునీటి కృష్ణాలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కృష్ణా నీటితో కొడంగల్ భూములను తడుపుతామని, పచ్చని పొలలుగా మరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే పాలమూరు ప్రాంతంలోని పొలాలకు సాగునీరు అందుతుందని ప్రజలు అశించారని పేర్కొన్నారు. 'రైతన్నతో ఆత్మీయ సభ' పేరిట సోమవారం వికారాబాద్ జిల్లా హకీంపేట్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సిఎం మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.9,050 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎకో పామాయిల్ ఫ్యాక్టరీ, నాచారం నుంచి కొత్వాల్‌గూడ వరకు రూ.5వేల కోట్ల విలువైన రేడియల్ రోడ్ నిర్మాణం సహా వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పోలేపల్లిలోని ఏల్లమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి లగచర్ల బహిరంగ సభ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బహిరంగలో మాట్లాడుతూ మక్తల్–నారాయణపేట్–కొడంగల్ పథకాన్ని అడ్డుకుంటామని బిఆర్ఎస్ నేతలు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాజెక్ట్ పనులు చేపడుతుంటే మీకు ఎందుకు అంత కడుపు మంట అని ప్రశ్నించారు. 2028 డిసెంబర్ తరువాయి 8లో

మార్చి నుంచి మే వరకు

తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తొద్దు

- ఎల్ నినో ముప్పుపై హైదరాబాద్ వేదికగా గ్లోబల్ క్లైమేట్ సమ్మిట్!
- డిసెంబరు 7 నుంచి రెండు రోజులపాటు సదస్సు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్ నినో ముప్పు, వాతావరణ మార్పుల సవాళ్లు, భవిష్యత్ నీటి భద్రతపై అంతర్జాతీయ స్థాయిలో కార్యాచరణకు తెలంగాణ వేదిక కానుంది. కరువు, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వంటి ముప్పులను ఎదుర్కొనేందుకు గాను ప్రపంచ నిపుణులు, పర్యావరణవేత్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధమచేస్తోంది. ఇందులో భాగంగా డిసెంబరు 7 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'లో భాగంగా జరిగే తరువాయి 8లో

88 రోజులైనా వీడని ఉత్కంఠ

ఇంకా నిరవధిక వాయిదా పడని ఉభయసభలు



అక్రమంగా 2/3 మెజారిటీ పొందేందుకే

పార్లమెంట్ ప్రొరోగ్‌లో జాప్యం

07

న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడినప్పటి నుండి, వర్షాకాల సమావేశాలను ఇప్పటివరకు ప్రోరోగ్ చేయలేదు. గత 88 రోజులు నుంచి ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ చర్య 2008లో నమోదైన 87 రోజుల రికార్డును అధిగమించింది. సోమవారం ఉదయం నాటికి, లోక్‌సభ లేదా రాజ్యసభ— ఏ సభకూ అధికారికంగా ముగింపు (ప్రొరోగ్) ప్రకటించలేదు. దీనివల్ల ప్రస్తుత స మావేశాల కొనసాగింపుగా మరో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అందరూ భాస్తున్నారు. వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు పలకకూడదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, పార్లమెంటును తక్కువ వ్యవధిలోనే తిరిగి సమావేశపరిచే అవకాశం ఉందనే ఊహాగానాలకు తరువాయి 12లో

బియ్యం అక్రమంగా దాస్తే జైలుకే...

- కృత్రిమ బియ్యం కొరత సృష్టిస్తే సహించేది లేదు
- అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వచేసినా చర్యలు తప్పవు
- రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

బియ్యం కొరత పేరుతో కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుల దోచుకోవాలని చూస్తే సహించేది లేదని రాష్ట్ర ప్రభుత్వంహెచ్చరించింది. ఎంఆర్‌పి ధరకు మించి విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. పదేపదే అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై పిడి యాక్ట్ ప్రయోగించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. బియ్యం ధరల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగి ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేసినట్లు పౌరసరఫరాల శాఖ డైరెక్టర్, చీఫ్ రేషనింగ్ అధికారి జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ వెల్లడించారు. బియ్యం కొరతపై వస్తున్న ప్రచాటరాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు. రిటైలర్లు అనవసరంగా ధరలు పెంచవద్దని, స్టాక్ సమస్య ఉంటే తరువాయి 8లో

క్యూర్ పరిధిలో కాలుష్యం ఆల్‌టైమ్ రికార్డు

05

- గరిష్ట స్థాయిలో ఎక్యూఐ 509 పాయింట్లు
- కాలుష్య తీవ్రతను ప్రకటించని టిజిపిసిబి

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

03

ఎపి, తెలంగాణకు మళ్లీ వర్ష సూచన

ఢిల్లీని కమ్మేసిన కాలుష్య మేఘం

- ఎన్నడూ లేనంతగా ఐదేళ్ళలో పరాకాష్ఠ
- అత్యంత దారుణ స్థాయిలో కాలుష్య సూచీ 439గా నమోదు
- కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి బాణసంచా మోతలు





న్యూఢిల్లీ: కాలుష్యంతో అతలాకుతలమవుతున్న దేశరాజధాని నగరం ఢిల్లీలో దీపావళిరాత్రి కాళరాత్రిగా మారింది.సోమవారం ఢిల్లీ అంతటా దళసరి దుప్పటిలా కాలుష్య మేఘం కమ్ముకుంది. ఎదురుగా ఏముందో కనిపించనిస్థాయికి పరిస్థితి చేరుకుంది. నగరం నలుమూలలా ఉన్న .కాలుష్య గణాంకాలు సేకరించే రీడింగ్ కేంద్రాలు 'సివియర్'మొదలుకుని వివిధ కేటగిరీల ను చూపించాయి.అధికారిక గణాంకాలను పక్కనపెడితే ప్రైవేటు ఏజన్సీలు చూపించిన కాలుష్య గణాంకాలు ప్రజలను భయపెట్టేవిగా మారిపోయాయి.దీంతో రాజధానిలో స్వచ్ఛమైన గాలి నాణ్యతపై అనేక ప్రశ్నలు,సందేహాలు తలెత్తుతున్నాయి. ఈజిఐలో వాతావరణ సదస్సు కాప్–31 ప్రారంభమైన తరుణంలో ఢిల్లీ కాలుష్యం సోమవారంనాడు అంతర్జాతీయస్థాయిలో వార్తలకెక్కింది. ఐతే ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ (డిటియు) సమాచారం ప్రకారం అత్యంత ఘోరమైనస్థాయిలో కాలుష్య సూచీ 439గా నమోదైంది.కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి రాత్రి పది గంటల తర్వాత కూడా బాణసంచా మోతలు మోగాయి. ఈ ఏడాది జరిగిన తరువాయి 12లో

తమ్మిడికుంట చెరువు ప్రారంభానికి సిద్ధం..

10

ఈ నెల 11న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం






ప్రజాపక్షం/ ఖమ్మం

ముందు కబ్జా... ఆపై క్రమబద్ధీకరణ

పేదలు గుడిసెలు వేసుకుంటే దాడులు..
పెద్దలు ఆక్రమిస్తే క్రమబద్ధీకరణా?

పేదోడు తప్పు చేస్తే నేరం దానికి శిక్ష పడాల్సిందే. ఆ తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే. అదేపనిని పెద్దలు, సమాజంలో పలుకుబడి కలిగిన వారు చేస్తే పొరపాటు దానికి శిక్ష అవసరం లేదు. పేదవాడు ప్రభుత్వ స్థలంలో గుడిసె వేస్తే నేరస్తుడైనప్పుడు ప్రభుత్వ భూములు అక్రమించి లేదా తమ భూమిలో కలిపేసుకున్న వారు నేరస్తులు కాదా అన్న ప్రశ్నకు ఈ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. ఒక్క ఖమ్మం జిల్లాలోనే క్రమబద్ధీకరణ కొరకు 5,405 మంది దరఖాస్తు చేసుకున్నారంటే వీరంతా ఏదో ఒకవిధంగా ప్రభుత్వ స్థలాలను తమ ఆక్రమణలో ఉంచుకున్న వారే. వీరు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం డబ్బు చెల్లిస్తే దర్జాగా క్రమబద్ధీకరణ పేరుతో హక్కు కల్పించనున్నారు. అదే పని 30 నుంచి 40 గజాలు తరువాయి 8లో

రంగారెడ్డి కలెక్టర్‌కు జైలు



- హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించినందుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష
- రూ.2 వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు

ప్రజాపక్షం/ హైదరాబాద్

హైకోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ హైకో ర్టు తీర్పు ఇచ్చింది. నిషేధిత ఆస్తుల జాబితా నుం చి తమ ప్లాట్లను తొలగించాలన్న భూ యజమానుల దరఖాస్తులపై 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశించినా కలెక్టర్ అమలు చేయలేదు. ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అభ్యర్థనలను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే లే అవుట్‌లోని ఇతర ప్లాట్లను గతంలో జాబి తా నుంచి తొలగించిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టు గుర్తించింది. ఉత్తర్వులు తప్పని భావిస్తే అప్పీల్ చేసుకోవాలే తప్ప అమలు చేయకుండా ఉండరాదని స్పష్టం చేసిం ది. అప్పీల్‌కు అవకాశం కల్పిస్తూ జైలు శిక్ష అమలును నాలుగు వారాలు నిలిపివేసింది.

ముగ్గురు రిజిస్ట్రార్లకూ జైలు

మధ్యంతర ఉత్తర్వులను ఉల్లంఘించి భూ రిజిస్ట్రేషన్లు కొనసాగించిన ఎడిఆర్ ఎస్టేట్స్ ఎండి దామోదర్‌రావుతో పాటు ముగ్గురు రిజిస్ట్రేషన్ అధికారులకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. బాచుపల్లి సర్వే నంబర్ 140లోని 17.10 ఎకరాల భూమికి సంబంధించి 2023లో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ల కేసులో ఈ ఆదేశాలు జారీ చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ 2025లో రద్దు చేసినప్పటికీ రిజిస్ట్రేషన్లు కొనసాగించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. కోర్టు ఆదేశాల ప్రతులు అందిన తర్వాత కూడా ముగ్గురు అధికారులు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించింది. ఉత్తర్వుల గురించి తెలియదన్న వారి వాదనను తోసిపుచ్చింది. దీంతో ఎండి దామోదర్‌రావు, సబ్‌రిజిస్ట్రార్ శ్రీను, జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు అశోక్, మధుబాబు లకు శిక్ష విధించింది. అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాల పాటు శిక్ష అమలును నిలిపివేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజి, జిల్లా రిజిస్ట్రార్లపై దాఖలైన ధిక్కరణ పిటిషన్‌ను కొట్టివేసింది.

ఎ.పి. స్థానిక ఎన్నికల్లో ఫలితాలు ఏకపక్షం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు గత 10 రోజుల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఫలితాలు పాలక టిడిపి, జనసేన, బిజెపి కూటమికి అనుకూలంగా దాదాపు ఏకపక్షంగా వచ్చాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి సాధించిన విజయాలను మించి ఈ ఎన్నికల్లో ఓటర్లు తమకు ఓట్లు, సీట్లు, స్ట్రయిక్ రేట్ (విజయశాతం) ఇచ్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తాము అధికారం చేబట్టిన దాదాపు రెండున్నర సంవత్సరాల తర్వాత జరిగిన ఈ స్థానిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు తమ పాలనకు వారి ఆశీర్వాదమంటూ, ఇది తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్–జగన్మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందన్న ఆరోపణను పునరుద్ఘాటిస్తూ, విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతూ, ‘అభివృద్ధి–సంక్షేమం’ రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఈ ఎన్నికల్లో పాలక కూటమి – నామినేషన్‌ల దాఖలు నుంచి, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు హింసాకృత్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ప్రతిపక్ష వైసిపి, వామపక్షాలు ఘాటుగా విమర్శిస్తున్నాయి. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో నాటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం – అభ్యర్థులు నామినేషన్‌లు వేయకుండా సాగించిన దాడులు, దౌర్జన్యాలు, హింసా కృత్యాలను గుర్తుకు తెచ్చుకుని మాట్లాడాలని తెలుగుదేశం నాయకులు హెచ్చరిస్తున్నారు. ఆనాడు బెదిరించి 21శాతం పదవులు ఏకగ్రీవం చేసుకున్న జగన్, ఈ పర్యాయం ఏకగ్రీవాలకు అంగీకరించవద్దని తమ నాయకులకు, కార్యకర్తలకు హితవు చెప్పారు. ఎదురయ్యే దౌర్జన్యాలను ఊహించే కావచ్చు మన టార్గెట్ 2029 అసెంబ్లీ ఎన్నికలని, ఆ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేయాలంటే ఈ ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాలన్నారు. అయితే తన సొంత నియోజకవర్గం పులివెందులలో పోలింగ్ రోజు కాసేపు అలజడి సృష్టించటం మినహా ఆయన స్వయంగా ఏ జిల్లాలో పర్యటించలేదు. కంచుకోట పులివెందుల మున్సిపాలిటీ, కడప కార్పొరేషన్ సహా జిల్లాలోని మొత్తం 9 పురపాలికలను, జిల్లా పరిషత్‌ను ఎన్నికల చరిత్రలో తొలిసారి టిడిపి కోల్పోవటం నైతికంగా ఆ పార్టీకి దెబ్బ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ‘వై నాట్ కుప్పం’ అన్న వ్యక్తి పులివెందులను కోల్పోవటం వైఎస్ కుటుంబ తిరుగులేని ఆధిపత్యానికి గండికొట్టింది.

ఈ స్థానిక ఎన్నికలు ప్రత్యేక పరిస్థితుల్లో జరిగాయి. ముఖ్యంగా నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు కోస్తాను అతలాకుతలం చేసిన రెండు తుపానుల మధ్య (అర్ణవ్, మురసు) మున్సిపల్ సంస్థలకు, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణ జరిగింది. పెద్దగా ఎన్నికల ప్రచారం లేదు. అయినా ఓటర్లు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. 13 మున్సిపల్ కార్పొరేషన్స్‌లో 12 (అనంతపురం మినహా) టిడిపి కూటమికి కట్టబెట్టారు. ఇక్కడ కూడా అత్యధిక వార్డులు కూటమివే. 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైసికి మూడే దక్కాయి. కాగా 28జిల్లా పరిషత్‌లలో 27(అల్లూరిజిల్లా) కూటమిని వరించాయి. 7 కార్పొరేషన్స్‌లో ప్రతిపక్షమే లేదు. మండల పరిషత్‌ల్లో ఆ దామాషా కొంత తగ్గింది. తమ కూటమికి 2024 అసెంబ్లీ ఎన్నికలకన్నా 3.6శాతం ఓట్లు పెరిగి 58.9శాతం చేరుకున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. కాగా వైసిపి ఓటు 398శాతం నుంచి 33.56శాతానికి తగ్గింది. మొత్తంమీద కూటమి–వైసిపి మధ్య ఓట్ల వ్యత్యాసం 25.34 శాతానికి చేరిందని బాబు చెప్పారు.

ఇవి గణాంకాలు – ఎవరూ నిరాకరించలేరు. అయితే ఎన్నికలు పాలక కూటమి చెప్పుకుంటున్నట్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగాయా? స్థానిక ఎన్నికల ఫలితాలు సర్వసాధారణంగా అధికారంలో ఉన్న పార్టీ లేదా కూటమికి అనుకూలంగానే వస్తాయి. కూటమి గెలుపొందిన 94 మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సీట్లలో అతి పెద్దభాగం(70) టిడిపిదే. జనసేన 20, బిజెపి 4. కాగా జిల్లా పరిషత్‌లు టిడిపి స్వీప్ చేసింది. అది కొన్ని ఛైర్‌పర్సన్ పదవులను మిత్రధర్మంగా వదులుకోవలసి ఉంటుంది. అయితే పాలక కూటమి చెప్పుకుంటున్నట్లు ఎన్నికలు పూర్తిగా ప్రశాంతం కాదు. పాత ఫ్యాక్షన్ ప్రాంతాల్లో, ముఖ్యంగా రాయలసీమ, పల్నాడు జిల్లాలో కొన్ని పరిమిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు ప్రధానంగా జరిగాయి. కొన్ని చోట్ల కూటమి నాయకులు ప్రత్యర్థులను అడ్డగించారు, చెదరగొట్టారు, నామినేషన్ పత్రాలు లాక్కొని చించివేశారు, నామినేషన్ కేంద్రాల్లో, కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సైతం హింస చోటు చేసుకుంది. టిడిపి కూటమి అధికారం అండతో ఏకపక్ష ఆధిపత్యం కోసం ప్రయత్నించటం, పాత ఫ్యాక్షనిస్టులు తమ పెత్తనం నిలుపుకోవటానికై ప్రతిఘటించటమే ఈ దౌర్జన్యాలు, హింసకు హేతువు. సహజసిద్ధ సూత్రం ప్రకారం పాలక కూటమిది పైచేయి అయింది. అయితే శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు హింసాత్మక ఘటనలు సంభవించకపోవటం, ఓటర్లు వర్షపు నీటిలో సైతం ఉత్సాహంగా వచ్చి అత్యధికశాతం పోలింగ్ నమోదు చేయటంపై హింసాత్మక ఘటనలను చూచి విస్మరించదగినది కాదు. జగన్మోహన్‌రెడ్డి రాజధాని ‘మావిగన్’ ప్రాంతం మొత్తం కూటమి అభ్యర్థులను గెలిపించటం కొసమెరుపు.



సమస్యలు పరిష్కరించలేకనే కొత్త పదాలు

ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించలేకపోతున్నారు. సమస్యలకు పరిష్కారాలు చూపకుండా ప్రధాని కొత్త పదాలను పరిచయం చేస్తున్నారు. ద్రవ్యోల్బణం నాలుగు రెట్లు పెరిగింది, చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొస్తోంది.రూపాయి విలువ పడిపోతుండగా డాలర్ మరింత బలపడుతోంది. బీహార్‌లో పరిశ్రమలు, కర్మాగారాలు ఎందుకు ఏర్పాటు చేయలేదు? రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి ఉంటే.. ప్రస్తుతం ‘దిమాగీ నక్సల్స్’గా అభివర్ణిస్తున్న వారు ప్రశ్నించే పరిస్థితి వచ్చేది కాదు.

- బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్

అందెశ్రీ.. తెలంగాణ ఆత్మగానం



ప్రజల జీవితాన్ని అక్షరాల్లో ఆవిష్కరించడం, ప్రకృతి సౌందర్యాన్ని కవిత్వంలో పలికించడం, మానవ సంబంధాల్లోని ఆర్ద్రతను పాటల్లో ప్రతిబింబించడం, పల్లె జీవనంలోని అనుభూతులను ప్రపంచానికి పరిచయం చేయడం అందె శ్రీ ప్రత్యేకత. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పాటలోనూ తెలంగాణ మట్టి పరిమళం, ప్రజల జీవన సంఘర్షణ, ప్రకృతి పై ప్రేమ కనిపిస్తాయి. అందుకే ఆయన ప్రజాకవిగా, ప్రకృతి కవిగా, తెలంగాణ సాహితీ శిఖరంగా గుర్తింపు పొందారు. తెలంగాణ ఉద్యమానికి అక్షరాయుధమైన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జులై 18న ప్రస్తుత సిద్దిపేట జిల్లా రేబర్తిలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. పాఠశాల విద్యకు దూరమై పశువుల కాపరిగా జీవనం సాగించారు. అనంతరం తాపీపని చేస్తూ జీవితాన్ని కొనసాగించారు. అక్షరజ్ఞానం లేని స్థితి నుంచి స్వయంకృషితో చదవడం, రాయడం నేర్చుకుని ఆశుకవిగా ఎదగడం ఆయన జీవితంలోని అసాధారణ పరిణామం. ఆశువుగా పాటలు పాడుతూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. ‘పల్లె నీకు వందనాలమ్మో’ అంటూ గ్రామీణ జీవన సౌందర్యాన్ని కీర్తించారు. ‘మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు’ అంటూ ఆధునిక సమాజం లో మానవ సంబంధాలు క్షీణిస్తున్న తీరును ప్రశ్నించారు. జనజీవనంలోని బాధలు, ప్రకృతి అందాలు, సామాజిక మార్పుల ఆకాంక్షలను తన పాటల్లో ప్రతిధ్వనించిన అందెశ్రీ గతేడాది నవంబర్ 10న తుది శ్వాస విడిచారు.

తెలంగాణ రాష్ట్ర గీతానికి పునాది వేసిన కవి

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ పాత్ర ప్రత్యేకమైనది. 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాం కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక గీతం అవసరమనే ఆలోచన నుంచి ‘జయ జయహే తెలంగాణ’ పాటకు రూపకల్పన జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆ పాట ఒక ప్రాంతపు ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని, చారిత్రక అస్తిత్వాన్ని ప్రతిధ్వనించింది. వందేమాతరం భారత స్వాతంత్ర్యోద్యమంలో స్ఫూర్తిగీతంగా నిలిచినట్లే, జయ జయహే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం లో ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచింది. అలాగే ప్రజాకవి గద్దర్‌తో పాటు పలువురు ఉద్యమ కళాకారుల బాటలో అందెశ్రీ తన అక్షరాన్ని ఉద్యమ ఇంధనంగా మార్చారు. విప్లవ చిత్రాల దర్శకుడు ఆర్.నారాయణమూర్తి సినిమాలకు పాటలు రాశా రు. ‘బతుకమ్మ’ చిత్రానికి మాటలు అందించారు. తెలంగాణ ధూంధాం వేదికలపై తన పాటలతో ఉద్యమానికి ఊపిరి పోశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ‘జయ జయహే తెలంగాణ’ గీతానికి రాష్ట్రగీతంగా గుర్తింపు లభిస్తుందని ప్రజలు ఆశించారు. కానీ నాటి ప్రభుత్వంలో ఆ గుర్తింపు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024లో అందెశ్రీ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించడం ఒక సానుకూల పరిణామం. ఇది ఆయన సాహిత్య ప్రతిభకు, తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవకు లభించిన గుర్తింపు.

(నవంబర్ 10 న ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ ప్రథమ వర్ధంతి సందర్భంగా)

సంపతి రమేష్, 7989579428.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో వామపక్షాల విజయాలు

బ్రాంకో మార్సెటిక్

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు కేవలం డెమొక్రాట్లకు మాత్రమే మంచి వార్తగా భావించవద్దు. ఫెడరల్, రాష్ట్ర స్థాయిలలో ఈ డెమొక్రాటిక్ మెజారిటీల మధ్య పనిచేస్తున్న వామపక్షాలకు, గత పదేళ్లుగా క్షేత్రస్థాయి నుంచి నిశ్శబ్దంగా నిర్మించుకుంటూ వస్తున్న తమ రాజకీయ ప్రాధాన్యతలను మాటల నుంచి ఆచరణలోకి మార్చుకోవడానికి ఇదొక చారిత్రాత్మక అవకాశం అయింది.

ఇది ఫెడరల్ స్థాయిలో కూడా వర్తిస్తుంది. ట్రంప్‌కు వైట్‌హౌజ్‌లో మరో రెండేళ్ల పదవీకాలం ఉంది. ఆయన చేసిన అనేక అక్రమాలు, దుర్వినియోగ రికార్డులపై ఈ కాలంలో పట్టు సాధించేందుకు డెమొక్రాట్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఏదైనా వాస్తవంగా సాధించవచ్చనేంత అతి స్వల్ప ఆశ కూడా ఉంది. డెమొక్రాట్లతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ‘కేవలం రెండేళ్లపాటు ప్రతిదానిని వీటో చేస్తూ కూర్చోవాలని అనుకోవడం లేదు’ అని ట్రంప్ ఫలితాల తరువాత పొలిటికో పత్రికకు ఫోన్ చేసి మరీ స్పష్టం చేశారు. గతంలో ట్రంప్ వైట్‌హౌస్‌లో ఉన్నప్పుడు, డెమొక్రాటిక్ (డెమొక్రాట్‌ల అధికృత కలిగిన) కాంగ్రెస్‌తో కలిసి పనిచేసిన సమయంలోనే (కరోనా కాలం) అమెరికా లో దశాబ్దాల కాలంలోనే అతి పెద్ద సంక్షేమ రాజ్య విస్తరణ జరిగింది. ఇప్పుడు కూడా అటువంటి అవకాశాలు ఆవిర్భవించవచ్చు. వసతులు, ప్రస్తుతం ఆయన ఒక చారిత్రాత్మక వైఫల్యంగా ముగిసే ప్రమాదం ఉండటం వంటివి మెరుగైన ఫలితాలు రావడానికి కనీసం కొంత అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

వామపక్షాలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలవు. ఈ కొత్త కాంగ్రెస్‌లోకి వామపక్షాలు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంత బలమైన సంఖ్యతో ప్రవేశించనున్నాయి. డెమొక్రాటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా (డిఎస్‌ఎ) నుండి కనీసం ఏడుగురు సభ్యులు ఎన్నికయ్యారు. ఇది కాంగ్రెస్‌లో మొదటిసారిగా ఒక ప్రత్యేక సోషలిస్ట్ కాకస్ (బృందం)ను ఏర్పాటు చేయడానికి చారిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుంది. అంతేకాకుండా ‘ది స్క్వాడ్’ తరహాలో 20 మంది వరకు సభ్యులు ఉండే ఒక ప్రగతిశీల ‘బ్లాక్’ (కూటమి) ఏర్పడే అవకాశం ఉంది.

2020 నాటి ఉదారమైన కోవిడ్ మహమ్మారి విధానాలలో, ట్రంప్, ఆ తర్వాత జో బైడెన్ ఇద్దరి ఉద్దీపన ఉపశమనాలు కూడా సోషలిస్ట్, ప్రగతిశీల కాంగ్రెస్ సభ్యుల బహిరంగ డిమాండ్ల ద్వారానే రూపుదిద్దుకున్నాయి. ఆ తర్వాత స్పష్టమైన ప్రజా అవసరం, ప్రజాదరణ ఆధారంగా అవి చట్టాలలోకి మారాయి.

మధ్యేవాద డెమొక్రాట్లు సైతం రాజకీయాల గురించి మాట్లాడే విధంగా సోషలిస్టులు ఇప్పటికే పరిస్థితులను మార్చిన ఒక ప్రపంచంలో ఈసారి వామపక్షాలు తమ వాదనలను వినిపించబోతున్నాయి. న్యూయార్క్ సోషలిస్ట్ మేయర్ జోహ్రాన్ మామ్దానీ, సోషలిస్టు ద్వయం సాండర్స్, అలెగ్జాండ్రియా ఒకాసియో–కోర్టెజ్ (AOC) వంటి సోషలిస్టులు ‘ఫైటింగ్ ఒలిగార్కీ’ని (ధనస్వామ్యంపై పోరు) ప్రాచుర్యంలోకి తీసుకువచ్చినందున, బిలియనీర్ వ్యతిరేక వాదనల వైపు మొగ్గు అవకాశం ఉంది. దీర్ఘకాలిక ‘నియమాలు’, ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి ఏడాదిగా డెమొక్రాటిక్ పార్టీ ఆరాటం చాలావరకు వెనకబడిపోయింది.

అంతేకాకుండా, మిడ్ టర్మ్ ఎన్నికలో లభించిన అనేక ప్రధాన విజయాల ద్వారా, వామపక్షాల మౌలిక వాదనలను పక్కన పెట్టడానికి, ప్రాధాన్యత తగ్గించడానికి ఉపయోగించిన వాదనలను వామపక్షాలు పూర్తిగా తిప్పికొట్టగలిగాయి.

మిచిగన్ సెనేట్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌పై అబ్దుల్ ఎల్ సయేద్ ఏకంగా 7 శాతం ఓట్ల భారీ మెజారిటీతో సాధించిన విజయం కంటే పెద్ద వామపక్ష విజయం ఏదీ లేదు. మే నెలలో తాను ఇచ్చిన మాట ప్రకారమే ఎల్ సయేద్ ఈ భారీ మెజారిటీని సాధించారు. ఆయన దారుణంగా విఫలమవుతారంటూ చేసిన అంతులేని అంచనాలను తిప్పికొట్టారు.

ఈ ఏడాది ఈ పర్పుల్ స్టేట్ (స్వింగ్ స్టేట్) సెనేట్ స్థానం కోసం జరిగినంత కీలక పోరు మరొకటి లేదు. బ్లూ స్ట్రాంగ్ హోల్డ్స్ (బలమైన డెమొక్రాటిక్ స్థానాల) వెలుపల కూడా ప్రగతిశీలవాదులు పోటీ చేసి గెలవగలరని నిరూపించాలని వామపక్షాలు భావించాయి.

ఇది మాగా వైఫల్యానికి ప్రతీక. ముఖ్యంగా, రెండుసార్లు ఓడిపోయిన, జీవితాంతం యుద్ధాలను ప్రోత్సహించిన మైక్ రోజర్స్‌కు ఇది పరాభవం. అమెరికన్ ఇజ్రాయెల్ పబ్లిక్ అఫైర్స్ కమిటీ (ఎఐపిఎసి), ఇజ్రాయెల్ అనుకూల లాబీకి ఇది ఒక పెద్ద విపత్తు. వీరు ప్రైమరీ, జనరల్ ఎన్నికల సమయంలో ఎల్ సయేద్‌ను ఓడించడానికి కోట్లాది డాలర్లు ఖర్చు చేశారు. ఆయనను అప్రతిష్టపాలు చేయడానికి, ఓటర్లలో ముఖ్యంగా యూదు ఓటర్లలో ఆయనపై భయాన్ని నింపడానికి సర్వశక్తులూ ఒడ్డారు.



సోషలిస్టు భావాలు కలిగిన స్వతంత్ర సెనేటర్ బెర్నీ సాండర్స్ మద్దతు పలికిన 20 మంది అభ్యర్థులలో 18 మంది ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. కేవలం ఇద్దరు మాత్రమే ఓడిపోయారు. డిఎస్‌ఎ లేదా జస్టిస్ డెమొక్రాట్స్ వంటి సంస్థల మాదిరిగా సాండర్స్ ప్రతిపాదనలు ప్రత్యక్షంగా వామపక్ష భావజాలం తో కూడినవి కావు. వాటిలో ఎల్ సయేద్, జాక్సన్ వంటి అభ్యర్థులతో పాటు, తమ ప్రైమరీలలో కార్పొరేట్ అనుకూల ప్రత్యర్థులను ఓడించిన మినెసోటా సెనేటర్ ఎలెక్ట్ పెగ్ ఫ్లాగన్ వంటి అధికార పార్టీ అభ్యర్థులు కూడా ఉన్నారు. న్యూయార్క్ నగరానికి చెందిన క్లైర్ వాల్డెజ్, కొలరాడోకు చెందిన మేలాట్ కిరోస్ వంటి డిఎస్‌ఎ అభ్యర్థుల నుంచి.. దశాబ్దాల పాటు డెమొక్రాట్ల ఆధ్వర్యంలో ఉన్న, ట్రంప్‌కు ఓటు వేసిన గ్రామీణ విస్కాన్సిన్ జిల్లాను గెలుచుకున్న రెబెక్కా కుక్ వంటి ఒక మోస్తరు ప్రగతిశీల అభ్యర్థుల వరకు అందరూ వీరిలో ఉన్నారు.

సన్‌రైజ్ మూవ్‌మెంట్ సహ వ్యవస్థాపకుడు విలియం లారెన్స్ కూడా వీరిలో ఉన్నారు. మిషిగన్ స్వింగ్ స్టేట్‌లోని ఒక స్వింగ్ స్థానాన్ని ఆయన కైవసం చేసుకున్నారు. డెమొక్రాటిక్ అభ్యర్థులలో బలమైన వామపక్ష వ్యక్తిగా ముద్ర ఉన్న ఎల్ సయేద్‌పై ముద్ర ఉన్నప్పటికీ (వామపక్ష ముద్ర ఆయనను కచ్చితంగా ఓడిపోయేలా చేస్తుందని చెప్పినప్పటికీ), ఆయన విజయం సాధించారు. శిలాజ ఇంధన పరిశ్రమను జాతీయం చేయాలని కోరిన పాత ట్వీట్‌ల కారణంగా లారెన్స్ ప్రచారం మధ్యలో డిఎస్‌ఎ నుండి వైదొలగాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయన విజయం సాధించారు. డేటా సెంటర్ మారటోరియం (డేటా సెంటర్‌పై తాత్కాలిక నిషేధం), మెడికేర్ ఫర్ ఆల్ (అందరికీ ఆరోగ్య రక్షణ) వంటి ప్రగతిశీల జనాకర్షక ప్రచార విధానాలపై ఆధారపడి, డెమొక్రాట్ల సెంట్రిజం (మధ్యేవాద రాజకీయాల) ప్రసిద్ధ నిపుణుడు, సిఐఎ మాజీ విశ్లేషకుడు ఎలిస్సా స్లాట్కిన్ ప్రాతినిధ్యం వహించిన పర్పుల్ జిల్లాను లారెన్స్ గెలుచుకున్నారు.

రాష్ట్ర శాసనసభలు, నగర కౌన్సిళ్లు, మేయర్ పదవులు, బ్యాలెట్ మెజారిటీల వరకు అన్ని విభాగాలలోనూ డిఎస్‌ఎ మొత్తం 130 విజయాలను నమోదు చేసింది. వ్యాసం రాసే సమయానికి 42 స్థానాల్లో ఓటమి చవిచూడగా, 58 స్థానాల్లో ఫలితాలు రావాల్సి ఉంది. ఆంజీ నిక్సన్ తన సెనేట్ రేసులో వెనుకబడినప్పటికీ, పర్యావరణవేత్త ఆష్లే హెర్మాన్ ఫ్లోరిడాలో ఎన్నికైన రెండవ సోషలిస్టుగా, గత శతాబ్ద కాలంలో ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన తొలి సోషలిస్టుగా చరిత్ర సృష్టించారు. రెండేళ్ల క్రితం రిపబ్లికన్ అభ్యర్థి 58 శాతం ఓట్లతో గెలిచిన స్వింగ్ జిల్లాను ఆమె కైవసం చేసుకున్నారు. కెంటకీ రాష్ట్ర అసెంబ్లీకి రాబర్ట్ లెవెర్టిస్ బెల్ ఎన్నిక కావడం, జార్జియా జనరల్ అసెంబ్లీకి మాథెవోస్ సాంసన్ ఎన్నిక కావడం (గాబ్రియెల్ సాంచెజ్ పునర్నియామకంతోపాటు) ఇతర ప్రముఖ సోషలిస్ట్ విజయాలు.

ప్రాథమిక ఎన్నికల (ప్రైమరీలు) తర్వాత అనివార్యమైన ఫలితాలుగా మారిన అనేక మేయర్ ఎన్నికలు కూడా విశేషమైనవి. జనీస్ లూయిస్ జార్జ్ ఇప్పుడు వాషింగ్టన్ డి.సి.కి మొదటి సోషలిస్ట్ మేయర్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అఫోర్డబుల్ హౌసింగ్ ప్లాన్ (చౌక గృహనిర్మాణ ప్రణాళిక), అద్దె స్థిరీకరణను విస్తరించడం వంటి అంశాలపై ప్రచారం చేసి ఆమె విజయం సాధించారు. రోడ్ ఐలాండ్‌లోని ప్రావిడెన్స్‌లో సోషలిస్ట్ డేవిడ్ మోరల్స్ ఘనవిజయం సాధించారు. గృహనిర్మాణ సంక్షోభంతో అల్లాడిపోతున్న ఆ నగరంలో సోషలిస్ట్ నేతృత్వంలోని సిటీ కౌన్సిల్‌తో కలిసి ఆయన కఠినమైన అద్దె నియంత్రణ చర్యలను అమలు చేయనున్నారు. గృహనిర్మాణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఈ చర్యను తీసుకురాగా, గతంలో ఆయనపై గెలిచిన సిట్టింగ్ మేయర్ దీనిని వీటో చేశారు.

లాస్ ఏంజిల్స్ మేయర్ రేసు మరింత సంక్లిష్టమైనది. ఇక్కడ సోషలిస్ట్ సిటీ కౌన్సిలర్ నిత్యా రామన్, కరెన్ బాస్‌ను ఓడించే దిశగా దూసుకుపోయారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ‘బాయ్‌కాట్, డైవెస్ట్మెంట్, అండ్ శాంక్షన్స్’ (బిడిఎస్) ఉద్యమాన్ని పూర్తిగా సమర్థించనందుకు, దానిపై ప్రశ్నించనందుకు స్థానిక డిఎస్‌ఎ చాప్టర్ ఆమెకు మద్దతు ఇవ్వడం కొంత వివాదాస్పదమైంది. దీనివల్ల డిఎస్‌ఎ జాతీయ రాజకీయ కమిటీ ఆమెకు మద్దతును దాదాపు రద్దు చేయాలని చూసింది. అయితే కేవలం ఒక్క ఓటు తేడాతో ఆ ప్రయత్నం వీగిపోయింది. ఈ ఎన్నికలో లాస్ ఏంజిల్స్ మేయర్‌గా 21 ఏళ్ల నిత్యా రామన్ మొదటిసారిగా సిట్టింగ్ మేయర్‌ను ఓడించి రికార్డు సృష్టించారు.

దేశవ్యాప్తంగా ఓటర్ల మెజారిటీ మద్దతుతో ఆమోదించిన అనేక ప్రగతిశీల బ్యాలెట్ చర్యలు కూడా దీనికి తోడయ్యాయి. మిస్సోరీలో గర్భవిచ్ఛిత్తి నిషేధ బ్యాలెట్ మెజారిటీ తిరస్కరణ, మోంటానాలో ఎన్నికలలో డార్క్ మనీపై విజయవంతమైన నిషేధం, ప్రావిడెన్స్‌లో ఇజ్రాయెల్ నుండి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ఇందుకు ఉదాహరణలు. బహుశా అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, డేటా సెంటర్‌ల నిర్మాణాన్ని పరిమితం చేసే బ్యాలెట్ చర్యలు ఇప్పటివరకు దేశవ్యాప్తంగాకి ఒక చోట మినహా 41 చోట్ల విజయం సాధించాయి. ఇది విస్తృతంగా వామపక్షాలు ప్రతిపాదించి, ప్రాచుర్యంలోకి తెచ్చిన వైఖరికి దక్కిన స్పష్టమైన ప్రజా ఆమోదం.

గత దశాబ్ద కాలంగా, డెమొక్రాటిక్ పార్టీ ఎదురుదెబ్బలు తిన్నప్పుడు కూడా సోషలిస్టులు, ప్రగతిశీలవాదులు మంచి ఎన్నికల ఫలితాలను సాధించారు. అలాగే డెమొక్రాట్లు సంబరాలు చేసుకున్నప్పుడు వీరు ఇబ్బందులు పడ్డారు. కానీ తాజా ఎన్నికల్లో వామపక్షాలు, మధ్యేవాద పార్టీ రెండూ ఏకకాలంలో చారిత్రాత్మక విజయాలను చవిచూడటం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. గత రెండేళ్లలో, ట్రంప్ మితవాద దాడికి వ్యతిరేకంగా, అలాగే దాన్ని ఎదుర్కోవడానికి ‘ స్థోమత కోసం, అపార సంపదకు వ్యతిరేకంగా పోరాటం’ అనే సమర్థవంతమైన వాదనను రూపొందించడానికి వామపక్షాలే అత్యంత ఇష్టపడే శక్తి అని నిరూపించబడ్డాయి. వామపక్ష విధానాలు, నినాదాలు డెమొక్రాటిక్ ఓటర్లకు ఎన్నికలలో భారంగా మారుతాయని దశాబ్దాలుగా చెప్పిన మాటలు అబద్ధమని నిన్నటి రాత్రి రుజువు చేసింది. దశాబ్దాలుగా డెమొక్రాటిక్ ఓటర్లు ప్రతి ఎన్నికలలో తమ మస్తిష్కం, హృదయం మధ్య ఏదో ఒకదానిని ఎంచుకోవాల్సిన బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొన్నారు. వామపక్షాలు బహుశా వారిని ఆ సందిగ్ధత నుండి విముక్తం చేసి ఉండవచ్చు.

అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం డెమొక్రాట్‌లలో పోటాపోటీ

డెమొక్రటిక్ పార్టీ విజయాలు 2028లో అధ్యక్ష నామినేషన్ కోసం పోటీ పడగల పలువురు గవర్నర్లు, జాతీయ ప్రముఖుల స్థానాన్ని బలోపేతం చేశాయి. వీరిలో మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్, ఇల్లినాయిస్ గవర్నర్ జె.బి. ప్రిట్జ్‌కర్, పెన్సిల్వేనియా డెమొక్రాట్ జాన్ షాపిరో, మాజీ రవాణా శాఖ కార్యదర్శి పీట్ బుట్టిగీగ్, న్యూయార్క్‌కు చెందిన వామపక్ష హౌస్ ప్రతినిధి అలెగ్జాండర్ ఒకాసియో కార్టెజ్ ఉన్నారు.

మరుగునపడిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు యాదగిరిరావు

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జనగాం ప్రాంతంలో ఒక కీలక పాత్ర వహించిన చకిలం యాదగిరిరావు 2001 నవంబర్ 10న చనిపోయారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో జనగామ ప్రాంతంలో 194648 లో చకిలం యాదగిరిరావు ఒక ప్రధానమైన విరోచితమైన మరియు చారిత్రాత్మక పాత్ర పోషించారు. 1946 48 లో జోనల్ కమాండర్ గా పనిచేశారు. ఈ ప్రాంతంలో ఎల్లప్పుడూ రజాకారుల శిబిరం ఉండేది. రజాకార్లు ప్రతిరోజు అమాయక నిరాయుధ గ్రామస్తులపై అఘాయిత్యాలకు పాల్పడేవారు. భారత సైన్యం నుండి విరమించిన తన సొంత సోదరుడైన కృష్ణారావును 1948 మార్చ్ 25న నామవరం గ్రామంలో రజాకార్లు కాల్చి చంపారు. ఈ వార్త తెలుసుకున్న చకిలం యాదగిరిరావు తీవ్రమైన మానసిక వేదనకు గురై.. రజాకార్లకు గుణపాఠం నేర్పాలని తన గ్రామ దళాలను, కేంద్ర దళాలను అప్రమత్తం చేశారు. 1948 లో బైరాన్ పల్లి గ్రామంలో రజాకర్లకు గ్రామదళాలకు మధ్య అనేక ఎదురు కాల్పులు జరిగాయి. గ్రామ దళాల దాడుల్లో పదుల సంఖ్యలో రజాకార్లు, పోలీసు సిబ్బంది హతమయ్యారు. ఈ అవమానాన్ని సహించలేని నిజాం ప్రభుత్వం, సైనిక ట్యాంకులు ఆత్యాధునిక ఆయుధాలతో కూడిన తన భారీ సైన్యాన్ని పంపింది.1948 ఆగస్టు 25వ తేదీన తెల్లవారుజామున గ్రామాన్ని అన్ని వైపులా నుండి లొంగిపోయేలా చేశారు. ప్రత్యర్థి బలం తెలియని గ్రామ దళాలు, బురుజు పై నుండి కాల్పులు ప్రారంభించాయి. సైనిక ట్యాంకులు, బురుజులు బద్దలు కొట్టి దళ సభ్యులందరినీ హతమార్చాయి. సైన్యం గ్రామంలోకి ప్రవేశించి బైరంపల్లి, కుటికల్లు గ్రామాలలో 108 మందిని కాల్చి చంపారు. ఇందులో నుండి తప్పించుకున్న దళనాయకులలో యాదగిరిరావుతో పాటు నలుగురే మిగిలారు.ఈ ఘటనతో యావత్ భారతదేశం దిగ్భ్రాంతికి గురైంది. దీనిపై భారత పార్లమెంటులో పెద్ద దుమారం రేగింది.



యాదగిరి రావు జీవితంలో ముఖ్యమైన సంఘటనలు :

సూర్యాపేట తాలూకాలోని ముక్కుడు దేవపల్లి గ్రామానికి చెందిన చకిలం చూడమ్మా శ్రీనివాసరావుల పెద్ద కుమారుడు యాదగిరిరావు. వీరిది ఒక మధ్య తరగతి ఉన్నత కుటుంబం. వీరు 1923 సంవత్సరంలో వీరి మేనమామ గారింట మరిపెడ (మహబూబాబాద్ తాలూకా) గ్రామంలో జన్మించారు. మహబూబాబాద్‌లో 5 తరగతి వరకు చదువుకున్నారు. ఆ గ్రామము దేశ్ముఖ్ నియంత్రణలో ఉండేవి. వారి కార్యకలాపాలు ఆయనకు నచ్చలేదు. ఆయన సంపూర్ణ సమానత్వం పై ఆధారపడిన సమాజాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన తన చదువును వదిలి రాజకీయాల్లో చేరారు. 18 ఏళ్ల వయసులో ఆయన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 1942 అరెస్టు అయ్యారు. 1943లో సూర్యాపేట తాలూకాలోని దేశాయ్ గూడెం గ్రామంలో ఆయన బుర్రకథ నిర్వహించి జర్మనీ మరియు జపాన్లకు వ్యతిరేకంగా ప్రసంగించారు. దాని ఫలితంగా ఆయనకు ఒక సంవత్సరం జైలు శిక్ష పడింది. జైలు నుంచి వచ్చిన తర్వాత ఆంధ్ర మహాసభ లో ముఖ్య కార్యకర్తగా కార్యక్రమాలలో పాల్గొంటూ.. మహాసభ ఆదేశాల మేరకు చకిలం యాదగిరి రావు, చకిలం తిరుమల్ రావు మరియు డి వి రాఘవేంద్రరావుతో కలిసి సూర్యాపేట తాలూకాలో వ్యవసాయ కౌలుదారుల రక్షణ, వ్యవసాయ కూలీల వేతనాల పెంపు మరియు ఉచిత బలవంతపు చాకిరీ నిర్మూలన కోసం ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. సూర్యాపేట ప్రాంతంలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకులైన దేవులపల్లి వెంకటేశ్వరరావు నాయకత్వంలో వారి ఆదేశాల మేరకు మైదం చెరువు వివాదంలో లంబాడీలను సంఘటీతం చేసి, భూస్వాములకు వ్యతిరేకంగా వారి హక్కులను పరిరక్షణ కోసం పోరాడారు.

1945-46లో కమ్యూనిస్టు పార్టీ నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడిగా పని చేశారు.

పెంబర్తి పోలీస్ స్టేషన్ పై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం నిజాం ప్రభుత్వం అన్ని పోలీస్ స్టేషన్లలో భద్రతను అప్రమత్తం చేసింది. 1946 లో ఆయన పాలకుర్తి పోలీస్ స్టేషన్ పై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆయనను అరెస్టు చేసి, హైదరాబాదులోని సెంట్రల్ జైలులో బంధించి, అక్కడి నుంచి నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. న్యాయమూర్తి తనకు 7 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2000/ జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరిస్తున్నారని తెలియగానే, ఆయన నల్లగొండ జైలు నుంచి తప్పించుకొని జనగాం ప్రాంతంలో సాయుధ పోరాట నాయకుడిగా అవిర్భవించారు.

చకిలం యాదగిరిరావుకు నల్ల నరసింహులు, నెల్లుట్ల వెంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్ర రెడ్డి, బి.యన్.రెడ్డి, ధర్మ భిక్షం, పెండ్యాల రాఘవరావు, ఓంకార్ మొదలగు వారు సాయుధ పోరాటంలో సహితులుగా ఉండేవారు. యాదగిరి రావు దళంలో ఏసి రెడ్డి నరసింహారెడ్డి, కాసాని నారాయణ మొదలగు వారు సభ్యులుగా పనిచేశారు.1949 నుండి 1952 వరకు వివిధ జైల్లాలో శిక్ష అనుభవిస్తూ స్వాతంత్ర్యానంతరం1952 లోమద్రాసులోని కేంద్ర జైలు నుండి యాదగిరిరావు విడుదలయ్యారు. ఆయన జనగామ తాలూకాలోని గొల్లపల్లి గ్రామానికి 1959–64 మరియు 1970–81 మధ్య రెండు పర్యాయాలు సర్పంచ్ గా 1964–69 మధ్య జనగాం పంచాయతీ సమితికి ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1965 వ సంవత్సరంలో యాదగిరిరావును భారత రక్షణ చట్టం కింద అరెస్టు చేసి, విశాఖపట్నంలోని కేంద్ర జైలులో, ఆ తరువాత ముషీరాబాద్ జిల్లా జైలు ఉంచి 1966 లో విడుదల చేశారు.

ఆయన తన జీవిత చరమాంకాన్ని హన్మకొండలోని తన స్వగృహంలో గడిపారు. 2001 నవంబర్ 10న యాదగిరి రావు తన 78వ ఏటా తు విశ్వాస విడిచారు. వీరికి చకిలం ఉపేందర్ రావు, చకిలం నాగేందర్ రావ్ ఇద్దరు కుమారులు ఉన్నారు.

నైజాం రాచరిక వ్యవస్థకు.. భూస్వామ్య, దేశ్ముఖ్ జాగీర్దారి నిరంకుశ దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న పోరాట యోధున్ని వారి 25 వర్ధంతి సందర్భంగా స్మరించుకుందాం.

మరుగున పడిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు చకిలం యాదగిరి రావు గారి పోరాట స్ఫూర్తిని నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9590952646

హైదరాబాద్ నింగిలోకి దూసుకెళ్తోంది!



- రఫేల్ నుంచి రాకెట్ల వరకు.. ప్రపంచ రక్షణ, విమాన తయారీ రంగంలో తెలంగాణకు కొత్త గుర్తింపు
- పెట్టుబడులు, ఉపాధి, ఎగుమతులే లక్ష్యం.. రాష్ట్రాన్ని గ్లోబల్ ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- 'ప్రజాపక్షం'తో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



(బిరుదరాజు వాసుదేవరాజు)

''ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), ఔషధ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హైదరాబాద్ ఇప్పుడు రక్షణ, విమానాల తయారీ రంగాల్లోనూ ప్రపంచ పటంపై తనదైన ముద్ర వేస్తోంది. రఫేల్ యుద్ధ విమానాల విడిభాగాల తయారీ నుంచి విమాన ఇంజిన్ల నిర్వహణ, ప్రైవేటు రాకెట్లు, డ్రోన్ల తయారీ వరకు విస్తరిస్తున్న పరిశ్రమలు తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చుతున్నాయి. రక్షణ, విమాన తయారీ రంగాలకు ప్రధాన కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం'' అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 'హైదరాబాద్‌లో డిసెంబర్ 7–9 తేదీలలో జరిగే రక్షా ఎక్స్‌పో' సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుతో 'ప్రజాపక్షం' ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

ప్రశ్న: హైదరాబాద్ రక్షణ, వైమానిక తయారీ రంగంలో అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోంది. ఈ పరిణామాన్ని ఎలా చూస్తున్నారు?

శ్రీధర్‌బాబు: హైదరాబాద్ పారిశ్రామిక ప్రస్థానంలో ఇదొక కీలకమైన మలుపు. ఒకప్పుడు ఐటి, ఫార్మా రంగాలకు మాత్రమే ప్రధానంగా గుర్తింపు పొందిన నగరం.. ఇప్పుడు అత్యాధునిక రక్షణ, వైమానిక సాంకేతికతకు కూడా కేంద్రంగా మారుతోంది. ప్రపంచస్థాయి సంస్థలు హైదరాబాద్‌ను తమ తయారీ, నిర్వహణ కేంద్రాల కోసం ఎంచుకోవడం మన పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనం. ఇక్కడ ఇప్పటికే ఉన్న పరిశోధనా సంస్థలు, రక్షణ రంగ ప్రభుత్వరంగ సంస్థలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రెసిషన్ ఇంజినీరింగ్ పరిశ్రమలు ఈ వృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తెలంగాణను అంతర్జాతీయ ఏరోస్పేస్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నది మా దృక్పథం.

ప్రశ్న: రఫేల్ యుద్ధ విమానాల విడిభాగాల తయారీ హైదరాబాద్‌లో జరగడం ఎంతటి ప్రాధాన్యం కలిగిన అంశం?

శ్రీధర్‌బాబు: రఫేల్ యుద్ధ విమానాల తయారీ వ్యవస్థలో హైదరాబాద్‌కు చోటు దక్కడం రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యానికి అంతర్జాతీయ గుర్తింపు. డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు అత్యాధునిక తయారీ సాంకేతికతను రాష్ట్రానికి తీసుకొస్తుంది. విమాన ఫ్యూజ్‌లేజ్ వంటి కీలక భాగాల తయారీకి అత్యంత కచ్చితత్వం, నాణ్యతా ప్రమాణాలు, ప్రత్యేక నైపుణ్యం అవసరం. ఈ ప్రాజెక్టుతో స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ సరఫరా గొలుసులో భాగస్వాములయ్యే అవకాశం లభిస్తుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటాయి. ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, యువతకు నాణ్యమైన ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

ప్రశ్న: విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీలోనూ భారీ పెట్టుబడులు వస్తున్నాయి. దీని ప్రభావం ఎలా ఉండనుంది?

శ్రీధర్‌బాబు: విమాన ఇంజిన్ల తయారీ, వాటి విడిభాగాల ఉత్పత్తి అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రంగం. శంషాబాద్ ఏరోస్పేస్ ప్రత్యేక ఆర్థిక మండలిలో చేపడుతున్న ఇంజిన్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఈ రంగంలో తెలంగాణకు మరింత బలాన్ని ఇస్తుంది. అంతర్జాతీయ విమాన ఇంజిన్ తయారీ సంస్థలకు అవసరమైన విడిభాగాలను ఇక్కడ తయారు చేసే స్థాయికి చేరడం రాష్ట్ర పారిశ్రామిక వ్యవస్థకు కీలకం. ఇటువంటి పెట్టుబడులు కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటుతోనే పరిమితం కావు. వాటికి అనుబంధంగా అనేక సరఫరాదారులు, నాణ్యతా పరీక్షా కేంద్రాలు, సాంకేతిక సేవల సంస్థలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా స్థానిక పారిశ్రామిక వ్యవస్థ మరింత విస్తరిస్తుంది.

ప్రశ్న: సఫ్రాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం వెనుక కారణాలేమిటి?

శ్రీధర్‌బాబు: అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేటప్పుడు సాంకేతిక నైపుణ్యం, మౌలిక సదుపాయాలు, సరఫరా వ్యవస్థ, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, భవిష్యత్తులో విస్తరించుకునే అవకాశాలను పరిశీలిస్తాయి. హైదరాబాద్‌లో ఈ అనుకూలతలు ఉన్నాయి. విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర పరిశీలన (ఎంఆర్‌ఓ) రంగంలో అంతర్జాతీయ స్థాయి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ద్వారా నగరానికి మరో ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

ప్రశ్న: రాకెట్లు, డ్రోన్ల తయారీలోనూ తెలంగాణ ముందుకు వస్తోంది. ఈ రంగాలకు ప్రభుత్వం ఎలాంటి ప్రాధాన్యం ఇస్తోంది?

శ్రీధర్‌బాబు: స్కైరూట్ ఏరోస్పేస్ వంటి అంకుర సంస్థలు అంతరిక్ష రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. డ్రోన్ల తయారీ, వాటి విడిభాగాలు, నియంత్రణ వ్యవస్థలు, పరీక్షా సదుపాయాలు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ఒక్కో సంస్థను ఆకర్షించడం మాత్రమే కాదు. పరిశోధన నుంచి రూపకల్పన, తయారీ, పరీక్షలు, నిర్వహణ వరకు మొత్తం పారిశ్రామిక వ్యవస్థను రాష్ట్రంలో అభివృద్ధి చేయడం.

ప్రశ్న: ఈ పెట్టుబడులతో తెలంగాణ యువతకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి?

శ్రీధర్‌బాబు: యువతకు ఉపాధి కల్పించడం మా ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటి. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ఏర్పడే ఉద్యోగాలు అధిక నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉంటాయి. ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఏవియానిక్స్, కాంపోజిట్స్, సిస్టమ్ ఇంటిగ్రేషన్, నాణ్యతా పరీక్షలు, ఇంజిన్ నిర్వహణ వంటి రంగాల్లో అవకాశాలు పెరుగుతాయి. అయితే ఈ అవకాశాలను స్థానిక యువత అందిపుచ్చుకోవాలంటే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కూడా అందించాలి. విద్యాసంస్థలు, సాంకేతిక శిక్షణ కేంద్రాలు, పరిశ్రమల మధ్య సమన్వయాన్ని పెంచడం అవసరం.

ప్రశ్న: బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీని తెలంగాణ ఎలా ఎదుర్కొంటుంది?

శ్రీధర్‌బాబు: ఇతర నగరాలతో పోటీ పడటమే కాకుండా, మనకు ప్రత్యేకమైన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. విమాన విడిభాగాల తయారీ, ఇంజిన్ నిర్వహణ, రక్షణ ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను నిర్మిస్తే హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం లభిస్తుంది.

ప్రశ్న: రానున్న ఐదేళ్లలో హైదరాబాద్‌ను ఏస్థాయిలో చూడాలనుకుంటున్నారు?

శ్రీధర్‌బాబు: హైదరాబాద్ ప్రపంచస్థాయి సాంకేతిక, పారిశ్రామిక నగరంగా మరింత ఎదగాలి. ఐటి, ఫార్మా రంగాల్లో సాధించిన విజయాలను రక్షణ, వైమానిక తయారీ రంగాల్లోనూ పునరావృతం చేయాలనుకుంటున్నాం. అంతర్జాతీయ సంస్థలు, దేశీయ తయారీదారులు, అంకుర సంస్థలు ఒకే పారిశ్రామిక వ్యవస్థలో కలిసి పనిచేసే వాతావరణాన్ని అభివృద్ధి చేయాలి. తెలంగాణ దేశ రక్షణ స్వావలంబనకు తోడ్పడటంతో పాటు ప్రపంచ వైమానిక రంగంలోనూ తనదైన స్థానాన్ని సంపాదించుకోవాలి. హైదరాబాద్ ఎదుగుదల రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, యువత భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేయాలి.



బత్తాయి రైతాంగ సమస్యల పరిష్కారానికి
పోరాడిన విద్యాసాగర్ రెడ్డి

- సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ : బత్తాయి రైతాంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి చిలుక విద్యాసాగర్ రెడ్డి అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని జులకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఇస్కఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, బత్తాయి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిలుక విద్యాసాగర్ రెడ్డి దశదిన కర్మ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి, కస్తాల సర్పంచ్ లెదన్న సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, బత్తాయి మార్కెట్ ఏర్పాటు కోసం విద్యాసాగర్ రెడ్డి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. రైతాంగ హక్కుల కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలంతో ప్రభావితమై ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించిన వ్యక్తి విద్యాసాగర్ రెడ్డి అని అన్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన నిరంతరం పనిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, ప్రముఖ పత్రిక సంపాదకుడు కట్టా శేఖర్ రెడ్డి, శాంతి సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీఎల్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లపు కోటిరెడ్డి, ప్రముఖ విద్యావేత్త గుండెబోయిన లింగయ్య యాదవ్, ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, బోధనపు సుధాకర్ రెడ్డి, మునగాల అంజిరెడ్డి, శాంతి సంఘం జిల్లా నాయకులు కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్, విద్యాసాగర్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని
వ్యవసాయ వర్సిటీ విసికి సమన్లు

- మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ (విసి)పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ విసికి సమన్లు జారీ చేసింది. మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా కమిషన్ విచారణ చేపట్టింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ తనపై విసి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మహిళా కమిషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు విసిని కమిషన్ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- ఎపి, తెలంగాణలో మళ్లీ వర్ష సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్ : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈనెల 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశముందన్నారు. తెలంగాణలో కూడా అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసే అవకాశముండగా, సోమవారం తర్వాత వాతావరణం మళ్లీ పొడిగా మారే అవకాశముందన్నారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని కదలిక, తీవ్రత ఆధారంగా వర్షాల ప్రభావంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత..

తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతుండగా, రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ తదితర శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్ముకుంటుంది. సాయంత్రం 5.30 గంటల తర్వాత చలి ప్రభావం మరింత పెరుగుతోంది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 నుంచి 16 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోగా, ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు.

హాస్పిటళ్ల స్థాయికి అనుగుణంగా సేవలు

- వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని సెకండరీ హెల్త్ కేర్ హాస్పిటళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ప్రతి హాస్పిటల్‌లో అవసరమైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు, మందులు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 30 పడకలు, 50 పడకలు, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన హాస్పిటళ్లకు వాటి స్థాయికి అనుగుణంగా వైద్య సేవల పరిధిని నిర్ణయించాలని, సిహెచ్‌సిలు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాల్సిన స్పెషాలిటీ విభాగాలు, వైద్య సేవలు, పడకలు, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలపై స్పష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పునర్వ్యవస్థీకరణ అంశంపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌హెచ్ పునర్వ్యవస్థీకరణ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రోగులు చిన్న చిన్న సమస్యలకు కూడా హైదరాబాద్‌కు, మెడికల్ కాలేజీ హాస్పిటళ్లకు వెళ్లే పరిస్థితి తగ్గుతుందన్నారు. ఏ హాస్పిటల్‌లో ఏ స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి?, ఇంకా ఏయే విభాగాల్లో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవసరం?, ఏయే వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాల్సి ఉంది? అనే అంశాలపై హాస్పిటల్ వారీగా సమగ్ర సమీక్ష చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రముఖ ఆంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, జిఎడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్. చొంగ్తు, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఆస్కి డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ పాల్గొన్నారు.

పర్యాటక సంస్థ కాంట్రాక్టు ఉద్యోగుల
వేతన పెంపునకు చర్యలు

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వేతన ఉద్యోగుల వేతనాల పెంపు, పదవీ విరమణ వయోపరిమితి 61 ఏళ్లకు పొడిగింపు, ఇతర సంక్షేమ ప్రయోజనాల కల్పనపై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు పర్యాటక సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండిని ఆదేశించింది. ఈ మేరకు యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల వేతనాలను శాశ్వత ఉద్యోగులతో సమానంగా పెంచడం, బస్సు పాసులు, రిస్క్ అలవెన్స్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సమర్పించిన వినతులపై ఈ చర్యలు చేపట్టారు. అలాగే పర్యాటక ప్లాజాల నిర్వహణకు ప్రత్యేక జనరల్ మేనేజర్‌ను నియమించాలని, విజిలెన్స్ విభాగాన్ని మూడు సభ్యుల రెండు బృందాలుగా పునర్వ్యవస్థీకరించాలని, ఇద్దరు పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను నియమించాలని ఉద్యోగ సంఘం కోరింది. ఒకరు ప్రాజెక్టుల పర్యవేక్షణ, మరొకరు పరిపాలన, ఇతర సంస్థాగత కార్యకలాపాలను నిర్వహించేలా ప్రతిపాదించింది. ఉద్యోగ సంఘం నేతలు సబ్బు రాజమౌళి, చాడి వెంకట్ రెడ్డి సమర్పించిన వినతులను పరిశీలించిన ప్రభుత్వం, నిబంధనల మేరకు చర్యలు తీసుకుని దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాలని సంస్థ ఎండికి సూచించింది.

12 నుంచి ప్రత్యేక టెట్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (స్పెషల్ టిజిటెట్)కు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 12వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్, టిజి టెట్ కన్వీనర్ రమేశ్ తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://schooledu.telangana.gov.in ద్వారా తమ లాగిన్ వివరాలు నమోదు చేసి, హాల్‌టికెట్లను పొందవచ్చని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషల్ టెట్ పరీక్షలను ఈనెల 19న ఆన్‌లైన్ విధానంలో రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఉదయం 9.00 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే పేపర్1 పరీక్షకు 2,591 మంది, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే పేపర్2 పరీక్షకు 7,995 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

'జెఎన్‌టియు సెక్యూరిటీ టెండర్ల'
అవినీతిపై విచారణ చేపట్టండి

ప్రజాపక్షం/హైదరాబాద్: జెఎన్‌టియు సెక్యూరిటీ టెండర్లలో అవినీతి జరిగిందని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, పరిశోధక విద్యార్థి జవ్వాజి దిలీప్ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరిగితే విద్యార్థులలో, యువతలో తప్పుడు సంకేతాలు వెళ్తాయన్నారు. జెఎన్‌టియు ఎంపయులపై, థర్డ్ పార్టీ కన్సల్టెంట్‌ల పాత్ర, వారికి ఇచ్చిన గౌరవభత్యం అంశాలపైన విచారణ చేయాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోని ఆరు నెలలు నుండి జరిగిన కళాశాల తనిఖీలపైన కూడా పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

'ఎస్‌బిఐ, యుబిఐ' బ్యాంకుల్లోనే
'గ్రామ పంచాయతీ' ఖాతాలు

- సొంత ఖాతాల్లోకే నిధులు
- 12,700లకు పైగా ప్రత్యేక బ్యాంకు ఖాతాల ప్రక్రియ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూరే నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లోనే జమ చేసుకుని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రపంచాయతీ, గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర వ్యాప్తం గా సుమారు 12,700లకు పైగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక బ్యాంకు ఖాతాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాల వారీగా జాతీయ బ్యాంకులను కేటాయిస్తూ, పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన బ్యాంకులో విధిగా ఒక ప్రత్యేక సేవింగ్స్ ఖాతాను ప్రారంభించాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశిస్తూ మెమోను జారీ చేసింది. ఈ ఖాతాలను ఓఎస్‌ఆర్ అకౌంట్ 'గ్రామ పంచాయతీ' పేరుతో ప్రారంభించాలని ఆదేశించింది. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం ఇకపై నేరుగా వాటి ఖాతాల్లోనే జమ అయ్యేలా, ఆ నిధులను గ్రామాభివృద్ధి అవసరాలకు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నది.

జిల్లాల వారీగా ఎబిఐ, యూనియన్ బ్యాంకులకు బాధ్యతలు

జిల్లాల వారీగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) శాఖలను కేటాయించారు. జిల్లా పంచాయతీ అధికారులు తమ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధిత బ్యాంకుల్లో ఖాతాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశించారు. ఈ ఖాతాలను జీరో బ్యాలెన్స్‌సేవింగ్స్ అకౌంట్లుగా ప్రారంభించాలని, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల (ఓఎస్‌ఆర్) ద్వారా వచ్చే అన్ని రాబడులు, వాటి నుంచి చేసే ఖర్చుల నిర్వహణకు ప్రత్యేకంగా వినియోగించాలన్నారు. ఖాతాల నిర్వహణ, సంతకాల అధికారాలు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018 ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో వెలిగిన దీపాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపు మేరకు నిర్మాణం పూర్తి చేసుకున్న సుమారు 2 లక్షల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలో దీపాలు వెలిగించి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులు పాల్గొని లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఇందిరమ్మ ఇళ్లలో దీపాలు వెలిగించి లబ్ధిదారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ నగరం వరకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని, లబ్ధిదారుల ఆనందాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో సొంతింటి కలను సాకారం చేసుకుంటున్న పేద కుటుంబాలకు ఈ దీపావళి మరింత ప్రత్యేకంగా నిలిచింది. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో లబ్ధిదారులే ప్రధాన భాగస్వాములుగా నిలిచారు. తమ ఇళ్లలో నిర్వహించిన దీపావళి వేడుకలను ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇండ్లు యాప్‌తో పాటు సోషల్ మీడియా వేదికలపై పంచుకున్నారు.

టిపిసిసి మీడియా
ప్యానెలిస్టులుగా 16 మంది

- నలుగురు మీడియా కోఆర్డినేటర్లు, 49 మంది అధికార ప్రతినిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) మీడియా, ప్రచార విభాగంలో కీలక నియామకాలు చేపట్టింది. పార్టీ తరపున పత్రికా సమావేశాలు, టీవీ చర్చల్లో పాల్గొనేందుకు 16 మందిని మీడియా ప్యానెలిస్టులుగా నియమించింది. ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, డాక్టర్ జె.రామచంద్ర నాయక్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు డాక్టర్ సి.వంశీకృష్ణ, టి.రామ్మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఎస్.రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కుచకుళ్ల రాజేష్ రెడ్డి, మాజీ విప్ అనిల్ ఎర్రవత్రి, మాజీ చైర్మన్ టి.బెల్లయ్య నాయక్, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.చరణ్ కౌశిక్ యాదవ్‌లకు మీడియా ప్యానెలిస్టులుగా బాధ్యతలను టిపిసిసి అప్పగించింది. టిపిసిసి మీడియా చీఫ్ కోఆర్డినేటర్‌గా కె.శ్రీకాంత్ యాదవ్, మీడియా కన్వీనర్‌గా దామోదర్ ఆవేలి, మీడియా కోఆర్డినేటర్లుగా తుమ్మల పద్మ, మొగిలి సత్యారెడ్డిలను టిపిసిసి నియమించింది. ఇప్పటికే పార్టీ అధికార ప్రతినిధులుగా ఉన్న కొందరికి సీనియర్ అధికార ప్రతినిధులుగా బాధ్యతలు అప్పగించింది. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎఐసిసి మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టామని, ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఎంపి, టిపిసిసి మీడియా, ప్రచార విభాగం చైర్మన్ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలియజేశారు. ఇదిలా ఉండగా మరో 49 మంది అధికార ప్రతినిధులను కూడా నియమించింది. ఈ మేరకు చామల కిరణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
"విద్యుత్ ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్టే"
టెండర్ ప్రకటన నెం.07/26-27
సమర్థులైన అర్హతగల కాంట్రాక్టర్ల నుండి ఈ క్రింది వాటి కోసం సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది: (ఎ) Spec.T-38 (STలకు రిజర్వ్ చేయబడింది) - 33/11KV PCC SS యొక్క మానవరహిత నిర్వహణ; (బి) Spec.T-39 (వద్దెరలగుకు రిజర్వ్ చేయబడింది) - 33/11KV కృష్ణానగర్ SS యొక్క మానవరహిత నిర్వహణ; (సి) Spec.T-40 - 33/11KV కళ్యాణ్‌నగర్ SS యొక్క మానవరహిత నిర్వహణ; మరియు (డి) Spec.T-41 (SC లకు రిజర్వ్ చేయబడింది) - 33/11KV ముఖరంజా SS యొక్క మానవరహిత నిర్వహణ, ఇవన్నీ MRT మాదాపూర్ SD, ప్రొటెక్షన్-I డివిజన్‌లోని SCADA కంట్రోల్ రూమ్ నుండి. (E) Spec.T-42 (ఇ-ప్రొక్యూర్‌మెంట్) TGSPDCL SCADA కంట్రోల్ సెంటర్‌లో SLDC సెక్యూర్ ICCP సర్వర్‌లతో 2 సెక్యూర్ ICCP అనోసియేషన్ల కోసం సెక్యూర్ ICCP సాఫ్ట్‌వేర్ సరఫరా, ఇన్‌స్టాలేషన్, కమీషనింగ్ మరియు నిర్వహణ. (F) Spec.T-43 (ఇ-ప్రొక్యూర్‌మెంట్) - TGSPDCL SCADA కంట్రోల్ సెంటర్‌లో SCADA అప్లికేషన్, GIS-ఆధారిత NMC అప్లికేషన్ మరియు 2 రిమోట్ డాష్‌బోర్డ్‌ల కోసం గేట్‌వే ఇంటర్‌ఫేస్ సాఫ్ట్‌వేర్, RDBMS మరియు రిమోట్ డాష్‌బోర్డ్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ సరఫరా, ఇన్‌స్టాలేషన్, కమీషనింగ్ మరియు నిర్వహణ & (G) Spec.T-44: ఫైబర్ ఆప్టిక్ ప్యాచ్ కార్డ్‌ల సరఫరా. వివరాల కోసం, https://tgsouthernpower.org‌ని సందర్శించండి. ఫోన్: 040-23431333/1112/1125.
DIPR R.O. No. : 13398-PP/CL/ADVT/2026-27, Date: 09-11-2026
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్/SCADA

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి

NIT No. 34	పని పేరు	అంచనా విలువ	బిడ్ సమర్పణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం	అధికారి పేరు & చిరునామా
NIT No. 34/E.E.30/ GHMC/ 2026-27, తేదీ: 07.11. 2026	దీపావళి పండుగ-2026 సందర్భంగా, జిహెచ్‌ఎంసి, గోల్కొండ జోన్, గోషామహల్ సర్కిల్‌లో తేది: 05.11.2026 నుండి 16.11.2026 వరకు (12 రోజులు) చెత్త / శిథిలాలను ఎత్తడానికి మరియు రవాణా చేయడానికి 6 టన్నుల టిప్పర్లు, జెసిబి (Backhoe Loader) మరియు స్కిడ్ స్టీర్ లోడర్లు. (అనగా (06) 6 టన్నర్లు, (01) Backhoe Loader మరియు (02) skid steer loader) వినియోగంలోకి తీసుకురాబడ్డాయి.	రూ. 6.85 లక్షలు	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 08.11.2026 ఉ.11.00గం.లకు మరియు బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 11.11.2026 ఉ.11.00గం.ల వరకు	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్‌ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 13388-PP/CL/ADVT/2026-27 Date: 09-11-2026

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



ప్రజాపక్షం/జవహర్ నగర్ : కాప్రా మండలం పరిధిలోని జవహర్ నగర్ ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. సర్కారు భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న పక్కా సమాచారంతో కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ సిబ్బంది విస్తృత కూల్చివేతలు చేపట్టారు. గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో రెవెన్యూ బృందం మోహన్ రావు కాలనీ, గబ్బిలాల్ పేట్‌లలో క్షేత్రస్థాయిలో పర్యటించి, అక్కడ అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను జెసిబి సాయంతో నేలమట్టం చేసింది.

కబ్జాదారులను సహించేది లేదు...తహసీల్దార్ మతిన్

ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కాపాడటమే తమ ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. జవహర్ నగర్ పరిధిలోని సర్కారు భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. అమాయక పేద ప్రజలకు ప్రభుత్వ భూములను ఆశ చూపి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, త్వరలోనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములు కొను గోలుచేసి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, జవహర్ నగర్ ప్రాంతంలో ఎలాంటి అక్రమ కట్టడాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారుల చిరునవ్వుల్లోనే నిజమైన ఆనందం : డా.సత్యం శ్రీరంగం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: చిన్నారుల చిరునవ్వుల్లోనే నిజమైన ఆనందం దాగి ఉంటుందని, వారికి సేవ చేయడంలోనే జీవితానికి సార్థకత లభిస్తుందని పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో కైతలాపూర్‌లోని చీర్స్ ఫౌండేషన్‌లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరంగం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని టపాసులు కాల్చి సందడి చేశారు. చిన్నారులతో కలిసి పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటమే నిజమైన సంతృప్తి అని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆయన ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, బచ్చు మల్లి, కుమార్ యాదవ్, మణికంఠతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చీర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, చిన్నారులు పాల్గొన్నారు.



సైక్లింగ్‌తో బంగారు పతకాలే కాదు.. బంగారు ఆరోగ్యం పొందవచ్చు

బిఆర్ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద

ప్రజాపక్షం/ నిజాంపేట్ : సైక్లింగ్‌తో బంగారు పతకాలే కాదని, బంగారు ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్రా చౌరస్తాలో హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19 నుండి ప్రారంభమయ్యే కే టూ కే క్యాశ్మీర్ టూ కన్యాకుమారి సైక్లింగ్ యాత్ర (నాల్గవ ఎడిషన్) పోస్టర్‌ని వివేకానంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కే టూ కే కార్యక్రమం ద్వారా సైక్లింగ్ ప్రాముఖ్యతతో పాటు యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడం మంచి పరిణామమని అన్నారు. మనిషి జీవితం, మన శక్తిని మంచి మార్గంలో ఉపయోగించి దేహ దారుఢ్యాన్ని, మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకున్న వారే మిస్టర్ ఇండియాగా నిలుస్తారని చెప్పారు. కశ్మీర్ టూ కన్యాకుమారి సైక్లింగ్ యాత్రకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతున్న వారిని సైక్లింగ్, మారథాన్ వంటి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జె.సత్యనారాయణ, హెచ్‌సిఇజ ప్రెసిడెంట్, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ రవీందర్ నందనూరి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు భీమ్ సింగ్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ గడి, తదితరులు పాల్గొన్నారు.

మినీ సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం..భారీ నష్టం

ప్రజాపక్షం/చర్లపల్లి: మినీ సూపర్ మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో భారీగా ఆస్తి నష్టం జరిగిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని హెచ్‌బి కాలనీ మీర్‌పేట్ వెంకటేశ్వర నగర్‌లోని రాందేవ్ మినీ సూపర్ మార్కెట్‌లో దీపావళి రోజు అగ్ని ప్రమాదం సంభవించింది. షాపు యజమాని ఘలోత్ సోహన్‌లాల్‌చౌదరి గత 36 సంవత్సరాలుగా రాందేవ్ సూపర్ మార్కెట్ నడుపుతున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా రాత్రి 12 గంటల వరకు కుటుంబ సభ్యులతో కలిసి షాపు వద్ద ఉండి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో షాపు నుండి మంటలతో కూడిన పొగలు వస్తున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో షాపులోని కిరణా సరుకులు, ఫర్నిచర్, ఫ్రిడ్జ్, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయి భారీగా ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. ప్రాథమిక విద్యుత్ షార్ట్ సర్క్యూట్, దీపావళి సందర్భంగా వెలిగించిన దీపాల కారణంగా మంటల వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. దర్యాప్తు అనంతరం ఖచ్చితమైన కారణాలు నిర్ధారణకు వస్తాయని తెలిపారు.

‘దీపావళి’ వ్యర్థాల తొలగింపునకు

జిహెచ్‌ఎంసి ప్రత్యేక డ్రైవ్



ప్రజాపక్షం/హైదరాబాద్: దీపావళి పండుగ అనంతరం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో టపాసుల వ్యర్థాలు, కాలిన కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు తదితర చెత్తను తొలగించేందుకు విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా యూసుఫ్ గూడ సర్కిల్38 పరిధిలోని యూసుఫ్‌గూడ, ఏజీ కాలనీ, వెంగల్‌రావు నగర్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. నివాస కాలనీలు, అంతర్గత రహదారులు, బహిరంగ ప్రదేశాలు, కూడళ్లు తదితర ప్రాంతా ల్లో పేరుకుపోయిన టపాసుల అవశేషాలను తొలగించి పరిశుభ్రతను పునరుద్ధరించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది విస్తృతంగా పనిచేశారు. దీపావళి వేడుకల అనంతరం పేరుకుపోయిన చెత్త ను వెంటనే సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని, నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయకుండా, పండుగలకు సంబంధించిన వ్యర్థాలను సక్రమంగా పారవేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధునాతన వసతులతో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

* రోజుకు 600 మందికి సేవలు

* ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఉప్పల్: ఆధార్ సంబంధిత వివిధ సేవలు త్వరితగతంగా, ఎలాంటి అసౌకర్యం లేకుండా అందించే లక్ష్యంగా ఉప్పల్ ప్రాంతంలో అధునాతన వసతులతో కూడిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసామని ఉదాయి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి.సంగీత తెలిపారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ సమీపంలోని నాగోల్ వైపు పిల్లర్ నంబర్ 870 వద్ద ఏర్పాటు చేసిన సెంటర్‌ను సోమవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు 500 నుండి 600మంది వరకు ఆధార్ సేవలందించేందుకు ఏర్పాట్లు చేసామని, దీనికోసం అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో https://appointments. uidai. gov.in/bookappointment.aspx అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా టోకెన్ తీసుకొని నిర్ణీత సమయం ఎంచుకొని దాని ప్రకారం ఈ కేంద్రంలో సేవలందుకోవాలన్నారు. దీనివల్ల వేచి ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. నూతన ఆధార్ నమోదు, 5, 15 సంవత్సరాల వయస్సులో నిర్వహించే తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు ఈ కేంద్రంలో ఉచితంగా ఉంటాయన్నారు. డెమోగ్రాఫిక్ అప్‌డేట్ కోసం రూ.75, బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం రూ. 125 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కేంద్రానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు తదితరులకు అవసరమైన సేవలందించాలని సిబ్బందికి ఆమె సూచించారు. అదే విధంగా ఆధార్ సంబంధిత సేవలకు గాను అవసరమైన ధృవపత్రాలు, సేవల విధానాలను స్పష్టంగా తెలియచేసే విధంగా కార్యాలయంలో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆధార్ సంబంధిత సేవలకు గాను మధ్యవర్తులను ఆశ్రయించకుండా ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ ఎం.భారతి, ఐఆర్‌టిఎస్ డిప్యూటి డైరెక్టర్ రంగనాథ్, తెలంగాణా ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర, అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, బిఎల్‌ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ దుగ్గి హరినాథ్, మేడ్చల్ మల్కాజిగిరి ఆపరేషన్స్ మేనేజర్ సి. కార్తిక్, సెంటర్ మేనేజర్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పట్టాలపై తల్లీకూతుళ్లను కాపాడిన పోలీసులు



ప్రజాపక్షం/ఘట్‌కేసర్: రైల్వే పట్టాలపై తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నాన్ని ఘట్‌కేసర్ పోలీసులు సకాలంలో అడ్డుకుని రెండు ప్రాణాల ను కాపాడారు.భర్త వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ తన కుమార్తెతో కలిసి ఎన్‌ఎఫ్‌సీ నగర్ రైల్వే గేట్ వద్ద పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ విషయాన్ని డయల్ 100 ద్వారా తెలుసుకున్న ఘట్‌కేసర్ పోలీసు సిబ్బంది. వెంటనే అక్కడికి చేరుకుని తల్లీకూతుళ్లను సురక్షితంగా రక్షించారు. అనంతరం మహిళకు ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించి ఆమె కుమార్తెతో సహా సోదరి వద్దకు సురక్షితంగా చేర్చారు. సమయస్ఫూర్తితో స్పందించి రెండు ప్రాణాలను కాపాడిన పెట్రోలింగ్2 ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ పరమేష్‌తో పాటు సిబ్బందిని ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ కిరణ్ అభినందించారు. ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని అత్యవసర పరిస్థితుల్లో డయల్112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/శామీర్‌పేట: అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ప్రాంతానికి చెందిన గౌరి శంకరప్రసాద్ రాజు(50) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై గత రెండు రోజుల ఇంటి నుంచి బయల్దేరి మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ ప్రాంతాల్లో (టిఎస్ 08హెచ్‌బి 1394) ద్విచక్ర వాహనంపై తిరుగుతున్నాడు. సోమవారం సాయంత్రం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని లక్ష్మాపూర్ పెద్ద చెరువు సమీపంలో గౌరీ శంకరప్రసాద్ రాజు కింద పడిపోయి ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి నేత్రదానం ..

ప్రజాపక్షం/హైదరాబాద్: సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి ముదిగొండ వీర భద్ర సేనాపతి (84) సోమవారం కన్నుమూశారు. ఆయన మరణానంత రం కుటుంబసభ్యులు నేత్ర దానానికి ముందుకొచ్చారు. మృతుని కుమారుడు ఎం.రమణ సరాజ్, కుమార్తె ఎం.సరస్వతి, అల్లుడు ఎ.శ్రీనివాస్ సమ్మతితో తెలంగాణ నేత్ర, అవయవ, చర్మ, శరీర దాతల సంఘం సమన్వయం తో నేత్రాలను సేకరించి సికింద్రాబాద్‌లోని ‘వాసన్ ఐ బ్యాంక్’కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం, ఢిల్లీకి చెందిన డాక్టర్ సౌరభ్ శర్మ పాల్గొన్నారు. మరణానంతరం ఇతరులకు కొత్త జీవితాన్ని ఇచ్చేలా ప్రతి ఒక్కరూ నేత్ర, అవయవ, శరీర దానాలకు స్వచ్ఛందంగాముందుకు రావాలని ఈశ్వర లింగం కోరారు.

మురుగునీటితో బాచుపల్లి బైరుని చెరువు కలుషితం

● అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో పడిన గేదె

● ఎన్ని ప్రమాదాలు జరిగితే వాటిని బాగు చేయిస్తారంటున్న మత్స్యకారులు





ప్రజాపక్షం/నిజాంపేట్: చెరువులను రక్షిస్తాం.. ఆధునీకరిస్తామని చెబుతున్న ప్రభుత్వ ఆలోచనలకు నిజాంపేట్ సర్కిల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి చేతులు దులుపుకున్న హైడ్రా అధికారులకు మురుగునీరు చెరువులో కలుస్తున్న దుస్థితి కనిపించకపోవడం విశేషం. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండలంలోని బాచుపల్లి బైరుని చెరువులోకి నేరుగా మురుగునీరు కలుషితమవుతుంది. బాచుపల్లి బైరుని చెరువు చుట్టూ ఉండే కాలనీలు, విల్లాలు, బస్తీలు, వ్యాపారస్థల సముదాయాల నుండి మురుగునీరు నేరుగా బాచుపల్లి చెరువులోకి వదిలేస్తున్నారు. అంతేకాకుండా చెరువు చుట్టూ నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మ్యాన్ హోల్లు ధ్వంసమై నెలలు గడుస్తున్నా ఇటు ఇరిగేషన్ కాని, అటు నిజాంపేట్ సర్కిల్ అధికారులు కనిపించకపోవడం గమనార్హం. గత కొద్ది కాలంగా పగిలిన మ్యాన్ హోల్ నుండి మురుగునీరు నేరుగా చెరువులో కలుస్తుంది. అంతేకాకుండా తాజాగా డ్రైనేజీ మ్యాన్ హోల్‌లు పగలడంతో మ్యాన్ హోల్‌లో గేదె పడి గిలగిలా కొట్టుకుంది. స్థానికులు గమనించి వెంటనే తాడు సహాయంతో గేదెను బయటికి తీసి ప్రాణాలను కాపాడారు. అదే మనుషులు మ్యాన్‌హోల్‌లో పడితే పరిస్థితి ఏంటని స్థానికులు, మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. ప్రాణాలు పోతేనేగాని అధికారుల్లో చలనం రాదా అని ప్రజలు నిలదీస్తున్నారు.

బాచుపల్లిలోని పెద్ద (బైరుని) చెరువు ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణంతో మంచినీటి తో కళకళలాడుతూ ఉండేదని గ్రామస్థులు వాపోతున్నారు. రోజురోజుకి చెరువు చుట్టూ కాలనీలు, అపార్టమెంట్‌లు, హోటళ్లు విస్తరించడంతో అక్కడి నుండి వచ్చే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నేరుగా చెరువులోకి చేరుతుంది. దీంతో కొద్ది నెలలుగా చెరువు పూర్తిగా మురుగునీటి కలుషితంతో దుర్గంధ భరితంగా మారింది. మురుగునీటి కలుషితంతో చెరువులోని చేపలు మృత్యువాత పడడం, భూగర్భ జలాలు కలుషితమవడం జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మత్స్యకారులకు జీవనాధారంగా ఉన్న చెరువు కాస్త చేపల మృతితో మత్స్యకారులు రోజురోజుకి జీవనోపాధిని కోల్పోతున్నారు. ఇదిలా ఉండగా చెరువులోని మంచినీటినే గ్రామస్థులు, చుట్టు ప్రక్కల వాసులు త్రాగడం, వాడుకోవడం జరుగుతుండేది. కాని ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు కలుషితం అవుతుండడంతో మంచి నీరు కాస్త కలుషితం అవుతుంది. చెరువు నీటిని వాడుకోవడం కాదు కదా కనీసం చెరువు వద్దకు వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిజాంపేట్ సర్కిల్ అధికారులకు మత్స్యకారులు, గ్రామస్థులు పలుమార్లు వినతులు సమర్పించినా ఎందుకు స్పందించడం లేరని పలువురు మండిపడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాని తీసుకువచ్చి చెరువులను కాపాడడం, కబ్జాలను తొలగించడం వంటి కార్యక్రమాలను చేపడుతూ చెరువు చుట్టూ ఫెన్సింగ్‌ని ఏర్పాటు చేస్తున్నారు. కానీ చెరువు పూర్తిగా కలుషితమవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేరని, చెరువులోకి మురుగు నీరు కలుషితం కాకుండా హైడ్రా పని కాదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే డ్రైన్ చెరువులోకి మురుగునీరు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, మత్స్య కారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్లకార్డులతో ఆందోళనకు దిగిన స్థానికులు...

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి పెద్ద (బైరుని) చెరువుని కలుషితం నుండి కాపాడాలని కోరుతూ స్థానికులు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. చెరువు చుట్టూ వెలసిన కాలనీలు, హోటళ్లు, సర్వీసింగ్ సెంటర్‌లు, బార్‌ల నుండి వచ్చే డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి కలుస్తున్నాయని ఆందోళనకారులు మండిపడ్డారు. చెరువు చుట్టూ ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోళ్లు ఎనిమిది వరకు పూర్తిగా పగిలిపోయి మురుగునీరు చెరువులోకి చేరుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు మురుగునీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింతగా ఉధృతం చేస్తామని, సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఇందిరమ్మ ఇంట దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం /దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం చేసి కుటుంబ సభ్యులను అప్యాయంగా పలకరించారు. స్వీట్లు, టపాకాయలు అందజేశారు. ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు ప్రతికుంటుబానికి ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భాస్కర్‌గౌడ్, అధ్యక్షులు శాంతకుమార్, యాదవరెడ్డి, దోమ సర్పంచ్ శివకుమార్‌రెడ్డి అశన్నగౌడ్, అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి లో: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ,ఇందిరమ్మ ఇంటి దీపావళి కార్యక్రమం పరిగి మున్సిపల్ పరిధిలోని16వ వార్డులో దోమ వర లక్ష్మి ఇంట్లో మున్సిపల్ రజిత వెంకటేష్ ,వైస్ చైర్మన్ హనుమంతు కమల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి , మార్కెట్ వైస్ చైర్మన్ అయూబ్ నాయక్ , గనేమోని శ్రీనివాస్ , దోమ శ్రీనివాస్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



యాదవుల ఐక్యతకు ‘సదర్’ నిదర్శనం

అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ మున్సిపల్‌లో యాదవుల సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే శామీర్‌పేట డివిజన్ తూంకుంటలో కూడా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సదర్ ఉత్సవాల్లో యాదవ సంఘం సభ్యులు. గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు సదర్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఈ సదర్ ఉత్సవాల్లో దున్నపోతుల ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లి: దీపావళి పండుగను పురస్కరించుకుని నాగారం డివిజన్ పరిధిలోని బోగారం, రాంపల్లి దాయరా, మున్సిపల్ గతంలోని 10,11,12వ వార్డులలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు దుస్తులను సామాజిక కార్యకర్త అక్కల సురేష్‌కుమార్ అందజేశారు. ప్రజల ఆరోగ్యం కోసం పరిసరాల పరిశుభ్రత చేస్తున్న కార్మికులకు దుస్తులు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గోకుల్‌నగర్ ప్రాంతంలో అగ్నిప్రమాదం..విలువైన సామగ్రి దగ్ధం



ప్రజాపక్షం/ఉప్పల్: మల్లాపూర్ డివిజన్ గోకుల్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లోని విలువైన సామగ్రి ధగ్ధమయ్యాయి. కాలనీలో నివసించే శ్రావణి, శ్రీనివాసరాజు దంపతులు నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలనార్పే యత్నం చేస్తున్నప్పటికి అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులన్ని కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగానా, లేక దీపావళి సందర్భంగా తెచ్చుకొన్న టపాసుల కారణంగా అగ్నిప్రమాదం జరిగిందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నా మని నాచారం పోలీసులు తెలిపారు.



మూడు గోదాముల దగ్ధం..

ఆరు వాహనాలు బుగ్గిపాలు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కూకట్‌పల్లి ఆస్బెస్టాస్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. లక్కీ బార్ వెనుక ఉన్న గోదాముల్లో తెల్లవారుజామున 3గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నెయ్యి, మూంగ్‌దాల్, స్క్రాప్, పేపర్ కప్స్ తదితర సామాగ్రి నిల్వ ఉంచిన మూడు గోదాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల తీవ్రతకు ఆరు మినీ టాటా ఎస్ వాహనాలు సైతం కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైర్ ఇంజన్లతో ఘటనాస్థలికి చేరుకున్నారు. సుమారు 45 మంది సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీపావళి పండుగ సందర్భంగా గోదాముల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమీపంలోని అశోక గార్డెన్‌లో టపాసుల హోల్‌సేల్ దుకాణాలు ఉండటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. నివాస ప్రాంతాల మధ్య గోదాములు నిర్వహించడాన్ని ఇకపై ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన గోదాములు, షెడ్లను గుర్తించి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా గోదాములు నిర్వహిస్తున్న వారిపై అనుమతి పత్రాలను పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదాముల్లో రసాయనాలు, మంటలు వేగంగా వ్యాపించే వస్తువులను నిల్వ చేస్తున్నారా అనే అంశంపై చుట్టు పక్కల ఉన్న గోదాముల్లో తనిఖీలు చేపడతామని కూకట్‌పల్లి అగ్నిమాపక అధికారి జగన్మోహన్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ ప్రమాదంలో రూ.2కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

చేసే పనులే సమాజంలో శాశ్వతం



జాపక్షం/షాద్‌నగర్: సమాజంలో మనిషి శాశ్వతం కాదని, చేసే పనులే శాశ్వతం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సిండికేట్ కాలనీలో పేద బడుగు బలహీన వర్గాల పిల్లల చదువుల కోసం నిర్మిస్తున్న పాఠశాల భవనానికి వ్యాపార వేత్త, రియల్టర్ మహిపాల్‌రెడ్డి రూ.10లక్షల ఆర్థిక సహాయం అంధించారు. ఇందుకు సంబందించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు సహకారం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి ఆధ్వర్యంలో ఎస్సీ వసతి గృహంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 150మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడంతోపాటు యూత్ కాంగ్రెస్ నేత కెకె కృష్ణ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, బాదేపల్లి సిద్ధార్థ, సర్పంచ్ వడ్ల జంగయ్య, కౌన్సిలర్ శిరీష అనిల్‌కుమార్, జక్కని రవికుమార్, గడ్డం జంగయ్య, బూర్గుల శివకుమార్, పెంటన్నోళ్ల ఆంజనేయులు, రాజశేఖర్, పిట్ట రజిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : దీపావళి పండగను పురస్కరించుకొని శేరిలింగంపల్లి శ్రీరామ్‌నగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బలరామ్ యాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ అరెకపూడీ గాంధీని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ వాసులు రాజమోహన్‌రావు, సన్నీయాదవ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

'స్థానికం'లో అవకాశం కల్పించాలి




ప్రజాపక్షం/కేశంపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని వివిధ గ్రామాల సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం కేశంపేట మండల కేంద్రంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే సర్పంచులకు తగిన అధికారాలు, హక్కులు కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో తొమ్మిదిరేకుల సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి, నిర్ధవెళ్ళి సర్పంచ్ చెదురువెళ్లి భాస్కర్ గౌడ్, దత్తాయపల్లి సర్పంచ్ భాస్కర్, బోదునంపల్లి సర్పంచ్ నాగేష్, పుట్టోనిగూడ సర్పంచ్ చప్లీ భాస్కర్ పాల్గొన్నారు.

జిఒ 641 రద్దుపై అధికారికంగా ప్రకటన చేయాలని మంత్రికి వినతి



ప్రజాపక్షం/కొత్తూరు: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు రద్దు ప్రకటన చేయడం అభినందనీయమైనప్పటికీ అధికారికంగా జిఒను రద్దు చేసేందుకు కృషి చేయాలని యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేశారు. మంత్రి ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని, ఎన్ని రోజుల్లో ప్రకటన చేస్తారో చెప్పాలని జెపిసి చైర్మెన్ రాంబల్‌నాయక్, కన్వీనర్ పిసపాక ప్రభాకర్, కోఆర్డినేటర్ తిరుమలయ్యలు డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక



ప్రజాపక్షం/కడ్తాల్: 70వ ఎస్‌జిఎఫ్‌ఐ కడ్తాల్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రగతి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. కబడ్డీ పోటీలు మాడ్గులలో, ఖోఖో పోటీలు రావిచేడ్‌లో నిర్వహించారు. అండర్14, అండర్17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్‌తో పాటు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కడ్తాల్‌లోని ప్రగతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. కబడ్డీలో జిల్లా స్థాయికి ఎంపికైన వారిలో ఎ.వైష్ణవి,కె. సువర్చన,ఎ. వర్షిక,జె.శేషంత్ ఎంపిక కాగా ఖోఖోలో జిల్లా స్థాయికి కె.మీనాక్షి, ఎం. సోనా ఎంపికైనారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రగతి హైస్కూల్ యాజమాన్యం కె.సువర్ణ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ్, ఉపాధ్యాయబృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్యూర్ పరిధిలో

దీపావళి బాణాసంచా ప్రభావం

గరిష్ట స్థాయిలో ఎక్యూఐ 509 పాయింట్లు

కాలుష్య తీవ్రతను ప్రకటించని టిజిపిసిబి

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: వెలుగులు నింపే దీపావళి సందర్భంగా ప్రజలు కాల్చిన పటాకులతో క్యూర్ పరిధిలో గరిష్ట స్థాయిలో వాయు కాలుష్యం నమోదయ్యింది. గతంతో పోలిస్తే ఆల్‌టైం రికార్డుగా ప్రచారం జరుగుతోంది. అయితే కాలుష్య తీవ్రతకు సంబంధించిన వివరాలను టిజిపిసిబి ప్రకటించనప్పటికీ.. ప్రైవేట్ ప్లాట్‌ఫాంల ద్వారా వెలుగులోకి వచ్చిన వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బాణసంచా కాల్చడం వల్ల వాయుకాలుష్యం ఒక్కసారిగా ప్రమాదకరస్థాయికి చేరింది. ముఖ్యంగా రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పరిస్థితి తీవ్రంగా మారింది. పటాకుల కాలుష్యం గత ఏడాదితో పోలిస్తే ఆందోళన కలిగించింది. పిఎం 2.5, పిఎం 10 వంటి సూక్ష్మ కణాలతో పాటు సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫేట్, పాస్పేట్ గరిష్టంగా వెలువడటం జరిగింది. కాలుష్యం ఎక్కువగా పశ్చిమ ఐటీ కారిడార్, ఉత్తర, వాయువ్య ప్రాంతాల్లో నమోదైనట్లు సమాచారం. డిఫెన్స్ కాలనీ, శేరిలింగంపల్లి, మణికొండ, ప్రకాశ్ నగర్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, హఫీజ్‌పేట్, వంటి ప్రాంతాల్లో వాయు నాణ్యత గణనీయంగా పడిపోయింది. ఈ ప్రాంతాల్లో పిఎం 2.5 సుమారు 278 క్యూబిక్ మీటర్ ఫర్ గ్రాం, పిఎం 10



సుమారు 326 క్యూబిక్ మీటర్ ఫర్ గ్రామ్‌గా నమోదైనట్లు సమాచారం. ఇవి సాధారణ పరిమితుల కంటే చాలా ఎక్కువ. ఈ క్రమంలోనే నాయు నాణ్యతలను పరిశీలిస్తే... రాత్రి 7 గంటల సమయంలో 176, రాత్రి 8.01 సమయంలో 230, రాత్రి 8.31 గంటలకు 321, రాత్రి 9.01 గంటలకు 421, రాత్రి 9.31 గంటలకు 509పాయింట్లు అత్యధికంగా ఎక్యూఐ నమోదయ్యింది. క్రమంగా 10 గంటల తరువాత నుంచి ఎక్యూఐ తీవ్రత తగ్గుతూ... అర్ధరాత్రి 1.01 గంటలకు ఎక్యూఐ 319కి పడిపోయింది. ఇదిలాఉండగా.. ప్రకాష్‌నగర్‌లో ఏకంగా ఎక్యూఐ 828కి చేరినట్లు ప్రైవేట్ ప్లాట్‌ఫాంలు చెబుతున్నా.. అధికారికంగా నిర్ధారించాల్సి ఉన్నది. కాగా క్యూర్ పరిధిలోకి వచ్చే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో అర్ధరాత్రి తర్వాత కూడా పటాకులు కాల్చడం జరిగింది.

దీపావళి టపాసుల మోత..

సరోజినీదేవి కంటి ఆస్పత్రికి 32 మంది బాధితులు.. ఆరుగురికి ఆస్పత్రిలో చికిత్స

కంటిచూపు పూర్తిగా కోల్పోయిన బాధితుడు

హైదరాబాద్ : దీపావళి వేడుకల్లో టపాసుల పేలుళ్లు పలువురి కంటి చూపును ప్రమాదంలోకి నెట్టాయి. బాణసంచా కాల్చేక్రమంలో జరిగిన ప్రమాదాలతో 32 మంది కంటి గాయాలపాలై మెహిదీపట్నంలోని ప్రభుత్వ సరోజినీదేవి కంటి ఆస్పత్రిని ఆశ్రయించారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు పెద్దలు కలిపి ఆరుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మరో 26 మందికి వైద్యులు మందులు అందించి, తదుపరి పరీక్షల కోసం రావాలని సూచించారు. కాగా, ఓ బాధితుడు కుడి కంటిచూపును పూర్తిగాకోల్పోయాడు. దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో నిర్లక్ష్యం, అప్రమత్తత లోపం కారణంగా కంటి గాయా లు సంభవించినట్లు వైద్యులు తెలిపారు. టపాసుల నుంచి వెలువడే నిప్పురవ్వలు, పేలుడు పదార్థాలు కంటి కి తగలడంతో పలుపురు గాయపడ్డారు. చిన్నారులు సైతం ప్రమాదాల బారిన పడటం ఆందోళనకరంగా మారింది. బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రి సిద్ధంగా ఉందని సరోజినీదేవి కంటి ఆస్పత్రి ఆర్ఎంఒ డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. తల్లిదండ్రులు బాణసంచా కాల్చే సమయంలో పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కంటి గాయాలు జరిగినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.



కాలుష్యం ఆల్‌టైమ్ రికార్డు

వనస్థలిపురంలో భారీ చోరీ

30 తులాల బంగారం, రూ.25 లక్షల నగదు అపహరణ

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో భారీ చోరీ చోటుచేసుకుంది. నిత్యం జనసందోహంతో రద్దీగా ఉండే గణేష్ టెంపుల్ రోడ్డులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గణేష్ టెంపుల్ నుండి రైతు బజార్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఖాదీ బండారు షాప్ యజమాని వికాస్ అగర్వాల్ ఇంట్లో దీపావళి పూజ అనంతరం ఆదివారం సాయంత్రం సమయంలో కుటుంబసభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగుల గొట్టి, బెడ్‌రూంలో ఉన్న బీరువాలో 30 తులాల బంగారం, 25 లక్షల నగదు, కొంతమేరకు వెండి ఆభరణాలను దొంగలు అపహరించారు. వనస్థలిపురం పోలీసులకు బాధితుడు వికాస్ ఫిర్యాదు చేయగా ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని వనస్థలిపురం కరుణాకర్‌రావు, వనస్థలిపురం సిఐ. రవిబాబు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ భుక్య రాజేష్ నాయక్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ గోవిందరావు, ఎస్ఐలు వాసు, రమేష్, వెంకటేష్, మహేష్, కరుణ్ పరిశీలించారు. ఇంటిలోని, పరిసర ప్రాంతాల్లోని వివరాలను సేకరించారు. పోలీస్ స్టేషన్‌కు అతిసమీపంలో, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ భారీ చోరీ జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. చోరీ ఘటనపై చోరీ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించాల్సిన బాద్యత పోలీసులకు ఒక సవాల్‌గా మారింది. ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి, చుట్టుపక్కల సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి, అరెస్టు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

హైడ్రా ప్రజావాణికి 36 ఫిర్యాదులు

చర్యలకు ఆదేశించిన కమిషనర్ రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : చెరువుల పరిసరాల్లో అక్రమ బోర్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రహదారుల కబ్జాలు, నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారంటూ హైడ్రా ప్రజావాణిలో ప్రజలు ఫిర్యాదులు చేశారు. అందిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పరిశీలించి, వెంటనే సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. చెరువుల సమీపంలో అక్రమంగా బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారని పలువురు స్థానికులు ఫిర్యాదు చేశారు. సొంత అవసరాల పేరుతో బోర్లు తవ్వి రాత్రివేళల్లో నీటిని విక్రయించడం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, గృహావసరాలకు నీటి కొరత ఏర్పడుతోందని వారు వాపోయారు. ఫిల్మ్ నగర్ చెరువు పరిసరంలోని కౌషర్ కాలనీలో 30 అడుగుల రహదారిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వాటిని తొలగించి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామంలోని సర్వే నెంబర్ 23లో 2.38 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రహరీలు నిర్మించి ఆక్రమిస్తున్నారని మరో ఫిర్యాదు అందింది. మియాపూర్‌లోని శ్రీ లక్ష్మి నగర్ కాలనీలో నాయన మ్మకుంట చెరువు పరిసరాల్లో ఆక్రమణలు పెరుగుతున్నాయని, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెరువును పరిరక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



అలాగే శేరిలింగంపల్లి నెక్కాంపూర్ గ్రామంలోని బాపు హిల్స్ కాలనీలో రహదారిని ఆక్రమించి ఇళ్లు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ గాయత్రి హిల్స్ కాలనీలో నివాస ప్రాంతం మధ్యలో టపాసుల స్టాక్ పాయింట్ నిర్వహిస్తున్నారని, అది ప్రమాదకరమని స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకొచ్చారు. కీసర మండలం తుమ్మలకుంట చెరువులో భారీ మొత్తంలో బోర్ల ద్వారా నీటిని తోడేసి విక్రయిస్తున్నారని, చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో కూడా ఆక్రమణలు కొనసాగుతున్నాయని మరో ఫిర్యాదు నమోదైంది. మొత్తం 36 ఫిర్యాదులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, సంబంధిత విభాగాల అధికారులకు విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రామీణ పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూరు: గ్రామీణ పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండలం తిమ్మాపూర్ వద్ద షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం ఫలికారు. కొత్తూరు తండాల్లోని ఇందిరమ్మ ఇంటి వద్ద లబ్ధిదారులతో కలిసి టపాసులను కాల్చుతూ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతున్న వేళ వారి గడప వద్ద దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లోని 15వ వార్డులో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి వద్ద దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అంధించిన సన్మానించారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు.

షాద్‌నగర్‌లో ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

షాద్‌నగర్ మున్సిపాలిటీలో వైస్‌చైర్మన్ అందె మోహన్ నాయకత్వంలో ఆదివారం రాత్రి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులను తినిపించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, రఘునాయక్, పట్టణ అధ్యక్షుడు నల్ల మోని శ్రీధర్, నేతలు కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, జమ్మద్‌ఖాన్, బాల్‌రాజ్ గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కౌన్సిలర్లు రాజునాయక్, మురళి మోహన్, దిలీప్‌కుమార్, బచ్చలి నరేష్, జమాల్‌పూర్ చందు, సాధిక్, ముబారక్, సింగపాగ అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.కరుణాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, గోద మాధవులు, కత్తి చంద్రశేఖర్ అప్ప, సయ్యద్ ఖదీర్, మనిష్, లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి, చిగిరింత పారిజాత

ప్రజాపక్షం/రంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం, జిహెచ్ఎంసి పరిధిలోని బడంగ్‌పేట్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం జిల్లెలగూడలోని సాయినగర్ కాలనీకి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బెల్లి యాదయ్య, సాయి కిరణ్ నివాసాలతో పాటు వెంకటగిరి కాలనీకి చెందిన వరలక్ష్మి, దత్తు ఇంట్లో నాయకులు మిఠాయిలు పంచి, టపాకాయలు కాల్చి దీపావళి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ వైస్ చైర్మన్ బంగారి బాబు, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ పి. శేఖర్‌రెడ్డి, మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు చల్లా బాల్‌రెడ్డి, జిల్లెలగూడ డివిజన్ అధ్యక్షుడు సిద్ధాల శ్రీశైలం, బాల్ నగర్ డివిజన్ అధ్యక్షుడు నిరుడు శ్రీరాములు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కొండ్ర సంతోష్ కుమార్, గంగమ్మ, పరశురామ్, బి.సైదులుయాదవ్, మురళిగౌడ్, విజేందర్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, రవీందర్, ఓంకార్, గజ్జల రామచందర్, బలవంత్ రెడ్డి, శ్యామ్, సోషల్ మీడియా భాస్కర్, సిద్ధేశ్వర చారి, ఎస్.మల్లేష్, బలరాం పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తుకు ప్రాధాన్యత

కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి , కె.చంద్ర రెడ్డిలతో కలిసి జికలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తుపై అధికారులు తక్షణమే స్పందించాలని, నిబంధనల ప్రకారం వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో వెలుగులు నింపడమే 'ఇందిరమ్మ' లక్ష్యం



కలెక్టర్ నారాయణరెడ్డి


ప్రజాపక్షం/రంగారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన ఆండాలు, రాగిచెట్టు భాస్కర్ ఇళ్లలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. వారితో కలిసి టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని, పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్‌డిఒ పార్థసింహారెడ్డి, పిడి హౌసింగ్ డి.చాంప్లా నాయక్, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్, గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డితో పాటు సంబంధిత అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వారి జీవితాల్లో సంతోషం, వెలుగులు నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కవాడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన బొడిగే అనసూయ, నడిమింటి అనురాధ నివాసాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని, టపాసులు కాల్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ హౌసింగ్ ఎం.చైతన్య కుమార్, పిడి హౌసింగ్ డి.చంప్లానాయక్, నాయకులు బింగి దేవదాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికులకు చీరలు పంపిణీ



ప్రజాపక్షం/నాంపల్లి: దీపావళి పండుగ వేడుకల సందర్భంగా బిజెపి శాంతినగర్ డివిజన్, నాంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకుడు ప్రకాష్ సింగ్ జీహెచ్ఎంసీ స్వీపర్లు, సూపర్వైజర్లకు చీరలు, స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బోడి హర్షవర్ధన్,అలెగ్జాండర్ ఫ్రాన్సిస్,మధుమతి, లక్ష్మీ, మల్లమ్మపాల్గొన్నారు.

పోటెత్తిన భక్త జనం



ప్రజాపక్షం/చార్మినార్: దీపావళి పండుగ పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. చార్మినార్ నుంచి మదీనా వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకన్నారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో చార్మినార్ పరిసరాలు జనసందంగా మారింది. భక్తులకు అమ్మవారి చిత్రం ముద్రించిన నాణేం పంపిణీ చేశారు.

నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు



ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ: దీపావళి పురస్కరించుకుని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, పార్టీ శ్రేణులు చిలకల వెంకటేశ్వరరావు, సి.హనుమంతరావు, శ్రీనివాస్, వినయ్ కుమార్, సురేఖ, వంశీ, మనోజ్ యాదవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జోనల్ ఎఎంసి రాజారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి రాజకీయ లెజెండ్ రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా.. పేదల అభ్యున్నతే ధ్యేయంగా అభివృద్ధి పథంలో తెలంగాణను ముందుకు నడిపిస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సారథినగర్ సొసైటీ ఆదర్శ ఫౌండేషన్‌లోని అనాథ పిల్లలతో కలసి రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మెన్ కోటేశ్వర్‌రావు, సారథినగర్ సొసైటీ అధ్యక్షుడు పి. కోటేశ్వర్ రావు, గ్రేటర్ హైదరాబాద్ హెచ్‌ఆర్ మెడికల్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ దుర్గారావు, గ్రేటర్ హైదరాబాద్ బిసి చైతన్య వేదిక కార్యదర్శి టి.వినోద్ కుమార్, మాల మహానాడు గ్రేటర్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిజిపికి దీపావళి శుభాకాంక్షలు

ప్రజాపక్షం/కంటోన్మెంట్: దీపావళి సందర్భంగా డిజిపి సివి ఆనంద్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఇదిలాఉండగా.. దీపావళి సందర్భంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్



ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ: ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కదివరన్ పలని అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన వారి నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. వీటిని శాఖల వారీగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. సోమవారం నాటి ప్రజావాణిలో మొత్తం 200దరఖాస్తులు రాగా వీటిలో గృహనిర్మాణ సంస్థకు చెందినవి 65, రెవెన్యూ శాఖకు చెందినవి 128 రాగా మిగతా శాఖ లకు చెందినవి ఏడు దరఖాస్తులు వచ్చాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, డిఆర్‌ఓ డాక్టర్ నారాయణలతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్డీకాపూల్‌లో వన్‌వే.. 22న ట్రయల్ రన్!

- ఒక్కరోజు ప్రయోగాత్మకంగా నూతన ట్రాఫిక్ విధానం..
- బైక్‌పై తిరిగి పరిశీలించిన సిపి సజ్జనర్, జిహెచ్‌ఎంసి కమిషనర్



ప్రజాపక్షం/ హైదరాబాద్: లక్డీకాపూల్ ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టేందుకు నగర పోలీసులు, జీహెచ్ఎంసీ నడుం బిగించాయి. ఏళ్ల తరబడి వాహనదారులను వేధిస్తున్న రద్దీకి పరిష్కారంగా రవీంద్రభారతి–లక్డీకాపూల్–ఇక్బాల్ మినార్ జంక్షన్ల మధ్య నూతన వన్‌వే విధానాన్ని తీసుకొస్తున్నాయి. ఈ నెల 22న ఒక్కరోజు ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్ నిర్వహించనున్నాయి. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సిపి సజ్జనర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్వయంగా బైక్‌పై ఆయా మార్గాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.ఓల్ కంట్రోల్ రూం నుంచి రవీంద్రభారతి మీదుగా ఇక్బాల్ మినార్ వైపు వెళ్లే వాహనాలను రవీంద్రభారతి వద్ద మళ్లించి హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ఇక్బాల్ మినార్, సెక్రటేరియట్ జంక్షన్ మీదుగా పంపనున్నారు. నిరంకారి జంక్షన్ వైపు నుంచి ఓల్ కంట్రోల్ రూం వెళ్లే వాహనాలకు కూడా ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్దేశించారు. ఇందుకోసం పలు కూడళ్లను పునర్‌రూపకల్పన చేయడంతోపాటు రహదారుల మరమ్మతులు, విద్యుత్ దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.ట్రయల్ రన్‌కు ముందు స్థానిక వ్యాపారులు, నివాసితులు, నిత్య ప్రయాణికులతో సమావేశమై వారి అభిప్రాయాలు తీసుకోనున్నారు. 22న వాహనాల రద్దీ, ప్రయాణ సమయం, ట్రాఫిక్ ప్రవాహంపై సాంకేతిక సమాచారాన్ని సేకరించి, ప్రజల అభిప్రాయాల ఆధారంగా వన్‌వే కొనసాగింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని సీపీ సజ్జనర్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో రహదారి ఏర్పాట్లు పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. ట్రయల్ రన్‌కు వాహనదారులు సహకరించాలని అధికారులు కోరారు.

ఆర్‌టిఐ సాధన కమిటీ వార్షికోత్సవం



ప్రజాపక్షం/బంజారాహిల్స్: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రెండవ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ హాజరయ్యారు. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం అమలులో ఉన్న సమస్యల పరిష్కారం, దేశవ్యాప్తంగా మానిటరింగ్ మెంబర్స్ వ్యవస్థ ఏర్పాటు, సమాచార హక్కు కార్యకర్తలకు రక్షణ, సమాచార కమిషన్ల బలోపేతం తదితర అంశాలతో పాటు మొత్తం 30 ప్రధాన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ నెలలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చలో ఢిల్లీ జాతీయ స్థాయి ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గోపీనాథన్ కట్టెకోలా, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవింద స్వామి, కె.సాయిరాం, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, లక్ష్మి, అన్నపూర్ణ, రజని, శరత్‌కుమార్, నాగ జ్యోతి, రేణు కుమార్, క్రాంతి కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎ.శ్రీకాంత్‌రెడ్డి, హెచ్.అశోక్ కుమార్, బాపయ్య, సాయి బాబు, సుధీర్,సంజీవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓలెక్ట్రా ఇబిఐటిడిఎలో 18 శాతం వృద్ధి

రూ.687 కోట్లకు చేరిన ఆదాయం..
8 వేలకుపైగా ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనా ల తయారీ సంస్థ ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ంలో మెరుగైన ఫలితాలు సాధించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 5 శాతం పెరిగి రూ.687.01 కోట్లకు చేరింది. ఇబిఐటిడిఏ 18 శాతం వృద్ధితో రూ. 109.89 కోట్లు, పన్నుల అనంతర లాభం (పిఎటి) 5 శాతం పెరిగి రూ.52.12 కోట్లు గా నమోదైంది. త్రైమాసికంలో 401 ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించగా, తొలి ఆరు నెల ల్లో మొత్తం 759 వాహనాలను డెలివరీ చేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4,750కుపైగా ఎలక్ట్రిక్ వాహనాలను అందించిన సంస్థ, 55 నగరాల్లో ప్రజా రవాణా సేవలు అందిస్తోంది. ప్రస్తుతం కంపెనీ వద్ద 8 వేలకుపైగా ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ బుక్ ఉంది.

త్వరలో కొత్త తరం బస్సులు..

నాలుగో త్రైమాసికంలో కొత్త తరం ఎలక్ట్రిక్ బస్సులను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు సంస్థ ఎండి మహేష్ బాబు తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా బస్సులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్డర్ల అమలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, కొత్త ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

40 ఎంజిడిల తరలింపునకు చర్యలు

15లోగా గోదావరి జలాల పనులు పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: సింగూరుమంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సోమవారం ఘన్‌పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

ఒత్తిడిలో కుంగిపోకుండా.. పోలీసులకు మానసిక దన్ను!

శిక్షణ దశ నుంచే మానసిక దృఢత్వంపై ప్రత్యేక తరగతులు



ప్రజాపక్షం/ హైదరాబాద్: విధి ఒత్తిళ్లు, వ్యక్తిగత సమస్యలతో సతమతమయ్యే పోలీసు సిబ్బంది మానసిక ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ పోలీస్ శాఖ సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోంది. సమస్యలను తొలి దశలోనే గుర్తించి, కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించడంతో పాటు శిక్షణ నుంచే ఒత్తిడిని తట్టుకునే మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంపై దృష్టి సారించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం డిజిపి, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అధ్యక్షతన మెంటల్ హెల్త్ కాన్‌క్లేవ్ నిర్వహించారు. అడిషనల్ డిజిపి అ ఖున్ సబర్వాల్, డిఐజి మురళీకృష్ణ, అకాడమీ డి ప్యూటీ డైరెక్టర్లు డి. మురళీధర్, జి. కవిత, కె. ఆర్.కె. ప్రసాద్ పాల్గొన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య దీపక్, డాక్టర్ వెంకట సు బ్బయ్య, డాక్టర్ సుధారాణి, డాక్టర్ దేవిక, బి. అనుప్రియ, డాక్టర్ రమాదేవి తమ సూచనలు అందించారు. తీవ్రమైన మానసిక సమస్యలను తొలిదశ లో గుర్తించి చికిత్స అందించడం, స్వల్ప సమస్యలకు క్రమబద్ధమైన కౌన్సెలింగ్ నిర్వహించడం, కొత్తగా చేరే సిబ్బందికి ఇండక్షన్ శిక్షణ నుంచే ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణపై తరగతులు చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ చర్చల ఆధారంగా పోలీస్ శాఖలో అన్ని స్థాయిల సిబ్బందికి ఉపయోగపడే సమగ్ర మానసిక ఆరోగ్య పాఠ్యప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం

ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: ప్లాస్టిక్ గోదాంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం బేగంబజార్‌లో కలకలం రేపింది. కోల్సావాడిలోని ప్లాస్టిక్ వస్తువుల గోదాంలో జరిగిన భారీ అగ్నిప్రమాదానికి బాణసంచా నిప్పురవ్వలు కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ భవనం మొదటి అంతస్తులో మహేష్ భాటి నిర్వహిస్తున్న ప్లాస్టిక్ గోదాంలో ఈ మంటలు చెలరేగాయి. ఎవరో కాల్చిన రాకెట్ దూసుకురావడంతో గోదాంలోని ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకుని వేగంగా వ్యాపించాయి. మూడు ఫైరింజిన్లతో రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కోల్సావాడి వంటి ఇరుకు గల్లీల్లో పక్కనున్న ఇళ్లకు కూడా మంటలు వ్యాపించి ఉంటే ఊహించని ప్రాణనష్టం జరిగేది. ఇదిలాఉండగా.. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్ వలాంటి ప్రాంతాల్లో నివాస భవనాలను ఇల్లీగల్ గా కమర్షియల్ గోదాంలుగా మారుస్తున్నా బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని.. ఈ విషయంలో కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పటాకుల విషయంలో వివాదం

కత్తులతో దాడి చేసుకున్న వైనం

ప్రజాపక్షం/గోషామహల్: దీపావళి పండుగ సందర్భంగా పటాకులు కాల్చే విషయంలో తలెత్తిన చిరు వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి ఒకే వర్గానికి చెందిన రెండు గ్రూపులు కత్తులతో దాడి చేసుకునే వరకు వెళ్లిన ఘటన బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బేగంబజార్ సిఐ పి.భరత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం అందరూ దీపావళి జరుపుకుంటున్న సందర్భంగా గాంధీభవన్ పటేల్ నగర్లో రెండు వర్గాలు చిన్న విషయమై మాటా మాటా పెరిగి కత్తులతో దాడి చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పటేల్ నగర్లో నివసించే వహీద్, ఇమ్రాన్, షాబాద్ ఒక గ్రూప్ కాగా అమన్, అర్బాజ్, అత్నాన్, ఉబేద్, సల్మాన్, రహమాన్లది ఒక గ్రూప్ టపాసులు కాల్చే విషయమై వారి మధ్యన మాటా మాటా పెరిగి తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే సహనం కోల్పోయి కత్తులతో దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బేగంబజార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడుతున్న రెండు గ్రూపులను చెదరగొట్టి ఉద్రిక్త పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కత్తుల దాడిలో గాయపడిన వారిని వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా దవాఖానాకు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఈ గొడవ కేవలం ఒకే ముస్లిం వర్గానికి చెందినది మాత్రమేనని, హిందూ, ముస్లిం గొడవ కాదని పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సిఐ భరత్ కుమార్ సూచించారు.


బియ్యం లభ్యతపై ఆందోళన వద్దు

సరఫరాకు సంసిద్ధత వ్యక్తం చేసిన రైస్‌మిల్లర్లు
జిల్లా రేషనింగ్ అధికారి జి.వి.శ్యాంప్రసాద్

ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ : బియ్యం లభ్యతపై ఆందోళన చెందవద్దని జిల్లా రేషనింగ్ అధికారి జి.వి.శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైల్ వ్యాపారులకు బియ్యం సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. రిటైల్ వ్యాపారులకు కెఎన్‌ఎం బియ్యం కిలోకు రూ.62,జెఎస్‌ఆర్ బియ్యం కిలోకు రూ.74కు బియ్యం సరఫరా చేసేందుకు మిల్లర్లు ఒప్పుకున్నారని ఆయన చెప్పారు. బియ్యం కొనుగోలు చేయదలచిన రిటైల్ వ్యాపారులు తమ దుకాణం పేరు, చిరునామా, జిఎస్‌టి నెంబరుతో పాటు తమకు కావాల్సిన బియ్యం ఎంతో మొబైల్ నెంబరుతో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారులకు తెలుపాలన్నారు. వ్యాపారుల నుంచి ఇండెంట్ సేకరించి రైస్ మిల్లర్ల ద్వారా రిటైల్ వ్యాపారులకు నేరుగా బియ్యం సరఫరా జరిగేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.

గ్రీన్ ఎనర్జీతో పెట్టుబడులు

టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (కమర్షియల్) సిహెచ్ చక్రపాణి



ప్రజాపక్షం/హైదరాబాద్: పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వ విధానాలతో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (కమర్షియల్) సిహెచ్.చక్రపాణి పిలుపునిచ్చారు. ఇటీవల నిర్వహించిన 'అవాడా కనెక్ట్2026' కార్యక్రమంలో ఆయన ప్రసంగించిన అంశాలను మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 7,700 మెగావాట్లుగా ఉన్న గరిష్ట విద్యుత్ డిమాండ్, 2026 నాటికి సుమారు 20,018 మెగావాట్ల స్థాయికి చేరుకుందని.. విద్యుత్ డిమాండ్ రెండున్నర రెట్లకు పైగా పెరగడం రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం రోజువారీ విద్యుత్ అవసరం సుమారు 334 మిలియన్ యూనిట్ల స్థాయికి చేరుకోగా, తలసరి విద్యుత్ వినియోగం సంవత్సరానికి 2,500 యూనిట్లను దాటిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, పరిశ్రమల్లో ఆటోమేషన్, గృహాల్లో ఆధునిక విద్యుత్ పరికరాల వినియోగం, ఇండక్షన్ ఆధారిత వంట విధానాలు, వ్యవసాయ రంగంలో విద్యుదీకరణ కారణంగా విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని.. ఈ పరిస్థితుల్లో సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి వనరులపై మాత్రమే ఆధారపడకుండా పునరుత్పాదక ఇంధన వనరులను విస్తరించడంతో పాటు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అవసరమైన సమయంలో వినియోగించుకునేలా నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు.భవిష్యత్ విద్యుత్ రంగంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తరించడంలో భాగంగా గృహాలు, అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, పరిశ్రమలపై రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేయడంతో పాటు జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, సాగునీటి కాలువలపై సోలార్ ప్యానెల్స్, వ్యవసాయ భూముల్లో అగ్రి సోలార్ విధానాలతో సుమారు 20,000 మెగావాట్ల వరకు విద్యుత్ పొందే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్2026' ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక సంస్థలు, సాంకేతిక నిపుణులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు తెలంగాణలోని అవకాశాలను పరిచయం చేసే వేదిక లభించనుందని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు జిహెచ్‌ఎంసి వేతనాలు

కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు ఎఐటియుసి నేతల వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసిలో విలీనమైన ప్రాంతాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు సహా అన్ని విభాగాల కార్మికులకు జిహెచ్‌ఎంసి వేతనాలు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఒకే సంస్థ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల ఒకే రకమైన వేతనం లేకపోవడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు సోమవారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కమతం యాదగిరి, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ సోమవారం జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతిపత్రంఅందజేశారు.ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి, యాదగిరి, కిషన్‌లు మాట్లాడుతూ కార్మికులకు 15 క్యాజువల్, 8 జాతీయ, పండుగ సెలవులు కల్పించాలని 2026 జూన్ 19న కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదని యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా, దీపావళికి కూడా సెలవులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కార్పొరేషన్ల పరిధిలో పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, అందరికీ మున్సిపల్ ఐడీ కార్డులు జారీ చేయాలని కోరారు. సెలవులను ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేసి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.జిహెచ్‌ఎంసితో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లలో విలీనమైన ప్రాంతాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్లు, ఇతర విభాగాల కార్మికులకు కూడా జిహెచ్‌ఎంసి వేతనాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ జిహెచ్‌ఎంసి వేతనాలు తప్పనిసరిగా అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నేతలు వెల్లడించారు.

డ్రోన్ టెక్నాలజీతో మార్పులు

ఇంజనీర్లు, సిబ్బందికి డ్రోన్ పైలట్ శిక్షణ



ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: డ్రోన్ ఆ పరేషన్, పైలటింగ్, డేటా సేకరణ, వి ద్యుత్ లైన్ల తనిఖీ, లోపాల గుర్తింపు వం టి అంశాల్లో అధికారులకు, సిబ్బందికి ప్రాక్టికల్ అవగాహన కల్పించడంలో భా గంగా సోమవారం టిజిఎస్‌పిడిసిఎల్ ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, ఐటీ విభాగాల ఆ ధ్వర్యంలో మూడు రోజుల సామర్థ్య ని ర్మాణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా డ్రోన్ పైలట్ శిక్షణ సెషన్ నిర్వహించా రు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ) వి.శివాజీ మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి సీఎండీ ప్ర త్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపా రు. ఇప్పటికే సంస్థలో ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్, ఐటీ ఆధారిత విధానాలను ప్రోత్సహిస్తున్నామని, డ్రోన్ సర్వేల ద్వా రా సేకరించిన సమాచారాన్ని భవిష్యత్తులో, నెట్‌వర్క్ మ్యాపింగ్ వంటి డిజిట ల్ వ్యవస్థలతో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నా రు. శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని అ ధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో స మర్థవంతంగా వినియోగించాలని కోరా రు. డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.ఎన్.నరసి ంహులు మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ఇదిలాఉండగా.. మొదటి దశ డ్రోన్ పైలట్ శిక్షణ కోసం బంజారాహిల్స్, సికింద్రాబాద్, సౌత్, హైదరాబా ద్ సెంట్రల్ ఆపరేషన్ సర్కిళ్లతో పాటు, ఎస్‌సిఏడిఏ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎంపిక చేసి సమగ్ర జాబితాను రూపొందించారు. కార్యక్రమంలో టిజిఎస్‌పిడిసి ఎల్ మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ కరుణాకర్ బాబు, ఎస్‌సిఏడి ఎ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎం. చక్రవర్తి, , సౌత్ సర్కిల్ ఎ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరు దేశద్రోహులనే అంశంపై

చర్చకు రావాలి

ప్రధానికి మరోసారి రాహుల్‌గాంధీ సవాల్

మోదీ 'దిమాగి నక్సల్స్' వ్యాఖ్యలపై మండిపడ్డ ప్రతిపక్షనేత

న్యూఢిల్లీ: దేశద్రోహులు ఎవరు, విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరున్నారు అనే విషయంపై తనతో చర్చకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి సవాలు విసిరారు. సిఆర్‌పిఎఫ్ సిబ్బందినుద్దేశించి ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. జవాన్లు ఆయన 'అబద్ధాలను' నమ్మలేదదన్నారు. ప్రధాని మమ్మల్ని నక్సల్స్ అని పిలిచారు అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. ఈ చర్చ తర్వాత, ప్రధాని మోదీకి మళ్లీ ఒక్క జవాన్ ముందు నిలబడే ధైర్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ పోస్టు చేశారు. 'మోదీ మమ్మల్ని నక్సల్స్ అన్నారు. నా సవాలు అలాగే ఉంది. దేశద్రోహులు ఎవరు, విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరున్నారు అనే విషయంపై నాతో చర్చకు దిగనివ్వండి. ఎప్పుడైనా, ఎక్కడైనా. ఈ చర్చ తర్వాత, ప్రధానికి మళ్లీ ఒక్క జవాన్ ముందు నిలబడే ధైర్యం ఉండదు' అని రాహుల్ అన్నారు. సాయుధ మావోయిస్టులను నిర్మూలించినప్పటికీ, 'దిమాగీ నక్సల్స్' అనేక రాజకీయ పార్టీలు, సంస్థలలోకి చొరబడి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని మోదీ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజున కాంగ్రెస్ మాజీ అధినేత ఈ వ్యాఖ్యలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో ఉన్న సిఆర్‌పిఎఫ్ శిబిరంలో భద్రతా సిబ్బందితో కలిసి ఆదివారం మోదీ దీపావళి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మనం అటువంటి శక్తులను గుర్తించి, ఓడించి, దేశాన్ని సురక్షితంగా ఉంచాలి' అని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ స్పష్టంగా కలత చెంది, ఆందోళనతో, నిస్సహాయ స్థితిలో ఉన్నారని, ఆయన కుప్పలు ఏరుకునే సమయం వేగంగా సమీపిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా మోదీ 'దిమాగీ నక్సల్స్' (నక్సల్ మనస్తత్వం ఉన్నవారు) గురించి ప్రస్తావిస్తూ, దేశం సాయుధ నక్సలిజాన్ని నిర్మూలించడంలో విజయం సాధించిందని, కానీ దాని భావజాల మద్దతుదారులు హింసను ప్రోత్సహించడానికి అవకాశాల కోసం వెతుకుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేక గళంపై ఉద్దేశపూర్వకంగా ముద్ర వేసి, దాని చట్టబద్ధతను దెబ్బతీయడానికి మోదీ 'దిమాగి నక్సల్' వంటి పదాలను వాడుతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. గాంధీ పదేపదే ప్రధాని మోదీని బహిరంగ చర్చకు సవాలు చేస్తున్నారు.

మృత్యు ఘోష

కుటుంబాల్లో దీపావళి విషాదం

అగ్ని, రోడ్డు ప్రమాదాల్లో 37 మంది బలి


మధ్యప్రదేశ్‌లో

ముంబయి/భోపాల్/లక్నో/రాయ్‌పూర్/చెన్నై: దేశవ్యాప్తంగా దీపావళి పండుగ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వేర్వేరు రాష్ట్రాల్లో జరిగిన అగ్ని, రోడ్డు ప్రమాదాల్లో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, చెన్నై రాష్ట్రాల్లో జరిగిన ఘోర ప్రమాదాల్లో ఆయా కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని మిగిల్చింది. మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లా యద్శి గ్రామంలో పండుగ పూట ఓ ఇంట్లో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడడంతో బయటకు వచ్చే మార్గం లేక ఆరుగురు సజీవదహనమయ్యారు. యద్శి గ్రామానికి చెందిన ఉత్తమ్ ట్రింబాక్ (75) కుటుంబ సభ్యులు రాత్రి భోజనం తర్వాత ఎప్పటిలాగే ఇంటిపైన పడుకున్నారు. అర్ధరాత్రి ఒక్కసారిగా కిరాణం దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా ఇంటికి కూడా అంటుకున్నాయి. ట్రింబాక్, అతడి భార్య చంద్రకళ (70), కుమారుడు గోవింద్ (47), కుమార్తె జ్యోతి (42), మనుమరాండ్లు గాయత్రి (16), సిద్ధి (15) మంటల్లో సజీవదహనమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కట్నీ, సియోని జిల్లాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో రెండు కుటుంబాలకు చెందిన 12 మంది మతిచెందారు. కట్ని జిల్లాలోని బర్హి పట్టణంలో అగర్వాల్ కుటుంబానికి చెందిన ఆరుగురు అగ్నిప్రమాదానికి బలయ్యారు. నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆరుగురు కాలిబూడిదయ్యారు. మతులను పూరన్ అగర్వాల్, చంద్రకళ, పూనమ్, ఆర్యా, అన్వీగా గుర్తించారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. షార్ట్ సర్క్యూట్ లేదా దీపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సియోనీ జిల్లాలోని చాపారా పట్టణంలో ఓ నగల వ్యాపారి ఇంట్లో సంభవించిన అగ్నిప్రమాదంలో ఆరుగురు మతిచెందారు. మతులను కుందన్ లాల్ సోనీ, రాజ్‌కుమారి సోనీ, రీతూ సోనీ, స్మతి సోనీ, సూర్య సోనీ, ఆదిత్య సోనీగా గుర్తించారు. మరో నలుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. గాఢ నిద్రలో ఉనప్పుడు ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలోని పానిపట్‌ఖతిమా జాతీయ రహదారి జగహేరి సమీపంలో కారు కరెంట్ పోల్‌ను ఢీకొట్టి మంటలు చెలరేగడంతో ఓ చిన్నారి సహా ఆరుగురు సజీవదహనమయ్యారు. అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని, డివైడర్‌ను బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో భారీగా మంటలు చెలరేగాయి. తప్పించుకునే అవకాశం లేకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఒక చిన్నారి సహా ఆరుగురు వ్యక్తులు కారులోనే చిక్కుకుపోయి సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కారులోని మతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మతులంతా హర్యానాలోని జింద్ లేదా హిసార్ జిల్లాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వీరంతా కారులో హర్యానా నుండి హరిద్వార్‌కు ప్రయాణిస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. చత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా రాజిమ్‌లోని టిలా ఆనికట్ సమీపంలో కారు నదిలో పడిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మతిచెందారు. మతులను శీతల్ సాహు, ఆయన భార్య భారతి, 19 ఏళ్ల కుమారుడు వికాస్, 21 ఏళ్ల కుమార్తె పూర్వగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నదిలో నుంచి మతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వగ్రామంలో దీపావళి వేడుకలు జరుపుకునేందుకు రాయ్‌పూర్ నుంచి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడులో జరిగిన వివిధ ఘటనల్లో తొమ్మిది మంది మతి చెందారు. వారిలో ఒక స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఎస్ఐ) కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి విజయ్ సోమవారం ఎస్ఎస్ఐ మతికి సంతాపం తెలిపి, కుటుంబానికి రూ.40 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. సాదా దుస్తుల్లో విధి నిర్వహణ నుంచి తిరిగి వస్తున్న ఎస్ఎస్ఐ సెంథిల్ కుమార్ (57) తేని జిల్లాలోని సమధర్మపురం గ్రామంలో హత్యకు గురయ్యారు. రోడ్డును దిగ్బంధించి, బాణసంచా కాలుస్తూ ప్రజలలో భయాందోళనలు సష్టిస్తూ, రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న యువకుల గుంపును ఎదుర్కొన్నందుకే ఆయనపై ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తుంది.

రోడ్డెక్కిన పాడి రైతులు

- మహాయుతి సర్కార్ చర్యల్ని వ్యతిరేకిస్తూ కొల్హాపూర్‌లో భారీ ర్యాలీ
- గోకుల్ డెయిరీలో సభ్యుల్ని నామినేట్ చేయడంపై మండిపాటు

కొల్హాపూర్: మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గోకుల్ డెయిరీ పాలకవర్గ కూర్పులో మార్పులను వ్యతిరేకిస్తూ వేలాది మంది పాడి రైతులు సోమవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పశువులతో సహా రోడ్లపైకి వచ్చిన రైతులు... జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. బిజెపి నేతృత్వంలోని అధికార మహాయుతి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొల్హాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘంగా పేరొందిన గోకుల్ డెయిరీ పాలకవర్గంలో అధికార మహాయుతి కూటమి బలాన్ని పెంచేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని రైతులు మండిపడుతున్నారు. 25 మంది సభ్యులున్న పాలకవర్గంలో ప్రస్తుతం మహాయుతి కూటమికి 12 మంది సభ్యుల బలముండగా... కొత్త నిబంధనలతో ఆ సంఖ్య 16కు పెరిగే అవకాశం ఉంది. గత వారం మహారాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల నిర్వహణ కమిటీల్లో ప్రభుత్వ సిఫార్సుతో ఐదుగురు నామినేటెడ్ సభ్యులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపునిచ్చింది. ఈ ఐదుగురిలో నలుగురికి డైరెక్టర్ల బోర్డులో ఓటు హక్కు కల్పించనున్నారు. దీంతో ప్రతిపక్షాలు, పాల ఉత్పత్తిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమిదే పైచేయి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ సతేజ్ పాటిల్ నేతత్వంలోని రాజర్షి షాహు శేత్కరీ సంవిచారి ఆఘాడీ ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తోంది. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ పాలకవర్గ ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను ఈ కూటమి 13 స్థానాలను గెలుచుకుంది. మహాయుతి మద్దతున్న ప్యానెల్ 12 స్థానాలకే పరిమితమైంది. రూ.4,000 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన కీలక సహకార సంస్థపై పట్టు సాధించేందుకు బిజెపి నేతత్వంలోని అధికార కూటమి నేతలంతా కలిసి ప్రచారం చేసినప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలను పరోక్షంగా ప్రభావితం చేసేలా ప్రభుత్వం నిబంధనలు మార్చిందని రైతులు విమర్శిస్తున్నారు. సోమవారం జరిగిన ఆందోళనలో జిల్లా నలువలల నుంచి పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.కొందరు రైతులు తమ పశువులను కూడా ర్యాలీకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నాయకులు, ఎంపీలు, స్థానిక న్యాయవాదులు నల్లజెండాలు, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్న బ్యానర్లతో నిరసనలో పాల్గొన్నారు. సహకార సంస్థల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకే తాము ఉద్యమంలో భాగస్వాములయ్యామని న్యాయవాదులు తెలిపారు.

బాంబే హైకోర్టును ఆశ్రయించిన ఆఘాడీ

ప్రభుత్వ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ సంవిచారి ఆఘాడీ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. కొల్హాపూర్ బెంచ్‌కు సెలవు కావడంతో సోమవారం ఛత్రపతి శంభాజీనగర్ బెంచ్ ఎదుట విచారణకు జాబితా చేశారు. ర్యాలీకి ముందు ఎమ్మెల్సీ సతేజ్ పాటిల్, ఎంపీలు విశాల్ పాటిల్, ధైర్యశీల్ మోహితే పాటిల్, స్వాభిమాని శేత్కరీ సంఘటనా అధ్యక్షుడు రాజు శెట్టి.. పాటిల్‌కు చెందిన అజింక్యతారా కార్యాలయంలో సమావేశమై ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. నిరసన నేపథ్యంలో ర్యాలీ మార్గంతో పాటు జిల్లా కలెక్టరేట్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు.



ప్రజాతీర్పును గౌరవించాలి: సిజెపి

కొల్హాపూర్ రైతుల ఆందోళనపై కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో మరాఠీలో స్పందించారు. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించకుండా అధికార బలంతో ప్రత్యర్థుల ఆధీనంలోని సహకార సంస్థను కైవసం చేసుకునేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజా తీర్పును కాలరాసి అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూసేవారే నిజమైన అరాచకవాదులని పేర్కొన్నారు. గోకుల్ పాల సహకార సంఘాన్ని రాజ్యాంగ విరుద్ధ శక్తుల నుంచి కాపాడేందుకు వీధుల్లోకి వచ్చిన కొల్హాపూర్ ప్రజలకు సెల్యూట్ అంటూ వ్యాఖ్యానించారు.

రైతుల ఓట్లు దొంగిలించడమే: రాహుల్ గాంధీ

మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత వారం తీవ్రంగా స్పందించారు. గోకుల్‌లో పాల ఉత్పత్తిదారులు బిజెపిని ఓడించారని, ఎన్నికల అనంతరం నిబంధనలను మార్చి నలుగురు డైరెక్టర్లను చేర్చడం ద్వారా 12 మంది బలాన్ని 16కు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇది పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమేనని, ప్రజా తీర్పును కలుషితం చేయడమేనని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అధికారాన్ని కాపాడుకునేందుకు బిజెపి ఎక్కడికైనా తెగిస్తోందని విమర్శించారు. పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించే వారిని రైతులు ఎప్పటికీ మర్చిపోరని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

గోకుల్ డెయిరీ పాలకవర్గంలో

ప్రభుత్వ నామినేషన్లపై సిపిఐ ఆగ్రహం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం (గోకుల్ డెయిరీ) పాలకవర్గంలో నలుగురు ప్రభుత్వ ప్రతినిధులను నామినేట్ చేయాలన్న నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ నియామక విధానం అప్రజాస్వామికమని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. గోకుల్ డెయిరీ పాలకవర్గానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను కాంగ్రెస్ 13 స్థానాలను గెలుచుకోగా... ఎన్‌డిఏ కూటమి 12 స్థానాలకే పరిమితమైందని సిపిఐ గుర్తుచేసింది. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ కీలకమైన ఈ సహకార సంస్థపై పట్టు నిలుపుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నలుగురు ప్రభుత్వ ప్రతినిధులను పాలకవర్గంలో నామినేట్ చేయాలని నిర్ణయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. ప్రజాతీర్పును గౌరవించకుండా ప్రభుత్వ నామినేషన్ల ద్వారా బలాన్ని పెంచుకోవడం సరైన విధానం కాదని సీపీఐ స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

అక్రమంగా 2/3 మెజారిటీ పొందేందుకే

పార్లమెంట్ ప్రొరోగ్‌లో జాప్యం

హోంమంత్రికి సమయమిచ్చేందుకు ఈ చర్య


మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు



న్యూఢిల్లీ : వర్షాకాల సమావేశాలు రికార్డు స్థాయిలో 88 రోజులుగా వాయిదా పడకుండా కొనసాగడంపై కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. లోక్‌సభలో అత్యంత కలుషితమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఎలాగోలా తమకు అనుకూలంగా మలచుకుని ప్రమాదకరమైన, విధ్వంసకరమైన డీలిమిటేషన్ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి హోంమంత్రి అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ఇలా చేశారని మండిపడింది. ఏదైనా చట్టాన్ని ప్రవేశపెట్టే ముందు, డీలిమిటేషన్‌పై అన్ని ప్రతిపాదనలను పారదర్శకంగా, వివరంగా చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గత ఆరు నెలల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నాలుగు సార్లు లేఖలు రాశారని, కానీ ప్రధాని అందుకు మొండిగా నిరాకరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీ ఎత్తి చూపింది. పార్లమెంటు నిరవధికంగా వాయిదా పడి నేటికి 88 రోజులు గడిచినా, దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి స్వయంగా రాసిన సందేశంతో, 'కౌల్ అండ్ షక్దేర్'గా ప్రసిద్ధి చెందిన, అధికారిక 'ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్' 8వ సంచిక 2024 మధ్యలో ప్రచురించబడింది. లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేయడానికి, దానిని వాయిదా వేయడానికి మధ్య సాధారణంగా రెండు నుంచి నాలుగు రోజుల వ్యవధి ఉంటుందని 192వ పేజీలో పేర్కొనబడింది. కానీ అదే పేజీలోని ఫుట్‌నోట్ #53లో, గరిష్ట వ్యవధి 28 రోజులుగా ఉందని, అది 2015 వర్షాకాల సమావేశాలకు సంబంధించినదని పేర్కొనబడింది' అని రమేష్ ఎత్తి చూపారు. అయితే, 2008 వర్షాకాల సమావేశాలను రికార్డు స్థాయిలో 87 రోజుల పాటు వాయిదా వేయకుండా కొనసాగించారని పేర్కొంటూ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు 2026 అక్టోబర్ 19న ఖర్గేకు లేఖ రాశారని ఆయన తెలిపారు. '2008తో సహా గతంలో జరిగిన దానికి భిన్నంగా, లోక్‌సభలో అత్యంత అవినీతిమయమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఎలాగోలా వాడుకుని, ప్రమాదకరమైన, విధ్వంసకరమైన డీలిమిటేషన్ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోం మంత్రికి సమయం ఇవ్వడానికే ఈ రికార్డును నెలకొల్పారు' అని రమేష్ అన్నారు.

కేన్సర్ మందుల ధరలు తగ్గాయ్

- *1,364 కేన్సర్ నిరోధక మందుల ధరలు సోమవారం నుంచి అమల్లోకి*
- *వినియోగదారులకు ఏటా సుమారు రూ. 3,540.38 కోట్లు ఆదా*



న్యూఢిల్లీ : దేశంలో కేన్సర్ నిరోధక మందుల ధరలు తగ్గాయి. సవరించిన 1,364 కేన్సర్ నిరోధక మందుల గరిష్ట చిల్లర ధరలు (ఎంఆర్‌పిలు) సోమవారం నుండి అమల్లోకి వచ్చాయి. ఈ చర్య ద్వారా వినియోగదారులకు ఏటా సుమారు రూ. 3,540.38 కోట్లు ఆదా అవుతాయని అంచనా వేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్‌ఎస్) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ, అక్టోబర్ 17, 2026న సమర్పించిన సిఫార్సుల ఆధారంగా, ఫార్మాస్యూటికల్స్ విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ), 137 క్యాన్సర్ నిరోధక మందుల ఎంఆర్‌పిలపై వాణిజ్య మార్జిన్‌లకు పరిమితి విధించింది. నవంబర్ 8, 2026 నాటికి 85 ఫార్మాస్యూటికల్ కంపెనీలు 121 రకాల ఔషధాలకు చెందిన 1,364 క్యాన్సర్ నిరోధక ఫార్ములేషన్ల కోసం సవరించిన ఎంఆర్‌పిలను నివేదించినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. 679 బ్రాండ్‌లకు 50 శాతానికి పైగా ధరల తగ్గింపులు నమోదయ్యాయని, అత్యధికంగా 96.45 శాతం ధర తగ్గింపు నమోదైందని రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ: ఫార్మాస్యూటికల్స్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సవరించిన ఎంఆర్‌పి కంటే ఎక్కువ వసూలు చేయడానికి ఏ కెమిస్ట్ లేదా ఆసుపత్రి ఫార్మసీకి అనుమతి లేదని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్యాక్‌లపై ముద్రించిన సవరించిన ఎంఆర్‌పి, 'ఫార్మా సహీ దామ్' మొబైల్ అప్లికేషన్ లేదా అధికారిక ఎన్‌పిపిఎ వెబ్‌సైట్ ద్వారా వినియోగదారులు మందుల ధరలను సరిచూసుకోవచ్చని తెలిపింది. అధిక వసూళ్లు లేదా ఇతర ధరల సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫార్మా జన్ సమాధాన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు లేదా 1800111255 నంబరులో ఎన్‌పిపిఎ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.

యుపి ఎన్నికలకు సమాయత్తం

- పొత్తుపై కాంగ్రెస్, ఎస్‌పి మల్లగుల్లాలు
- త్వరలో ఇరు పార్టీల నుంచి సంప్రదింపుల కమిటీలు
- 175-200 స్థానాలు కోరుతున్న కాంగ్రెస్

లక్నో: వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీట్ల సర్దుబాటుపై చర్చలకు సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం ఇరు పార్టీలు త్వరలోనే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నాయి. త్వరలోనే ఈ కమిటీలు సమావేశమై పొత్తు, స్థానాల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నాయి. పీ కాంగ్రెస్ ఇంచార్జి రాజేంద్ర గౌతమ్ మాట్లాడుతూ... తమ అభ్యర్థులను నిలబెట్టాలనుకుంటున్న 175 నుంచి 200 స్థానాల జాబితాను ఎస్పీకి అందించినట్లు తెలిపారు. సీట్ల పంపకంపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటే ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేయవచ్చన్నారు. గెలుపు అవకాశాలతో పాటు కాంగ్రెస్‌కు గౌరవప్రదమైన సంఖ్యలో స్థానాలు దక్కడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవడంలో ఎలాంటి సమస్య లేదని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే విషయంలో గెలుపు అవకాశాలే ప్రధాన ప్రాతిపదికగా ఉంటాయని గతంలోనూ అనేకమార్లు వెల్లడించారు. మరోవైపు, కాంగ్రెస్‌లో సీట్ల సంఖ్యపై ఏకాభిప్రాయం ఉన్నట్లు కనిపించడం లేదు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన ఆరాధన మిశ్రా... తమ పార్టీ 100కు పైగా స్థానాల్లో పోటీ చేస్తుందని ఇటీవల రాంపూర్ ఖాస్ సభలో ప్రకటించారు.

ఒంటరి పోరుకే కాంగ్రెస్ శ్రేణుల మొగ్గు?

కొన్ని జిల్లాల కాంగ్రెస్ కమిటీలు మాత్రం ఎస్పీతో పొత్తును వ్యతిరేకిస్తున్నాయి. అఖిలేశ్ కుటుంబానికి పట్టున్న ఇటావా జిల్లా కమిటీ సహా పలు విభాగాలు.. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలని కేంద్ర నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. ఎస్పీతో పొత్తు తమ పార్టీకి నష్టం కలిగిస్తోందని గోరఖ్‌పూర్‌కు చెందిన ఓ సీనియర్ కాంగ్రెస్ నేత అభిప్రాయపడ్డారు. స్వామి ప్రసాద్ మౌర్యకు చెందిన అప్నా జనతా దళ్, చంద్రశేఖర్ ఆజాద్ సమాజ్ పార్టీ వంటి చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని సూచించారు. 2017లో బిజెపి చేతిలో ఓటమి తర్వాత యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమంలో అఖిలేశ్, ఆయన తండ్రి ములాయం సింగ్ యాదవ్ బిజెపి నేతలతో వేదిక పంచుకున్న విషయాన్ని కూడా ఆ నేత గుర్తుచేశారు. దీంతో సీట్ల పంపకంపై ఇరు పార్టీల్లో చర్చలు ఎలా సాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఎర్రకోట వద్ద పేలుడుకు ఏడాది

దేశవ్యాప్తంగా భద్రత పటిష్టం



న్యూఢిల్లీ: ఎర్రకోట వద్ద పేలుడుకు మంగళవారంతో ఏడాది పూర్తికానుంది. దీంతో దేశవ్యాప్తంగా కేంద్ర భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఆ పేలుడు జరిగినప్పటి నుంచి చేపట్టిన వివిధ ఆపరేషన్లలో 300 మందికి పైగా నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు దిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. శ్రీనగర్ పోలీసుల చొరవతో 'డాక్టర్ మాడ్యూల్' కుట్ర కోణం వెలుగులోకి వచ్చింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా వర్సిటీ సమీపంలో 2,900 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి డాక్టర్ ఉమర్‌ఉన్ నబీ వాహన పేలుడులోనే మతి చెందాడు. ఫిబ్రవరి 23న 'ప్రహార్' పేరుతో నూతన జాతీయ కౌంటర్ టెర్రరిజం పాలసీ ప్రారంభించారు. పాక్ ఆధారిత ఎస్‌బీఎన్ నెట్‌వర్క్‌పై 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 300 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశారు. విదేశాల్లో పరారీలో ఉన్న ఉగ్రవాదులను వేగంగా రప్పించేందుకు సెప్టెంబరులో ఎక్స్‌ట్రడిషన్ పోర్టల్ ప్రారంభించారు. జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, ఖాలిస్థాన్, జేఎంబీ ఉగ్ర మాడ్యూళ్లను భద్రతా బలగాలు, పోలీసులు ధ్వంసం చేశారు. రసాయనాలు, అమ్మోనియం నైట్రేట్ విక్రయాలపై దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.

ఖర్గే 'ఖుషియోన్ కా ఈద్' వ్యాఖ్యలపై

బిజెపి, కాంగ్రెస్ పరస్పర విమర్శలు



న్యూఢిల్లీ : దీపావళి సందర్భంగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'ఖుషియోన్ కా ఈద్' అంటూ వ్యాఖ్యానించారు. అయితే ఖర్గే వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో బిజెపిపై కాంగ్రెస్ విరుచుకుపడింది. 'ఈద్' అనే పదానికి అక్షరార్థం పండుగ అని, కాబట్టి ఆ వ్యాఖ్యను పెద్దదిగా చేస్తున్న వారికి అర్థంపై అవగాహన లేదని మండిపడింది. గత రెండు రోజుల క్రితం పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ దీపావళిని 'ఖుషియోన్ కా ఈద్' అని పిలవడంపై ఖర్గేపై బిజెపి తీవ్రంగా విరుచుకుపడింది. ఈద్‌ను 'ఆనంద దీపావళి' అని పిలవాలని ఆయనకు, సీనియర్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సవాలు విసిరింది. కాంగ్రెస్‌ను సనాతన వ్యతిరేక పార్టీ అని కూడా బిజెపి అభివర్ణించింది. బిజెపిపై కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా విరుచుకుపడుతూ 'ఖర్గే ప్రకటనను పెద్ద రచ్చ చేస్తున్న వారికి పదాల అర్థంపై అవగాహన లేదు. 'ఈద్' అనే పదానికి అక్షరాలా అర్థం 'పండుగ'. ఇప్పుడు వెళ్లి ఆయన ప్రకటనను మళ్లీ వినండి. ఇది పూర్తిగా సాధారణమైనది' అని ఖేరా ఎక్స్‌లో పోస్టు చేశారు. 'దీపావళి స్ఫూర్తితో, దేవుడి దయతో, దయచేసి మీ మెదడులో కూడా ఒకటి రెండు బల్బులు వెలిగించండి, మీ మూర్ఖత్వాన్ని బహిరంగంగా ప్రదర్శించకుండా మమ్మల్ని వదిలేయండి. జాహిల్ కహీం కే (వాళ్ళు నిరక్షరాస్యులు)' అని ఖేరా అన్నారు.

ప్రైవేట్ ఉద్యోగులకూ పెటర్నిటీ లీవ్స్

కేంద్రానికి జాతీయ మహిళా కమిషన్ సిఫార్సులు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలో పనిచేసే పురుషులకు కూడా వేతనంతో కూడిన పెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ సిఫార్సులు చేశారు. పని ప్రదేశాల్లో శిశు సంరక్షణ మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వానికి 37 కీలక సిఫార్సులను చేశారు. 'పిల్లలు పుట్టిన తర్వాత మహిళలు ఉద్యోగానికి గ్యాప్ ఇవ్వాల్సిన అవసరం రాకూడదు. సమాన బాధ్యత తీసుకుంటేనే ఇది సాధ్యం' అని విజయ రహత్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తండ్రులకు కూడా వేతనంతో కూడిన పెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలని విజయ రహత్కర్ సూచించారు. ప్రసూతి ప్రయోజనాలు, చైల్డ్‌కేర్ మౌలిక వసతులు, కార్యాలయాల్లో వివక్ష నివారణ వంటి 9 కీలక విభాగాలపై పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖ, కార్మిక, ఔణ మంత్రిత్వ శాఖలకు విజయ రహత్కర్ నివేదిక సమర్పించారు.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఇసి కసరత్తు

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం(సిఇసి) కసరత్తు ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఇసి పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఫుల్ బెంచ్ నవంబరు చివరి వారంలో లేదా డిసెంబరులో తమ పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి... వారి అభిప్రాయాలు స్వీకరిస్తుంది. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ స్థాయి బందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులు సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ బందాలు తమ నివేదికలను ఎన్నిక ల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తున్నది.

ఇరాన్‌పై దాడులు అనవసరం

అది విఫలమవుతున్నదేశం, 301 శాతం ద్రవ్యోల్బణం ఉంది

అవసరమైతే ఒక్క గంటలో 38 వంతెనలు ధ్వంసం చేస్తాం

సిఎన్ఎన్–సిబిఎస్ ఇంటర్వ్యూల్లో ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌పై దాడులు అనవసరమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. తెరవెనుక జరుగుతున్న చర్చల్లో పురోగతి సాధిస్తే ఇరాన్‌పై కొత్త దాడులు ఉండబోవని చెప్పారు. జాతీయ భద్రత, ఇరాన్‌యుద్ధంపై సిఎన్ఎన్ ప్రతినిధి జిమ్ స్కియూటోతో ఇరవైనిమిషాలు, సిబిఎస్‌తో 60 నిమిషాలు ఇంటర్వ్యూలలో ట్రంప్ మాట్లాడారు. ''ఇరాన్‌పై మళ్ళీ దాడులు వారి వైఖరిపైనే ఆధారపడి ఉంది, మళ్ళీ దాడులు అసంభవం, ఎందుకంటే అదొక విఫలమవుతున్నదేశం, ఆ దేశంలో ద్రవ్యోల్బం 301 శాతంగా నమోదైంది ఆర్థికంగా విఫలమవుతోంది, సైనికంగా దెబ్బతీశాం, మేం వారిని పూర్తిగా అంతం చేయగలం'' అని చెప్పారు. ఇరాన్ గనుక బలమైన ఒప్పందంపై సంతకాలు చేస్తే దాడులు జరిగే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. మళ్ళీ దాడులకు అవకాశం కలిగే పరిస్థితులు తలెత్తితే, ఒక్క గంట వ్యవధిలోనే ఇరాన్‌లో ఉన్న 38 వంతెనలను అమెరికా సైన్యం ధ్వంసం చేయగలదని హెచ్చరించారు. ఇరాన్ అణు ఒప్పందాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ఐతే దాడులు అసంభవని ట్రంప్ చెప్పడంతో చమురు మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి.ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో తాము కోరినవిధంగా ఒప్పందం ఉండాలని, అదేవిధంగా హోర్ముజ్ జలసంధిని తెరవడానికి కూడా చర్చలు పురోగతి సాధించాలని, ఈ రెండు విషయాల్లో పురోగతి సాగినంతకాలం దాడులు చేయాలని తాను సైన్యాన్ని ఆదేశించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అన్నారు. నేను మళ్ళీ దాడులకు ఆదేశించే అవకాశాలు అసంభవమన్నారు. ''మేం వారిని చాలా గట్టిగా దెబ్బతీశాం, నేను వారిని ఎంత గట్టిగా దెబ్బతీశాననే విషయం మీకు తెలియదు, కాబట్టి మళ్ళీ నాకు ఆ అవసరం రావడం అసంభవం''అన్నారు. బహుశా మార్కో రుబియో విదేశాంగమంత్రిగా కొనసాగే అవకాశం ఉందని అన్నారు. హెగ్సెత్‌ను డెమోక్రాట్లు అభిశంసించే అవకాశం ఉందని వస్తున్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. అదేవిధంగా 2028 ఎన్నికల్లో అధ్యక్షుడుగా తాను ఎవరిపేరు ప్రస్తావించబోనన్నారు. ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అధ్యక్ష అభ్యర్థిగా ఎప్పటినుండో ప్రచారంలో ఉన్నారు. ఐతే మధ్యంతర ఎన్నికల్లో ఓటమికి ఇరాన్ యుద్ధం కారణమని వాన్స్ విమర్శించడంతో ఇద్దరిమధ్యా విభేదాలు తలెత్తాయని వార్తలు వెలువడ్డాయి. సోమవారం ఆయన మధ్యవర్తిదేశం ఖతార్ ప్రధానమంత్రితో కూడా సమావేశం జరిపారు.ఇరాన్‌తో యుద్ధం ఎనిమిది నెలలు దాటినాగానీ రెండు దేశాలమధ్యా ప్రతిష్టంభన తొలగిపోలేదు, పెద్దగా దౌత్య పురోగతి లేదు.మధ్యవర్తిదేశం ఖతార్ ప్రభుత్వం చర్చల వర్తమాన పరిస్థితిని వివరించడంపై మౌనం దాల్చింది.మరోవైపు హోర్ముజ్ జలసంధిలో సముద్ర మందుపాతరల బారినపడి అనేక నౌకలు మంటల్లో దగ్ధమవుతున్నాయి. నౌకలపై కూడా ఇరాన్ దాడులు చేస్తోంది. వార్తలకు అందనిస్థాయిలో స్వల్ప దాడులు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను ఇరాన్ ఒక సానుకూల సంకేతంగా భావించింది.తన విజయంగా అంచనావేసింది. ఇక ఐఆర్‌జిసి కూడా తన వైఖరిని మరింత కఠినతరం చేయగా, మరోవైపు హౌతీ తిరుగుబాటు సైన్యాలు యెమెన్ ప్రభుత్వ దళాలపైన,సౌదీ అరేబియా స్థావరాలపైన దాడులు చేస్తున్నాయి.సౌదీ అరేబియా కూటమి దళాలు కూడా యెమెన్‌లో హౌతీలపై తన దాడులను ఉద్ధృతం చేసింది. కాగా, రాజధాని సనా నగర సమీపంలో సౌదీ అరేబియా కూటమి సైన్యాల దాడిలో24 మంది మరణించినట్లు హౌతీలు ప్రకటించారు.హోర్ముజ్ జలసంధిలో గల్ఫ్ ఆఫ్ ఒమన్ వద్ద సముద్ర మందుపాతరను ఢీకొని దగ్ధమైన నౌక నుండి 22 మంది నావికులను సహాయబృందాలు కాపాడాయి.

ఐసెన్‌కోట్‌కు ఇజ్రాయెల్ అధ్యక్షుడి ఆహ్వానం

- దాదాపు ఆరు వారాలు గడువు
- నెతన్యాహూను పదవీచ్యుతుణ్ణి చేసి కొత్త శకం తెస్తాం: ఐసెన్‌కోట్
- లికుద్ కూటమి భాగస్వామ్య పార్టీలకు షరతులతో ఆహ్వానం

టెల్‌అవీవ్: ప్రభుత్వం ఏర్పాటు చేయాలని యషర్‌పార్టీ నాయకుడు గాడి ఐసెన్‌కోట్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐసెన్ హెర్జాగ్ శనివారం సాయంత్రం ప్రకటించారు. ఈ మేరకు ఐసెన్‌కోట్‌కు ఆదివారంనాడు సాయంత్రం ఐదు గంటలకు అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో అధికారిక సందేశాన్ని స్వీకరించారు. ఈమేరకు ఆయనకు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 28 రోజులు గడువు ఉంటుంది. అవసరం అయితే మరో 14 రోజులపాటు ఈ గడువు పొడిగిస్తారు. ఈ విధంగా మొత్తంగా ఆయనకు దాదాపు ఆరువారాలు గడువు లభిస్తుంది. ఈ సందర్భంగా ఐసెన్‌కోట్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ,''ప్రస్తుత ప్రధానమంత్రి నెతన్యాహూను పదవీచ్యుతుణ్ణి చేస్తాం, దేశంలో కొత్త శకాన్ని తీసుకువస్తాం''అని ప్రతిజ్ఞ చేశారు.''దేశంలో ప్రస్తుత పరిస్థితి కొనసాగితే అంధకారంలోకి జారిపోయే ప్రమాదం ఉంది, ఇక ఒక సమాజంగా మనం తిరిగి తలెత్తే అవకాశం ఉండదు, అందువల్ల కొత్త నాయకత్వం ఆవశ్యకత ఉంది, వారి కళ్ళల్లోకి చూడగానే నమ్మగలిగిన నాయకత్వం మనకు ఉండాలి, ఇజ్రాయెల్ భద్రత, ప్రజాసంక్షేమమే వారి లక్ష్యంగా ఉండాలి'' అన్నారు.లికుద్‌పార్టీని ప్రభుత్వంలోకి చేర్చుకునేందుకు ఆయన తిరస్కరించారు.తన సూత్రాలకు కట్టుబడి ఉండేవారికి రాబోయే సంకీర్ణ ప్రభుత్వం తలుపులు తెరచే ఉంటాయని లికుద్ భాగస్వామ్యపార్టీలను ఉద్దేశించి ఆహ్వానం పలికారు.

''జాతీయ అత్యవసర ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఇదే సరైన సమయం,మనల్ని అర్హులుగా నిర్ధారించుకోవడానికి నేను చేయగలిగిన కృషి చేస్తాను''అని ప్రకటించారు. ఐసెన్‌కోట్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం అంత సులభం కాదు, మద్దతు ఇస్తామంటూ ముందుకు వచ్చిన అరబ్‌పార్టీలను తీవ్రంగా వ్యతిరేకించే పచ్చిమితవాద యూదుపార్టీలు ఆయన కూటమిలో ఉన్నాయి.

ఇజ్రాయెల్ పార్లమెంటు క్నెసెట్‌లో మొత్తం 120 స్థానాలు ఉండగా, ఇందులో ఐసెన్‌కోట్ నాయకత్వానగల కూటమికి 48 స్థానాలు, అరబ్ పార్టీల నాయకత్వానగల జాయింట్ లిస్ట్‌కు 19 స్థానాలు, నెతన్యాహూ కూటమికి 53 స్థానాల బలం ఉంది. ఐసెన్‌కోట్‌కు మద్దతు ఇస్తామని జాయింట్ లిస్ట్‌పార్టీలు ఐదు రోజుల క్రితమే ఉమ్మడి సమావేశంలో తమ నిర్ణయం ప్రకటించాయి.దేశాధ్యక్షుడికి ఈ విషయాన్ని తెలియజేశాయి. ఐతే అక్టోబరు 26వ తేదీన జరిగిన ఎన్నికల్లో అధికార లికుద్‌పార్టీ అత్యధికంగా 27 స్థానాలతో పార్లమెంటులో మొదటిస్థానంలో ఉన్నప్పటికీ అధికారానికి పూర్తిగా వెనుకబడి ఉంది.

గెలిచిన ఎంపిలు దాదాపు 67 మంది ఐసెన్‌కోట్‌ను ప్రధానమంత్రిగా నియమించాలని సిఫార్సు చేశారని, నెతన్యాహూకు 46 సిఫార్సులు మాత్రమే వచ్చాయని,వీటిని పరిగణనలోకి తీసుకున్నామని అధ్యక్షుడు హెర్జాగ్ చెప్పారు.ఈ పరిస్థితుల్లో మొదటి అవకాశం ప్రతిపక్ష నాయకుడు ఐసెన్‌కోట్‌కే లభించింది. ఈ ఇద్దరి బలం కలిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 61 స్థానాలకంటే మరో ఆరు స్థానాలబలం ఎక్కువే ఉంది. ఒకవేళ అన్య కారణాలవల్ల ఐసెన్‌కోట్ నిర్ణీత గడువులోపు జాతీయ ప్రతిపాదిత జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతే ప్రస్తుత ప్రధానమంత్రి నెతన్యాహూకు తదుపరి అవకాశం ఇస్తారు. మరోవైపు నెతన్యాహూ కూడా చాలా గట్టిగా తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

దేశాధ్యక్షుడు హెర్జాగ్ నవంబరు ఏడో తేదీ సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేస్తూ, గడచిన బుధ, గురు వారాల్లో ప్రత్యర్థి పార్టీలతోను, ఇతర ప్రముఖులతోనూ



చర్చలు జరిపి ఐసెన్‌కోట్,నెతన్యాహూలకు తన నిర్ణయాన్ని తెలియజేశానని, మొదటి పిలుపుగా ఐసెన్‌కోట్‌నే ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, నెతన్యాహూ లికుద్‌పార్టీ, దాని మిత్రపక్షాలు అత్యవసర జాతీయ ప్రభుత్వంలో చేరగలవని యషర్‌పార్టీ ప్రకటించినప్పటికీ ఈ మేరకు అధికారికంగా నెతన్యాహూకు ఎలాంటి అహ్వానం పంపలేదు.పైగా నెతన్యాహూ లేదా ఆయన భాగస్వామ్యపార్టీలతో ఎలాంటి కూటమిలోనూ తాను ఉండదలచుకోలేదని పదే పదే ఐసెన్‌కోట్ ప్రకటించారు.అదేవిధంగా 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు దేశంపైన దాడిచేసినప్పుడు అధికారంలో ఉన్నవారంతా ప్రజాజీవితం నుండి వైదొలగాలని కూడా ఆయన డిమాండ్ చేస్తున్నారు.

లికుద్‌తో ఐక్య ప్రభుత్వాన్ని తిరస్కరించిన ఐసెన్‌కోట్

ఎన్నికలు ముగిసిన వెంటనే నెతన్యాహూ ఒక బలమైన మితవాద ప్రభుత్వాన్ని దేశంలో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కానీ తర్వాత ఎదురుగాలి దృష్ట్యా నవంబరు రెండో తేదీనాటికి మాట మార్చారు .ప్రతిపక్ష కూటమితో కలిసి జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్నారు. ఐతే ఈ జాతీయ ప్రభుత్వంలో తన మితవాద పార్టీలన్నీ అనివార్యంగా భాగస్వాములుగా ఉండితీరాలని చెప్పారు.జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ వంతులవారీగా ప్రధానమంత్రి పదవిని పంచుకునే విధానం ఉంటుందని నెతన్యాహూ ప్రకటించలేదు.ఐతే ఆయన సన్నిహితుడు మాత్రం ఒకవేళ చర్చలు జరిగితే అందుకు ఆయన ఒప్పుకునే అవకాశం ఉందని అన్నారు. జాతీయ ఐక్య ప్రభుత్వం ఏర్పాటు విషయంపై నెతన్యాహూ ఒక సన్నిహితుణ్ణి పంపినప్పుడు తక్షణం నిర్ద్వంద్వంగా ఆ ప్రతిపాదనను ఐసెన్‌కోట్ తిరస్కరించారని ఒక నివేదిక తెలియజేసింది.ఎందుకంటే నెతన్యాహూ కూటమి భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు ఐసెన్‌కోట్ సిద్ధంగా లేరు. తన సూత్రాలకు అంగీకరించేవారికి మాత్రమే ప్రభుత్వంలో స్థానం ఉంటుందని అన్నారు.

ఇజ్రాయెల్ నిర్మూలన యత్నం నెతన్యాహూ విమర్శ

ఇజ్రాయెల్ రాజ్యాన్ని నిర్మూలించాలని ప్రయత్నం చేస్తున్నారని నెతన్యాహూ విమర్శించారు. ఆయనే ప్రధానమంత్రిగా జాతీయ ఐక్య ప్రభుత్వాన్ని తిరస్కరించడంతో ఒక వీడియో సందేశంలో నెతన్యాహూ,''అరబ్ పార్టీలతో కలిసి కొంతమంది హడావుడిగా ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు, అరబ్ పార్టీలు ఉగ్రవాదులు, వినాశనకారులు, ఇజ్రాయెల్ రాజ్యాన్ని నిర్మూలించాలని కోరుకునేవారితో వచ్చేవారంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు'' అని అరబ్ పార్టీలను, ఐసెన్‌కోట్ కూటమిని ఉద్దేశించి నెతన్యాహూ విమర్శించారు.''హమాస్ మద్దతుదారులపై ఆధారపడిన ప్రభుత్వం హమా టస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయదు, గాజా, లెబనాన్‌లలో పనిచేస్తున్న సైనికులను ఇలాంటి ప్రభుత్వం రక్షించదు, ఇటీవల యూరప్‌వ్యాప్తంగా జరిగిన అల్లర్లకు ఇస్లామిస్టులే కారణం, జాయింట్ లిస్ట్‌తో ప్రభుత్వం ఏర్పడితే అలాంటి అల్లర్లు ఇజ్రాయెల్‌లో కూడా జరుగుతాయి'' అని నెతన్యాహూ తనకు అనుకూలమైన వాతావరణం సృష్టించుకునే ప్రయత్నంగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

ఎల్ నినో–వాతావరణ భయాలమధ్య కాప్–31 ప్రారంభం

అమెరికా మినహా 200 దేశాలు, సంస్థలు హాజరు

అంటాల్యా: ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పలు రకాల ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ భయాలు నెలకున్న తరుణంలో ఈజిప్టు అంటల్యా నగరంలో అంతర్జాతీయ వాతావరణ సదస్సు కాప్–31 సోమవారం ప్రారంభమైంది. భూతాపం రోజు రోజుకూ వినాశకరంగా మారుతోందని తొలుత జరిగిన ప్లీనరీ సమావేశంలో ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల కార్యనిర్వాహక కార్యదర్శి సైమన్ స్టీల్ హెచ్చరించారు. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దహించివేస్తున్న వడగాలులు, హిమనీనదాల వరదలకు ఇప్పుడు ఎల్‌నినో తోడై ఆజ్యం పోస్తోందని అన్నారు.ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సదస్సు(యుఎన్‌సిసిసి) లేదా యుఎన్ఎఫ్‌సిసిసి పార్టీస్ కాన్ఫరెన్స్‌గా పేర్కొంటున్న ఈ సదస్సు నవంబరు 20వ తేదీ వరకూ జరుగుతుంది. దాదాపు 200 దేశాల అధికారిక ప్రతినిధులు, సంస్థలు, ఎన్‌జిఓల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ సదస్సుకు ఈసారి అమెరికా గైరుహాజరైంది. శుద్ధ ఇంధనంవైపు ప్రపంచ పయనం,అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు,వాయు కాలుష్యం,భూతాపం,వాతావరణ సమస్యల పరిష్కారానికి పెట్టుబడులు సమకూర్చు



కోవడం,ఎల్‌నినో ప్రభావం,ప్రపంచవ్యాప్తంగా నెలకున్న ఇంధన కొరత సమస్యలతోపాటు ఆర్థిక సమస్యలు ఈ కాప్–31లో ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటాయి.

ఈ వాతావరణ మార్పులకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మూల్యం చెల్లిస్తున్నదని బలహీనవర్గాలేనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాది శిలాజ ఇంధన ధరల పెరుగుదల ప్రకంపనలు సృష్టించిందని, స్వచ్ఛమైన ఇంధనంవైపు మళ్ళాలని, వాతావరణ నియంత్రణ చర్యలు చిత్తశుద్ధితో దేశాలు అమలు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థలు మెరుగుపడతాయని చెప్పారు.శిలాజ ఇంధనంపై ఆధారపడటం వల్లనే ఆర్థిక పరిస్థితులు దిగజారుగుతున్నాయన్నారు.ఇంధన ధరల పెరుగుదల కుటుంబాలను దెబ్బతీసిందని,ద్రవ్యోల్బణం ఒక కేన్సర్‌లా వ్యాపించిందని అన్నారు.పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రాధాన్యతను వివరించారు.వాతావరణ సదస్సుకు బాధ్యతలు పెరిగాయని,అందువల్ల రాబోయే ఆరునెలల్లో యుఎన్ఎఫ్‌సిసికి ఆర్థిక వనరుల సమస్య వస్తుందని,ఈ విషయంలో అనేక దేశాల నుండి వనరుల సమీకరణకు చర్చలు జరపాల్సి ఉందన్నారు.కాప్ సదస్సులు గతంకంటే పురోగతి సాధించాయన్నారు.





కృష్ణా నీరు తెస్తా

(మొదటి పేజీ తరువాయి)

నాటికి కృష్ణా జలాలతో కొడంగల్ భూములు తడుపుతామన్నారు. కొడంగల్ గడ్డమీద పచ్చని పంటలు పండిస్తామన్నారు. ఎవరూ అడ్డొచ్చినా కృష్ణా నదిలో ముంచైనా కృష్ణా జలాలను తీసుకొస్తామని తేల్చిచెప్పారు. కొడంగల్ ప్రాంతానికి వేల కోట్ల పెట్టుబడులు తెచ్చి వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. గతంలో చదువు, ఉపాధి కోసం పక్క జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది.. కానీ ఇప్పుడు చదవుకోవడానికి కొడంగల్‌కే రావాలని అన్నారు. 70 ఏండ్లుగా కొడంగల్‌కు అన్యాయం జరిగిందని.. ఇప్పుడు అభివృద్ధికి అవకాశం వస్తే ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. కొడంగల్‌కు రూ.10 వేల కోట్లు బరాబర్ తెచ్చకుంటామని.. ఇది మా హక్కు అని అన్నారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. పాలమూరు జిల్లా ప్రజలు కెసిఆర్‌ను గుండెల్లో పెట్టుకుని ఎంపిని చేశారని.. గెలిచిన తరువాత పాలమూరు రుణం తీర్చుకుంటారని ఆశించామని అన్నారు. కానీ కెసిఆర్ మన గుండెల మీద తన్ని నట్టేట్లో ముంచి కృష్ణా నదిలో కలిపేశాడని.. పాలమూరు జిల్లా ప్రజల గుండెల మీద తన్ని కెసిఆర్ గజ్వేల్‌కు పోయిండని విమర్శించారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్నప్పటికీ కెసిఆర్‌కు కృతజ్ఞత లేదని.. గుండెల్లో పెట్టుకుని చూసుకున్న పాలమూరు ప్రజలపై ఆయన కక్ష పెంచుకున్నాడని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని అన్నారు. కెసిఆర్ నెత్తిన అప్పు.. చేతిలో చిప్ప పెట్టి ఫామ్‌హౌస్‌లో ప్రశాంతంగా పండుకున్నారని విమర్శించారు. తెలంగాణ వస్తే పాలమూరులో వలసలు ఆగుతాయ్.. మా కష్టాలు తీరుతాయని అనుకున్నాం. కానీ ఎందరు పాలకులు మారిన పాలమూరు ప్రజలు బతుకులు మారలేదు. గతంలో పాలమూరు నుంచి ఎంతో మంది మంత్రులుగా పని చేశారు. ఎంత మంది మంత్రులైనా పాలమూరులో నీళ్లు పారలేదు.. వలసలు ఆగలేదు. దశాబ్దాలు గడిచిన పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి కాలేదన్నారు. ఈ జిల్లా ప్రజలు ఎప్పుడూ నీళ్లు, పరిశ్రమల కోసం ఎంతో మందిని అడిగారని కానీ పాలమూరుకు నీళ్లు, నిధులు, పరిశ్రమలు ఇచ్చిన వారే లేరని అన్నారు. పాలమూరు ప్రజల ఆశీస్సులతో సిఎం అయ్యానని.. మంత్రులు, ఎమ్మెల్యేలు తనను వారి నాయకుడిగా గుర్తించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరులో ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కెసిఆర్ మనసుపెట్టి ఉంటే పనిచేసి ఉంటే ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు ఎప్పుడో పూర్తియ్యేదని వ్యాఖ్యనించారు. తెలంగాణ వరప్రదాయినిగా మారాల్సిన ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి ప్రాజెక్టు పేరు స్థలం మార్చి అంచనాలను పెంచుతూ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు తగ్గి నీటి నిల్వలు అడుగంటుతున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సాగునీటి రంగం తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు.

మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతలకు భూసేకరణ పనులు

మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పను లు చేపట్టామని త్వరలోనే రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బిసి సంక్షేమ శాఖమంత్రి వాకాటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపి మల్లురవి, రైతుకమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు, యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సురేందర్ మోహన్, వికారాబాద్, నారాయణపేట్ జిల్లా కలెక్టరుల దీపక్‌తివారి, ప్రియంక, ఎస్‌పి స్నేహమెహ్రా, గ్రంథలయ చైర్మెన్ రాజేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రశంత్ జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచులు తదితరులు పాల్గోన్నారు.

కొరత తలెత్తొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదస్సుకు హాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులను సైతం ఆహ్వానించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. సదస్సు ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావం, నీటి కొరత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మార్చి నుంచి మే వరకు తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, కరువు ప్రభావిత వర్గాలకు సహాయం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా పునరుత్పాదక ఇంధనం, వాయు కాలుష్య నియంత్రణ, జల సంరక్షణ, హరిత సాంకేతికతలు, వ్యర్థాల నిర్వహణ, సుస్థిర మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చ జరగనుందని, భూగర్భజలాల పునర్భరణ, సూక్ష్మ సేద్యం, నేల సంరక్షణ, అటవీ విస్తరణ వంటి విజయవంతమైన నమూనాలను ప్రదర్శించన్నట్లు వివరించారు. అంతేకాకుండావాతావరణ మార్పుల ప్రభావాన్ని నేరుగా ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలు, అవసరాలను తెలుసుకునేందుకు ఈ నెల 28న క్షేత్రస్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించనున్నాని, సుమారు 100 మంది ప్రతినిధులు ఇందులో పాల్గొనున్నారని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సులో కేవలం చర్చలకే పరిమితం కాకుండా, తెలంగాణకు ఉపయోగపడే ఆచరణాత్మక నిర్ణయాలు, అంతర్జాతీయ పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రపంచ ప్రముఖులకు ఆహ్వానాలు:

గ్లోబల్ క్లైమేట్ సమ్మిట్‌కు రాజేంద్రసింగ్, సునీతా నారాయణ్, సద్గురు, నార్వే మాజీ పర్యావరణ మంత్రి ఎరిక్ సోల్హైమ్‌తో పాటు సినీనటి దియా మీర్జాను ఆహ్వానించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. కేంద్ర మంత్రులు, పర్యావరణ రంగ ప్రముఖులు, నార్వే, డెన్మార్క్, స్వీడన్ దేశాల రాయబారులకు కూడా ఆహ్వానాలు పంపనున్నట్లు ఆయన వెల్లడించారు.

జనగణన

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగనుంది. జనగణనలో ఏవైనా వివరాలు నమోదు కాకపోవడం, సవరణలు అవసరమైన సందర్భాల్లో మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు. ఈ దశలో మిగిలిపోయిన వివరాలను నమోదు చేయడంతో పాటు అవసరమైన మార్పులు, సవరణలకు అవకాశం కల్పిస్తారు. 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను జనాభా లెక్కింపునకు ప్రామాణిక తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తేదీని ఆధారంగా చేసుకుని జనాభా గణాంకాలను నమోదు చేయనున్నారు. ఈసారి జనగణనను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో ముందస్తు సన్నాహాలు చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఎలాంటి అంతరాయం లేకుండా జనగణన2027 ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక వసతులు, ఇతర ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురిస్తూ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది.

జెలుకే...

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా పౌరసరఫరాల అధికారులను సంప్రదిస్తే నేరుగా మిల్లర్ల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. 25 కిలోల బస్తాలపై 26 కిలోల స్టిక్కర్లు వేయడం, అసలు ఎంఆర్‌పి కప్పిపెట్టి అధిక ధరల స్టిక్కర్లు అంటించడం వంటి మోసాలపై తనిఖీలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. బిపిటి, కెఎన్ఎం కిలో రూ.66 , ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా కిలో రూ.74, హెచ్ఎంటి, జెఎస్ఆర్ కిలో రూ.79లను నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయించిన ధరలకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిత్యావసరాల మార్కెట్‌లో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ఆపై క్రమబద్ధీకరణ

(మొదటి పేజీ తరువాయి)

అక్రమించుకున్న వారికి ఎందుకు చేయరన్న ప్రశ్నకు వారు ఆ స్థలంలోఉన్నట్లు దరఖాస్తు చేస్తే జిఒ నెం. 59 ద్వారా క్రమబద్ధీకరిస్తామని అధికారులు చెబుతున్నారు. మీరు మరుసటి రోజే వారి గుడిసెలు పీకేస్తున్నారుగా అంటే అది మాకు సంబంధం లేదంటున్నారు. ఖమ్మం నగరంలో కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని తొలగించి ప్రత్యామ్నాయం పేరుతో ఊరిబయటకు పంపారు. అవే కాలువలను అక్రమించుకున్న వారికి జిఒ నెం. 59 ద్వారా క్రమబద్ధీకరించారు. ఇప్పుడు ఆ భూమి విలువ గజం రూ. 50వేల నుంచి లక్ష రూపాయల వరకు ధర పలుకుతుండటం గమనార్హం. పేదలను తొలగించిన తర్వాత ఆ భూములకు సరైన రక్షణ కల్పించకపోవడంతో పెద్దలు దర్జాగా అక్రమించి ఇప్పుడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. గుడిసెలు తొలగించిన తర్వాత భూములు అక్రమించిన వారిపై ఫిర్యాదులు చేస్తే ఏకంగా ఒక మంత్రి రంగంలో దిగి ఆ వైపుకు వెళ్లవద్దు కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయంటూ హుకుం జారీ చేశారు. పాలకులు ఎవరైనా రాష్ట్రం అప్పుల్లో ఉండంతో ఆదాయం కోసం, సంపన్నుల మెప్పు కోసం చట్టాలను తీసుకు వస్తున్నారు. బిఆర్ఎస్ పాలనలో వచ్చిన జిఒ నెం. 59ని ఇప్పుడు ప్రభుత్వం ఆదాయం కోసం వాడుకుంటుంది. అక్రమణదారులను హక్కుదారులుగా చేస్తుంది. ఖమ్మం వెలుగుమట్ల ఘటనకు సంబంధించి ఏమి జరిగిందో అందరికీ తెలిసిందే. యుద్ధ వాతావరణాన్ని తలపించే రీతిలో కొంత సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేశారు. పేదల విషయంలో క్రమబద్ధీకరణ ఆలోచన ఈ ప్రభుత్వానికి రాలేదు. గిల్లి జోలపాడినట్లు ఇప్పుడు ఇండ్లు కట్టించి ఇస్తారట. ఇప్పుడు కట్టించే ఇండ్ల లబ్ధిదారుల్లో సంపన్నులు, అనర్హులు ఉన్నారన్న ఆరోపణలను ఈ ప్రభుత్వం కొట్టిపారేస్తుంది. మొత్తంగా వీలైనంత త్వరగా ఈ ఆక్రమణదారులకు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఒక ఖమ్మం జిల్లాలోనే 12 బృందాలను ఏర్పాటు చేశారు. 500 గజాల లోపు అక్రమించుకున్న వారికి పరిశీలన చేసి హక్కులు కల్పిస్తామని అధికారులు తెలియజేశారు. మండలాల వారీగా జిఒ నెం. 59 ద్వారా క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల వివరాలు

కొణిజర్ల 84, సింగరేణి 03, కామేపల్లి 08, వైరా 193, బోనకల్ 02, చింతకాని 151, ముదిగొండ 82, నేలకొండపల్లి 07, మధిర 206, ఎర్రుపాలెం 12, కల్లూరు 213, పెనుబల్లి 216, తల్లాడ 39, తిరుమలాయపాలెం 79, వేంసూరు 266, సత్తుపల్లి 1662, ఖమ్మం అర్బన్ 1255, ఖమ్మం రూరల్ 270 కూసుమంచి 445, రఘునాథపాలెం 212

కాలుష్య మేఘం

(మొదటి పేజీ తరువాయి)

దీపావళి సందర్భంగా గ్రీన్ క్రాకర్స్‌ను అనుమతించారు. గడచిన ఐదేళ్ళలో లేనివిధంగా గాలిలో కాలుష్య కారకాల ఇండెక్స్ 371గా నమోదు చేసింది. దీపావళికి తోడు అనేక చోట్ల రైతులు కూడా వ్యవసాయ వ్యర్థాలను దగ్ధం చేసిన మంటలు దర్శనం ఇచ్చాయి. ఐతే వీటిపై భారీగా జరిమానాలు వసూలు చేస్తున్నారు. ఈ జరిమానాల వసూళ్ళు కూడా భారీగా వేలసంఖ్యలో నమోదయ్యాయి. **పిఐటి** సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం పది గంటల సమయానికి రాజధానిలో మొత్తంగా చూసినప్పుడు గాలి కాలుష్య సూచీ (ఎక్యూఐ) 371గా నమోదైంది. 2021లో దీపావళి మరునాటి గణాంకాల కంటే ఇది చాలా ఎక్కువ. నగరంలో గాలి కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన మొత్తం 51 కేంద్రాలకుగాను 14 కేంద్రాలలో డేటా ''సివియర్ కేటగిరీ''ని చూపించాయి. నాలుగు కేంద్రాలు ''పూర్'' కేటగిరీని నమోదు చేయగా, మిగిలిన 33 కేంద్రాలు ''వెరీ పూర్'' కేటగిరీని నమోదు చేశాయి. సోమవారం ఉదయం ఎనిమిది గంటల సమయానికి ఎక్యూఐ 370 గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం దీపావళిరోజున ఎక్యూఐ అత్యధికంగా 376 గా నమోదు కాగా, 2021 నుండి పండుగనాడు ఈ స్థాయికి దగ్గరగా నమోదు కావడం ఇదే. ఐతేళ్ళక్రితం ఇంతకంటే ఎక్కువగా గాలి కాలుష్యం రీడింగ్ 382గా నమోదైంది. ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో ఢిల్లీలో కాలుష్యం దుర్భరస్థితికి చేరుకుంటోంది. ఈ ఏడాది నవంబరు ఎనిమిదో తేదీన, గత ఏడాది (2025) అక్టోబరు 20వ తేదీన, 2024 అక్టోబరు 31వ తేదీన, 2023 నవంబరు 12వ తేదీ,2022 అక్టోబరు 24వ తేదీన, 2021 నవంబరు 4వ తేదీన ఢిల్లీలో దీపావళి సందర్భంగా దుర్భర పరిస్థితులు నెలకున్నాయి.గత ఏడాది దీపావళినాడు గాలి నాణ్యత సూచి 345,2024లో 328, 2023లో 218, 2022లో 312, 2021లో 382, ఈ ఏడాది ఎక్యూ 376గా రికార్డయ్యాయి. నగరం నిద్రలేవగానే కాలుష్య మేఘం దర్శనమిచ్చింది. ఎదురుగా ఉండే వస్తువులు కనిపించనిస్థాయికి పరిస్థితులు చేరుకున్నాయి. సఫ్దర్‌గంజ్‌లో కాలుష్య నమోదు కేంద్రం ఉదయం 6.30 గంటల నాటికి కాలుష్య మేఘం వల్ల 50 పాయింట్లు దిగజారిపోయింది. అంతకు ముందురోజు పాలం విమానాశ్రయం వద్ద రీడింగ్‌తో పోల్చిచూస్తే 700 తగ్గింది. కంటిచూపు రీడింగ్ కూడా 400 మీటర్లు తగ్గింది.అంతకుముందురోజు దృష్టికోణం రీడింగ్ 800గా ఉండేది.సోమవారం ఉదయం ఎనిమిది గంటల నాటికి సఫ్దర్‌గంజ్ కేంద్రం వద్ద రీడింగ్ ప్రకారం 100 మీటర్లు దృష్టికోణం పుంజుకుంది. పాలెంలో కేంద్రం ప్రకారం దృష్టికోణం రీడింగ్ 600కాగా, తర్వాత వరుసగా ఈ రీడింగ్‌లు 500, 900కు పెరిగాయి. బవన, బురారీ, జహంగీర్‌పూర్, సోనియా విహార్, పంజాబీ బాగ్, ఓఖ్లా, రోహిణి వంటి చోట్ల గాలి కాలుష్యం తీవ్రస్థాయిలో నమోదైంది.కాలుష్యంస్థాయి ఆదివారం రాత్రి పరాకాష్ఠకు చేరుకుంది. బాణసంచా కాల్చడంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, అనేకచోట్ల భారీగా బాణసంచా కాల్చారు. జిల్లా మెజిస్ట్రేట్ ఉత్తర్వు ప్రకారం,నవంబరు 7,8తేదీలలో సాయంత్రం 6 గంటల నుండి 7 గంటలు,8 గంటల నుండి 10 గంటల వరకూ బాణసంచా కాల్చడానికి అనుమతులున్నాయి. కానీ ఆ సమయాన్ని మించి బాణసంచా కాల్చారు

మూడో వన్డేకు భారత జట్టు ప్రకటన



న్యూజిలాండ్ పర్యటనలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. హామిల్టన్ వేదికగా మంగళవారం జరిగే మూడో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే ఇది కూడా గెలిచి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంచుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. అయితే తొలి రెండు వన్డేల తరహాలోనే ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. తొలి రెండు వన్డేల్లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన ఫలితాలను తేల్చారు. మూడో వన్డేలో కూడా డిఎల్‌ఎస్ పద్ధతి ద్వారానే ఫలితం తేల్చే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి.

ఆనలుగురికి నిరాశే... మూడో వన్డేలోనూ టీమిండియా తమ విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించే అవకాశం ఉంది. నలుగురు యువ పేసర్లు అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబర్చడంతో మూడో వన్డేలోనూ వారినే కొనసాగించనున్నారు. ఈ మ్యాచ్ తర్వాత టెస్ట్ టీమ్ ఆటగాళ్లు చివరి రెండు వన్డేలకు దూరం కానున్నారు. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. దాంతోనే విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించనున్నారు. దాంతో మహమ్మద్ సిరాజ్, ఇషాన్‌కిషన్, కుల్దీప్ యాదవ్, రుతురాజ్ గైక్వాడ్‌లకు నిరాశే ఎదురవ్వనుంది. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఆడనున్నారు. తొలి వన్డేలో పర్వాలేదనిపించిన గిల్.. రెండో వన్డేలో డకౌటయ్యాడు. మూడో వన్డే లో భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిన బాధ్యత అతనిపై ఉంది. తొలి వన్డేలో విఫలమైనా.. రెండో వన్డేలో ప్రతికూలమైన బ్యాటింగ్ పరిస్థితుల్లో రోహిత్‌శర్మ భారీషాట్స్ ఆడాడు. కానీ భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. అతను తనస్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది.

అదే జోరు కొనసాగిస్తే... విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి వన్డేలో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసిన కోహ్లీ.. రెండో వన్డేలో నిరాశపర్చాడు. మూడో వన్డేలో అతను చెలరేగితే భారత్‌కు తిరుగుండదు. రెండో వన్డేలో అయ్యర్ కీలక భాగస్వామ్యం నమోదు చేసినా.. స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ అయితే ఆడలేదు. అక్షర్ పటేల్, నమన్ ధీర్ స్పిన్ ఆల్‌రౌండర్లుగా బరిలోకి దిగనున్నారు. పేసర్లకు తోడుగా ఈ ఇద్దరూ అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లో సత్తా చాటితే భారత్ విజయం ఈజీ అవుతుంది. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీలతో కూడిన పేస్ విభాగం సూపర్ ఫామ్‌లో ఉంది. తొలి రెండు వన్డేలలో ఈ నలుగురు న్యూజిలాండ్ పతనాన్ని శాసించారు. అదే జోరు కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు.

దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళా క్రికెట్ జట్టు

డిసెంబర్ 9న టూర్ షురూ..!



భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు సిద్ధమైంది. పర్యటనలో భాగంగా ఆతిథ్య జట్టుతో భారత్ ఒకటెస్టు, మూడు వన్డేలు, మూడు టి–20లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం బిసిసిఐ జట్లను ప్రకటించింది. మూడు ఫార్మాట్లలోనూ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. డిసెంబర్ 9న గెబెర్హాలో ప్రారంభంకానున్న ఏకైకటెస్టుమ్యాచ్‌తో టూర్ మొదలవుతుంది.

టెస్టు జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ సత్ఘరే.

వన్డే జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ.

టి–20 జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి కమలిని (వికెట్ కీపర్), అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలీ.

యువతరంగం

నైపుణ్యాత ఒక్కటే సరిపోదు!



మేనేజర్ అంటే ఒక విభాగంలో నిపుణుడు, తన కింద పనిచేసే బృందాన్ని నిర్వహించే వ్యక్తి అనే పాత నిర్వచనం క్రమంగా కరిగిపోతోంది. ఇప్పుడు సంస్థలు కోరుకునే మేనేజర్‌కు ఒక విభాగంపై లోతైన పరిజ్ఞానం ఉండటం అవసరమే. కానీ దానితో ఆగిపోవడం సరిపోవడం లేదు. అతను ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి, మార్కెట్‌ను చదవాలి, సాంకేతిక పరిణామాలను అంచనా వేయాలి, ఇతర విభాగాలతో కలిసి పని చేయాలి, అంతర్జాతీయ పరిణామాలను గమనించాలి, చివరకు వ్యాపార ఫలితాలపై నిర్ణయం తీసుకోగలగాలి. భారతదేశంలో ఈమార్పు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఎందుకంటే భారతీయ కార్పొరేట్ రంగం గత రెండు దశాబ్దాలలో అపూర్వమైన విస్తరణను చూసింది. ఐటి, బ్యాంకింగ్, ఫిన్‌టెక్, ఫార్మా, ఆటోమొబైల్, టెలికాం, రిటైల్, ఇ–కామర్స్, మానుఫ్యాక్చరింగ్, గ్లోబల్ సర్వీసెస్ వంటి రంగాల్లో భారతీయ సంస్థలు ప్రపంచ మార్కెట్లతో మరింతగా అనుసంధానమయ్యాయి. ఒకప్పుడు ఒక ఉద్యోగి తన సంస్థలోని ఒక నిర్దిష్ట పనిని సమర్థంగా నిర్వహిస్తే కెరీర్ ఎదుగుదలకు అది చాలేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఉత్పత్తి రంగంలో ఉన్న ఒక మేనేజర్ తప్పనిసరిగా మార్కెటింగ్‌ను కూడా అర్థం చేసుకోవాలి. మార్కెటింగ్ అధికారి డేటా విశ్లేషణను అర్థం చేసుకోవాలి. ఫైనాన్స్ అధికారి సాంకేతిక పెట్టుబడుల ప్రభావాన్ని అంచనా వేయాలి. మానవ వనరుల అధికారి ఎఐ వల్ల పని విధానాల్లో వస్తున్న మార్పులను గ్రహించాలి. సాంకేతిక విభాగం నాయకుడు వినియోగదారుడి అవసరాన్ని, వ్యాపార నమూనాను ఆకళింపు చేసుకోవాలి. ఇది భారతీయ మేనేజ్‌మెంట్ విద్యకు కూడా ఒక కీలక సవాలు. దేశంలో మేనేజ్‌మెంట్ విద్య విస్తరించింది. వేలాది బిజినెస్ స్కూళ్లు, ఎంబిఎ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రశ్న డిగ్రీల సంఖ్య గురించి కాదు. సంస్థలు ఇప్పుడు కోరుతున్న సామర్థ్యాలను ఆ విద్య ఎంతవరకు పెంచుతోంది అన్నదే అసలు ప్రశ్న. ఎఐ ఈ మార్పును వేగవంతం చేస్తోంది. అయితే ఎఐని ఈ కథలో ప్రధాన పాత్రధారిగా చూడటం కొంతతప్పుదారి పట్టించవచ్చు. ఒక సంస్థలో ఎఐ సాధనాన్ని అమలు చేయడం సులభం కావచ్చు. దాని ద్వారా నిజమైన వ్యాపార విలువ సృష్టించడం మాత్రం అంత సులభం కాదు. రాబోయే కాలంలో మేనేజర్ విలువ అతని దగ్గర ఉన్న టెక్నాలజీ సాధనాల సంఖ్యతో నిర్ణయించడం సరికాదు. భారతీయ సంస్థలకు ఇది ప్రత్యేకమైన సవాలు. మన విద్యావ్యవస్థ చాలాకాలంగా పరీక్షలు, సర్టిఫికెట్లు, ప్రత్యేక నైపుణ్యాలు, ఉద్యోగ అర్హతల చుట్టూ తిరిగింది. ఇంజనీర్ ఇంజినీరింగ్‌పై, అకౌంటెంట్ లెక్కలపై, సేల్స్ అధికారి విక్రయాలపై, హెచ్‌ఆర్ అధికారి మానవ వనరులపై దృష్టి పెట్టే విధానం బలంగా ఉంది. ఒక భారతీయ కంపెనీ విదేశీ మార్కెట్‌లోకి వెళ్లాలనుకుంటే, దానికి మార్కెట్ పరిశోధనతో పాటు భౌగోళిక రాజకీయపరిణామాలు, స్థానిక చట్టాలు, కరెన్సీ ప్రమాదాలు, సరఫరా గొలుసు, సంస్కృతి, డిజిటల్ మౌలికవసతులు, వినియోగదారుల ప్రవర్తన వంటి అనేక అంశాలను అర్థం చేసుకోవాలి. భారతదేశంలో పనిచేస్తున్న నిపుణులకు మరో సమస్య ఉంది. ఉద్యోగాన్ని వదిలి రెండు సంవత్సరాల పాటు సంప్రదాయ ఎంబిఎ చేయడం అందరికీ సాధ్యం కాదు. కుటుంబబాధ్యతలు, ఆదాయం కోల్పోయే ప్రమాదం, ఉద్యోగంలో కొనసాగాల్సిన అవసరంవంటి కారణాలతో చాలామంది అనుభవజ్ఞులైన ఉద్యోగులు తమవిద్యను మధ్యలో నే ఆపేస్తారు. ఆన్‌లైన్, మాడ్యులర్, పని చేస్తూనే అభ్యసించే మేనేజ్‌మెంట్ విద్యకు అందుకే ప్రాధాన్యం పెరుగుతోంది. ఇలాంటి నమూనాలు ఎంతవరకు ఉపయోగపడతాయన్నది మాత్రం వాటి బోధనా నాణ్యత, పరిశ్రమతో అనుసంధానం, అధ్యాపకుల సామర్థ్యం, విద్యార్థుల అనుభవం, అంతర్జాతీయ పరిచయం వంటి అంశాల పై ఆధారపడి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ డిగ్రీ ఇవ్వడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పనిచేస్తున్న నిపుణుడు నేర్చుకున్న విషయాన్ని మరుసటి రోజే తన సంస్థలో ఉపయోగించగలిగేలా విద్య ఉండాలి. ఒకసంస్థకు కొత్తమార్కెట్లో ప్రవేశించాలంటే మార్కెటింగ్, ఫైనాన్స్, టెక్నాలజీ, మానవ వనరులు, చట్టపరమైన అంశాలు అన్నీ ఒకేసారి ముందుకు వస్తాయి. మంచి మేనేజర్ తన విభాగపు హద్దులను దాటి సంస్థ మొత్తాన్ని చూడగలగాలి. అయితే అందుకు ప్రతి రంగంలో నిపుణుడిగా మారాల్సిన అవసరం లేదు. ఇక్కడే మేనేజ్‌మెంట్ విద్యలో మార్పు అవసరం కనిపిస్తోంది.

మానవ నిర్ణయ సామర్థ్యం కీలకం



భారతీయ మేనేజర్‌కు డేటాతో పాటు సామాజిక వాస్తవికతను అర్థం చేసుకునే సామర్థ్యం కూడా అవసరం. భారతీయ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్నాయి. విదేశీ కంపెనీలు భారతదేశంలో పనిచేస్తున్నాయి. ఉద్యోగులు అంతర్జాతీయ బృందాలతో కలిసి పనిచేస్తున్నారు. ఒక భారతీయ మేనేజర్ హైదరాబాద్‌లో కూర్చుని అమెరికా, యూరప్, ఆఫ్రికా లేదా ఆసియాలోని సహచరులతో ఒకే ప్రాజెక్టుపై పనిచేయవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో సాంస్కృతిక అవగాహన, అంతర్జాతీయ వ్యాపారజ్ఞానం, భిన్న మార్కెట్లను అర్థం చేసుకునే సామర్థ్యం కూడా మేనేజ్‌మెంట్ నైపుణ్యంలో భాగమవుతోంది. అందువల్ల భవిష్యత్ మేనేజర్‌కు మూడు లక్షణాలు అత్యంత కీలకం. మొదటిది తన రంగంలో బలమైన ప్రావీణ్యం. రెండోది ఇతర రంగాలను అనుసంధానించే సామర్థ్యం. మూడోది సంక్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయం తీసుకునే విచక్షణ. ఈ మూడింటిలో మూడవది ఎఐ యుగంలో మరింత విలువైనదిగా మారుతుంది. భారతీయ మేనేజ్‌మెంట్ విద్య కూడా ఈ మార్పును అంగీకరించాల్సిన సమయం వచ్చింది. డిగ్రీల సంఖ్య పెంచడం కంటే నిర్ణయ సామర్థ్యాన్ని పెంచడం ముఖ్యం. రేపటి కార్యాలయంలో ఉద్యోగిని అతనికి తెలిసిన విషయాల సంఖ్యతో మాత్రమే అంచనా వేయరు. అతనికి తెలియని విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకోగలడు? విభిన్న అభిప్రాయాలను ఎలా కలుపుకోగలడు? డేటాటెక్నాలజీమానవ అనుభవాన్ని ఎలా సమన్వయం చేయగలడు? చివరకు సరైన నిర్ణయానికి ఎంత బాధ్యతగా చేరుకోగలడు? అన్నదే అతని విలువను నిర్ణయిస్తుంది. కాబట్టి ఉద్యోగ ప్రపంచంలో అసలు విప్లవం ఎఐ కావచ్చుగానీ, మేనేజ్‌మెంట్‌లో దాని అసలు ప్రభావం మాత్రం 'మనిషి ఎలా ఆలోచించాలి' అన్న అంచనాలను మార్చడంలోనే కనిపిస్తుంది. భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన పాత్రను పెంచుకోవాలంటే, కొత్త సాంకేతికతలను ఉపయోగించే ఉద్యోగులతో పాటు వాటి అర్థాన్ని గ్రహించి, వాటి పరిమితులను గుర్తించి, సంక్లిష్ట నిర్ణయాలను తీసుకోగల నాయకులను తయారు చేయాలి. అదే భవిష్యత్ మేనేజ్‌మెంట్ విద్యకు అసలైన పరీక్ష.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు
సమాన పనికి సమాన వేతనం

ఎఐటియుసి సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల : ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎఐటియుసి సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గత 28 రోజులుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రెండవ ఎఎన్‌ఎం నిర్వహిస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చే వరకు ఎఐటియుసి అండగా ఉంటుందని స్పష్టంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమస్యలు పరిష్కారం కోసం వారితో చర్చలు జరపాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద భీమా రూ.25 లక్షలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించడంతోపాటు రిటైర్మెంట్ తర్వాత వేతనంలో సగం వేతనం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాజేశ్వరి, పద్మ, మంజుల, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫామ్ నాణ్యతలో
కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం

చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌కు సిపిఐ వినతి



ప్రజాపక్షం/గద్వాల రూరల్ : పాఠశాల, కళాశాల విద్యార్థుల యూనిఫామ్‌ల తయారీలో నిబంధనలను గాలికొదిలేశారని సిపిఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం గద్వాల జిలా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇస్తున్న యూనిఫామ్ దుస్తులు అత్యంత నాసిరకంగా ఉన్నాయన్నారు. రెండుసార్లు ఉతికితే చిరిగిపోయే ఉన్న ఈ బట్టలను పిల్లలు ఎలా వేసుకోవాలని ప్రశ్నించారు. దుస్తుల తయారీలో కాలర్ల వద్ద ఉపయోగించాల్సిన నాణ్యమైన కాన్వాస్ లాంటి ప్రాథమిక మెటీరియల్‌ను కూడా వాడకుండా నాసిరకంగా కుట్టించారన్నారు. విద్యార్థుల శరీర కొలతలు సేకరించకుండానే ఇష్టానుసారంగా దుస్తులను కుట్టించి పంపిణీ చేయడం వల్ల పిల్లలకు అవి సరిపోవడం లేదన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన వస్తువులను, అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుందన్నారు. తక్షణమే నాణ్యమైన, సరైన కొలతలతో కూడిన యూనిఫామ్‌లను విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో విద్యార్థులకు నాసిరకం యూనిఫాంలు తయారు చేసి, పంపిణీకి కారణమైన కాంట్రాక్టర్లపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన నాయకుడు వెంకటేశ్, డివైఎపి నాయకుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై
అండర్ పాస్‌లు నిర్మించాలి



సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: ప్రమాదాల నివారణకు నేషనల్ హైవేపై ఉన్న గ్రామాల వెంట వెంటనే అండర్ పాస్ రోడ్లు నిర్మించాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న కందుకూరు, పెద్ద కందుకూరు, రామాజీపేట, బహుపేట గ్రామాల ప్రజలు నేషనల్ హైవే దాటి రాకపోకలు సాగించాల్సి వస్తోందని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ఇప్పటివరకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయా గ్రామాల ప్రజలు తమ నిత్యం అవసరాల నిమిత్తం ఆలేరు, యాదగిరిగుట్టకు, అలాగే కార్మికులు వివిధ కంపెనీలకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మధ్యలో నేషనల్ హైవే ఉండటమే తరచూ ప్రమాదాలకు కారణమవుతోందని, ఈ గ్రామాల స్టేజీల వద్ద అండర్ పాస్‌లు నిర్మించాలని ఆయన కోరారు. సిపిఐ నాయకుల వినతిపత్రం పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులను వెంటనే అక్కడికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, పేరబోయిన మహేందర్, కల్లేపల్లి మహేందర్, పెరబోయిన బంగారి, గోపగాని రాజు, బోదాను జగన్, కంబాల వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య, అనంతుల నరసింహ, శెట్టి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కోహెన్స్ కంపెనీపై
చర్యలకు నిర్లక్ష్యం తగదు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ : కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించిన కోహెన్స్ ఫార్మా కెమికల్ కంపెనీపై సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి తనిఖీల్లో అనేక లోపాలు గుర్తించిన నేపథ్యంలో కంపెనీని మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడంతోపాటు 48 గంటల్లో విద్యుత్, మున్సిపల్ నీటి సరఫరాను నిలిపివేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చినా, కంపెనీ యాజమాన్యం అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తుందని ఆరోపించారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించకపోతే స్థానిక గిరిజన సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు కంపెనీ పూర్తిస్థాయి మూసివేత జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కంపెనీ కార్యకలాపాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరిగినాసంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని బెజవాడ హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, పేర్ల నాగయ్య, ఎండి గౌస్‌పాషా, కె.వెంకటయ్య, గోగుల వీరబాబు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఎర్ర అఖిల్ కుమార్ పాల్గొన్నారు.



ఎల్ నినో ప్రభావంతో
జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు

సిపిఐ సంగారెడ్డి కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్

ప్రజాపక్షం/సంగారెడ్డి : ఎల్ నినో ప్రభావంతో పంటలు చేజారి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ప్రభుత్వాలు వెంటనే మొద్దునిద్ర వీడి క్షేత్రస్థాయిలో నష్టపోయిన రైతులను గుర్తించి వారిని ఆదుకోవాలని సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం జహిరాబాద్ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నష్టపోయిన ప్రతి రైతన్నను ఆదుకుని తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షాభావం భూగర్భ జలాలు అడుగంటడంతో జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, చేతికొచ్చిన పంటకు నీరందక ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు లేకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వర్షాభావం పరిస్థితులలో కూలీకు ఉపాధి హామీ పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. రైతులకు పశుగ్రాసాన్ని ఉచితంగా అందించాలన్నారు. వర్షాభావ పరిస్థితులతో పనుల తగ్గాయని, దీంతో రైతులు, కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బియ్యంతో పాటు నిత్యావసర వస్తులను ఉచితంగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే పాలకులు స్పందించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోరకు మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ఛలో కలెక్టరేట్ మహాధర్నాకు రైతులు, పార్టీకార్యకర్తలు, నాయకులు, పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జలాలుద్దీన్ పిలుపునిచ్చారు.

కౌలు రైతులను ఆదుకోండి

మడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/తలమడుగు : వర్షాభావం, భూగర్భ జలాలు అడుగంటడంతో ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం స్పందించి జిల్లాలో కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు మడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో వర్షాభావంతో పత్తి, తొగరి పంటలు దెబ్బతిన్నందున వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని ఆయన కోరారు. సోమవారం జిల్లాలోని సుంకిడి, లింగి, కుచులాపూర్, కొత్తూర్ గ్రామాల్లో ఎండిన పంటలను సిపిఐ బృందం పరిశీలించింది. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఐదు ఎకరాల్లోపు రైతులకు ఎకరానికి రూ. లక్ష, ఆపై ఉన్న వారికి రూ.60వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అర్ధాంగి రమేష్, కొడప సురేష్, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో
కరువు మండలాలు ప్రకటించాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్షణమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, అదే విధంగా కరువు మండలాలను గుర్తించి ప్రకటించాలని పంట నష్టపరిహారంతో పాటు సహాయ చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్లపై మంగళవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాకు సంబంధించి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షాభావం భూగర్భ జలాలు అడుగంటడంతో జిల్లాలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. చేతికొచ్చిన పంటలు నీరందక ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు లేకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ఎకరా వరికి రూ.30 వేలు, పత్తి, మిర్చికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకూ పరిహారం ఇవ్వాలని, ఉపాధి హామీ పనులతో పాటు పశుగ్రాసాన్ని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరుపుతున్నారని తెలిపారు. జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఈ పోరాటంలో పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పాటు అన్నదాతలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని సాబీర్‌పాషా పిలుపునిచ్చారు.

ఆర్థిక సంస్థలపై విరుచుకుపడిన సైబర్ నేరగాళ్లు

దేశవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా దోపిడీ?

నెల రోజుల్లో వందకుపైగా ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులను కొల్లగొట్టిన వైనం

లబోదిబోమంటున్న సంస్థలు

హైదరాబాద్‌లో రెండు సంస్థల ఖాతాల నుంచి రూ.14.89 కోట్లు స్వాహా

ఫైనాన్స్ సంస్థలు, బ్యాంక్‌లు పోలీసుల హెచ్చరికలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : వందల కోట్ల రూపాయల కార్పొరేట్ నిధులే సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా మారుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా వందకుపైగా ఫైనాన్స్ సంస్థలు, జాతీయ బ్యాంకుల ఖాతాల నుంచి రూ.500 కోట్లకు పైగా నగదు అక్రమంగా మళ్లించినట్లు వస్తున్న సమాచారం ఆర్థిక రంగంలో కలకలం రేపుతోంది. దీంతో ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. భారీ మొత్తాలను నిర్వహించే సంస్థల బ్యాంకు ఖాతాలను లక్ష్యంగా చేసుకుని, అనేక అక్రమ లావాదేవీల ద్వారా నిధులను వివిధ ఖాతాలకు మళ్లిస్తున్న సైబర్ ముఠాల వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే రెండు ఫైనాన్స్ సంస్థల కార్పొరేట్ ఖాతాల నుంచి రూ.14.89 కోట్లకు పైగా నగదు మాయమవడం ఈ సైబర్ దోపిడీ తీవ్రతకు అద్దం పడుతోంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కీర్తన ఫిన్‌సర్వ్ లిమిటెడ్ సంస్థకు చెందిన కార్పొరేట్ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు భారీ మొత్తాన్ని కొల్లగొట్టారు. నవంబర్ 6న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కేవలం గంట వ్యవధిలోనే 39 అక్రమ లావాదేవీల ద్వారా రూ.7.09 కోట్లను వివిధ ఖాతాలకు మళ్లించారు. సంస్థ డైరెక్టర్ చాగంటి వరప్రసాద్ తరపున శిల్పాజైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ హెడ్‌క్వార్టర్స్‌లో కేసు నమోదైంది. మరోవైపు ప్రముఖ సూక్ష్మ రుణ సంస్థ స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ (ఎస్ఎస్ఎఫ్ఎల్)కు చెందిన హెచ్‌ఎస్‌బిసి కార్పొరేట్ బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. ఈనెల కటిన ఒక్కరోజులోనే 82 అనధికార లావాదేవీల ద్వారా రూ.7,80,60,001ను వివిధ గుర్తుతెలియని ఖాతాలకు బదిలీ చేశారు. ఆదివారం జరిగిన ఈ లావాదేవీలను సంస్థ గుర్తించి బ్యాంకును సంప్రదించింది. అనుమానాస్పద చెల్లింపుల మార్గాలను నిలిపివేయాలని కోరడంతోపాటు, దోపిడీకి గురైన నగదును తిరిగి రాబట్టేందుకు పోలీసుల జోక్యం కోరింది.

ఒకే ముఠా పనా..? రెండు ఘటనల్లోనూ భారీ మొత్తాలను ఒకేసారి కాకుండా అనేక లావాదేవీల ద్వారా వివిధ లబ్ధిదారుల ఖాతాలకు మళ్లించడం గమనార్హం. గంటల వ్యవధిలోనే డజన్ల కొద్దీ లావాదేవీలు జరగడం, కోట్లాది రూపాయలు వేర్వేరు ఖాతాల్లోకి చేరడం వెనుక ఒకే సైబర్ ముఠా ఉందా? లేక వేర్వేరు ముఠాలు ఇదే తరహా వ్యూహంతో దోపిడీలకు పాల్పడుతున్నాయా? అన్నది తేలాల్సి ఉంది. దేశవ్యాప్తంగా వందకుపైగా ఆర్థిక సంస్థలు, జాతీయ బ్యాంకుల నుంచి రూ.500 కోట్లకు పైగా నిధులు మళ్లించినట్లు వస్తున్న సమాచారంతో ఈ కేసుల దర్యాప్తుకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సంస్థల డిజిటల్ చెల్లింపు వ్యవస్థల్లోకి నేరగాళ్లు ఎలా ప్రవేశించారు? బ్యాంకింగ్ అనుమతులను దుర్వినియోగం చేశారా? నిధులు మళ్లించిన ఖాతాల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అన్న ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. సాధారణ ఖాతాదారుల నుంచి నగదు కొల్లగొట్టే సైబర్ మోసాలు ఇప్పుడు కోట్లాది రూపాయల లావాదేవీలు నిర్వహించే కార్పొరేట్ సంస్థలకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. ఒకే రోజు లేదా గంటల వ్యవధిలో ఇంత భారీ మొత్తాలు బదిలీ అవుతున్నా వాటిని ముందుగానే గుర్తించి అడ్డుకోలేకపోవడం బ్యాంకింగ్ వ్యవస్థలో డిజిటల్ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిధులు చేరిన ఖాతాలను తక్షణమే స్తంభింపజేయడం, లావాదేవీల మార్గాలను విశ్లేషించడం, డిజిటల్ ఆధారాలు, ఐపి చిరునామాలను పరిశీలించడం ద్వారా నగదును తిరిగి రాబట్టే అవకాశాలున్నాయి. హైదరాబాద్‌లో వెలుగుచూసిన రెండు ఘటనలతో పాటు దేశవ్యాప్తంగా నమోదవుతున్న ఇలాంటి కేసులపై సమగ్ర దర్యాప్తు జరిగితేనే సైబర్ దోపిడీ వెనుక ఉన్న నెట్‌వర్క్ అసలు స్వరూపం బయటపడే అవకాశం ఉంది.

ఎఐ దాడుల వేళ.. మరింత అప్రమత్తం : సిపి సజ్జనార్

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాతీయ సైబర్ ముఠాలు విరుచుకుపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. పౌరుల ఆర్థిక లావాదేవీలు, సున్నితమైన సమాచారాన్ని (డేటా) నిక్షిప్తం చేసే సంస్థలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ విసి.సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, క్విక్ కామర్స్ వేదికలు, మొబిలిటీ ప్లాట్‌ఫారమ్‌లు తమ సైబర్ రక్షణ వ్యవస్థలతో పాటు నిపుణులైన మానవ వనరులను వెంటనే బలోపేతం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత దాడులతో పాటు విదేశీ హ్యాకర్లు విసురుతున్న సరికొత్త సవాళ్లను తిప్పికొట్టేలా ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చాలా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్స్ కంపెనీ(ఎన్‌ఎఫ్‌బిసి)లు వినియోగదారుల వ్యక్తిగత సమాచారం, చెల్లింపుల నిర్వహణ కోసం థర్డ్ పార్టీ మాధ్యమాలు, ఎపిఐ సేవలపై ఆధారపడుతున్నాయని, ఇలాంటి సహాయక వ్యవస్థలను కూడా ప్రధాన అప్లికేషన్లతో సమానంగా పరిగణించి అత్యున్నత భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎఐ ఏజెంట్ల సాయంతో ఆర్థిక సంస్థల నెట్‌వర్క్‌లలోని లోపాలను సులువుగా గుర్తిస్తున్నారని తెలిపారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో కారుణ్య ఉద్యోగం

రూ.13 లక్షలకు బేరం..

14 మంది అరెస్ట్

మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పాత్రపై పోలీసుల దర్యాప్తు

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్



ప్రజాపక్షం/నల్లగొండ : ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం మరణించినప్పటికీ, విధుల్లో ఉండగానే మరణించినట్లు నకిలీ రికార్డులు సృష్టించి, ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించిన మోసపూరిత వ్యవహారాన్ని నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో మొత్తం 14మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఆధార్ చిరునామా మార్పు.. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం : మృతుడి బంధువులైన చామకూరి రాజశేఖర్, చామకూరి రవీందర్ సమన్వయంతో నల్లగొండలోని మీ సేవా కేంద్ర నిర్వాహకుడు పనస చంద్రశేఖర్ అలియాస్ చందు ద్వారా మృతుడి ఆధార్ కార్డులో చిరునామాను మార్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రక్రియలో మృతుడి మేనల్లుడు, టిజిఎస్పీలో ఉద్యోగిగా పనిచేస్తున్న కట్ల సతీష్‌ను సాక్షిగా సంతకం చేయించడంతో పాటు, కుట్రకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయకుండా మరికొందరితో కూడా దరఖాస్తు పత్రాలపై సంతకాలు చేయించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మున్సిపల్ శాఖలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న శివ జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి, మీసేవా నిర్వాహకుడు చందు తదితరులు నిబంధనలకు విరుద్ధంగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందేందుకు సహకరించినట్లు దర్యాప్తులో గుర్తించారు. డిఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గింకల రాకేష్, జూనియర్ అసిస్టెంట్ తుంగతుర్తి మోహన్ కృష్ణ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మహబూబ్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి జితేందర్ రెడ్డి, సిసి పోలె రంజిత్ కుమార్, శాలిగౌరారం పిహెచ్‌సి సీనియర్ అసిస్టెంట్ కంచర్ల జగన్నాథ రెడ్డి తప్పుడు విచారణ నివేదికలు రూపొందించి సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది.

మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో కేసు నమోదు

నల్లగొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 4న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ కింద కేసు నమోదు చేశారు. తొలుత వన్‌టౌన్ ఎస్ఐ జి.ముత్తయ్య దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో చామకూరి వసంత, చామకూరి రాజు, కంచర్ల జగన్నాథ రెడ్డి, రాచకొండ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ గౌడ్,డాక్టర్ ఆకుల కృష్ణ సూర్య శిల్ప,పనస చంద్రశేఖర్ అలియాస్ చందు, కట్ల సతీష్, ముక్కముయిల శివ జనార్దన్, ఎన్.ప్రదీప్ రెడ్డి,పోలె రంజిత్ కుమార్, నాగిరెడ్డి జితేందర్ రెడ్డి,మహబూబ్ అలీ, గింకల రాకేష్ యాదవ్, తుంగతుర్తి మోహన్ కృష్ణలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.చామకూరి రాజశేఖర్, చామకూరి రవీందర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/గన్నేరువరం: పంట దిగుబడి సరిగా రాక చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో చో టు చేసుకుంది. పోలీస్‌లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, పారువెల్ల గ్రామానికి చెందిన గంగు రాజయ్య (50) తనకున్న మూడెకరాల సొంత భూమితోపాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకొని వరి, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. పంట సాగు పెట్టుబడులతోపాటు ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కొనుగోలు చేయడం కోసం సుమారు రూ.8లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే ఈ ఏడాది వేసిన పంటల్లో సరైన దిగుబడి రాకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 7న రాజయ్య తన పొలం వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య రాజవ్వ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గన్నేరువరం ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

రోజురోజుకూ పెరుగుతున్న ఎఐ ప్రాధాన్యత

ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆధునిక కార్యాలయ పరిపాలనలో కృత్రిమ మేధస్సు (ఎఐ) ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఎఒయు)లోని సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సిఎస్‌టిడి), సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ (సిఒఈఎల్) సంయుక్తంగా విశ్వవిద్యాలయ ఉద్యోగుల కోసం ''కార్యాలయ పరిపాలనలో కృత్రిమ మేధస్సు'' అనే అంశంపైన ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజువారీ పరిపాలనా కార్యకలాపాల్లో సామర్థ్యం, కచ్చితత్వం, ఉత్పాదకతను పెంచుకునేందుకు విశ్వవిద్యాలయ సిబ్బంది ఏఐ ఉపయోగంపై నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని,తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పూర్తిగా ఏఐ పై ఆధారపడకుండా ఏఐ ఇచ్చిన ఔట్ పుట్ ఖచ్చితంగా ఉందా? లేదా ? అనేది ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్. విజయ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిపాలనా ప్రక్రియల్లో సాంకేతికతను, ఏఐ ఆధారిత సాధనాలను వినియోగించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఎస్‌టిడి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శ్రీదేవి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలోని బోధనేతర, సాంకేతిక సిబ్బంది అందరికీ రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ట్రెజరీ విభాగ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ శివ కుమార్ రెడ్డి ప్రత్యేక శిక్షకులుగా హాజరయ్యారు.



రోడ్డెక్కి ధర్నాలు చేసినప్పుడు ముఖ్యమంత్రి ఎక్కడ ఉన్నారు?

బిఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బాబ్లీ ప్రాజెక్టు కోసం తాము రోడ్డెక్కి ధర్నాలు చేసినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డితో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. నాడు కాంగ్రెస్ పాలనలో మోటార్లు కాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడితే అసెంబ్లీ ఎదుట ఆందోళనలు చేశామని, ఎస్ఆర్ఎస్‌పి ద్వారా మహారాష్ట్ర, ఉమ్మడి ఏపి కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు నీళ్లివ్వకపోతే సుప్రీంకోర్టు వరకు పోరాడామన్నారు. కెసిఆర్ హయాంలో ఎక్కడా కరవు పరిస్థితులు లేవని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రానికి కరవు వచ్చిందన్నారు. పాలకుర్తిని ఎందుకు కరవు మండలాల జాబితాలో చేర్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ, కన్నెపల్లి వద్ద 20వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నప్పటికీ నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చని ఎన్‌డిఎస్ఎ నివేదిక ఇచ్చినప్పటికీ కెసిఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ప్రభుత్వం నీటిని ఎత్తకుండా వదిలేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుత కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆరోపించారు.

రూ.2లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన కీసర ఎస్ఐ

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : రూ.2లక్షలు లంచం తీసుకొంటూ కీసర సబ్ ఇన్‌స్పెక్టర్ ఎసిబి అధికారులకు చిక్కాడు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ భూసంబంధిత మోసం కేసుతో పాటు వరకట్న వేధింపుల కేసుల్లో నిందితుడిగా ఉన్న బాధితుడిని లంచంగా రెండు లక్షల రూపాయలిస్తేనే సంబంధిత చార్జిషీట్ దాఖలు చేస్తానంటూ ఎస్ఐ డిమాండ్ చేశాడు. ఈమేరకు బాధితుడిచ్చిన లిఖిత పూర్వక ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు సోమవారం కీసరలోని శిల్పా లేఔట్ సమీపంలో రూ.2లక్షలు తీసుకొంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. లంచంగా తీసుకొన్న సొమ్ము స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ ప్రభుత్వపాలన : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనగా మారిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. కోస్గిలో మృతి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కొడంగల్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పరిగి బహార్‌పేట చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేయడం ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరికి నిదర్శనమని కెటిఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన పేరుతో వచ్చిన ప్రభుత్వం, తమ హక్కులను కాలరాస్తూ గొంతు నొక్కుతోందని, ఇలాంటి కక్షసాధింపు చర్యలకు బిఆర్ఎస్ ఎప్పుడూ భయపడబోదన్నారు.

తమ్మిడికుంట చెరువు ప్రారంభానికి సిద్ధం

ఈనెల 11న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లోని శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఈనెల 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయనున్నారు. హైడ్రా తొలి విడతలో పునరుద్ధరించిన ఆరు చెరువుల్లో తమ్మిడికుంట ఒకటి. ఇప్పటికే బమ్‌రుకున్ ఉద్ దౌలా చెరువు, బతుకమ్మకుంట, నల్లచెరువులను ముఖ్యమంత్రి ప్రారంభించగా, తాజాగా తమ్మిడికుంట ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు కూడా ప్రారంభం కానున్నాయి. ఒకప్పుడు ఆక్రమణలు, మురుగునీరు, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లిన తమ్మిడికుంట చెరువు ప్రస్తుతం సరికొత్త రూపును సంతరించుకుంది.

కబ్జాల చెర నుంచి పూర్వస్థితికి..

దాదాపు 30 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ఆక్రమణల కారణంగా 14 ఎకరాలకు పరిమితమైంది. అయితే ఎన్ కన్వెన్షన్‌తో పాటు ఇతర ఆక్రమణలను తొలగించడంతో మరో 16 ఎకరాల భూమి తిరిగి చెరువులో కలిసింది. దీంతో చెరువు తన అసలు విస్తీర్ణాన్ని తిరిగి పొందింది. 2024 ఆగస్టు 24న చెరువు భూమిలో ఆక్రమణగా గుర్తించిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా కూల్చివేయడం పునరుద్ధరణలో కీలక మలుపుగా నిలిచింది. అనంతరం ఇతర ఆక్రమణలను కూడా తొలగించి, చెరువు భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. చెరువులో పేరుకుపోయిన పూడిక, మట్టి, నిర్మాణ వ్యర్థాలు, ప్లాస్టిక్ చెత్తను భారీ స్థాయిలో తొలగించారు. దాదాపు 15 అడుగుల లోతు వరకు పూడికతీత చేపట్టడంతో వర్షపు నీరు భూగర్భ జలాల్లోకి ఇంకే సామర్థ్యం పెరిగింది. గతంలో హాస్టళ్లు, కాలనీల నుంచి మురుగునీరు నేరుగా చెరువులోకి చేరి మురికి కూపంగా మారిన పరిస్థితిని హైడ్రా మార్చింది. 1,200 మిల్లీమీటర్ల వ్యాసం గల పైపులైన్ ద్వారా మురుగునీటిని మళ్లించే పనులు పూర్తి చేసింది. అలాగే భవిష్యత్తులో మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దీంతో చెరువుతో పాటు మూసీ నదిలోకి చేరే కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. వర్షపు నీరు చెరువులోకి సక్రమంగా చేరేందుకు మూడు ఇన్‌లెట్‌లను పునర్ నిర్మించి, ఒక ఔట్‌లెట్‌ను పునరుద్ధరించారు. పరివాహక ప్రాంత డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరచడంతో కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువులోకి చేరుతోంది. గతంలో శిల్పారామం పరిసరాల్లో ఏర్పడే ముంపు సమస్యకు దీంతో శాశ్వత పరిష్కారం లభించింది.

ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తమ్మిడికుంట చెరువు

చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు రూ.20కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ 1.25 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, మొక్కల పెంపకం, బెంచీలు, రెండు గెజిబోలు, యోగా వేదిక, రోజ్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్, శాశ్వత ప్రహరీ, రెండు ప్రవేశ ద్వారాలతో పాటు క్రీడా సదుపాయాలు కూడా కల్పించారు. మాదాపూర్ వంటి అత్యంత విలువైన ప్రాంతంలో దాదాపు 15 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి రక్షించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రశంసలు వ్యక్తం అయ్యాయి. రూ.1,200 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించి పర్యావరణానికి అంకితం చేయడం నగర అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలిచింది.

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్‌పై కెటిఆర్‌ది రాజకీయ డ్రామా

శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుల ముందస్తు చర్యలు

టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్ ధ్వజం

ప్రజాపక్షం/హైదరాబాద్ : చట్టబద్ధంగా పోలీసులు తీసుకున్న చర్యలకు రాజకీయ రంగు పులిమి ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ యత్నిస్తున్నారని టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి, టిజిఎల్‌డిఎ చైర్మన్ డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్ విమర్శించారు. పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్షసాధింపు కాదని, ప్రాంతీయ శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు చట్ట ప్రకారం తీసుకున్న ముందస్తు చర్య మాత్రమేనని సోమవారం ఓ ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే అయినా, ప్రజాప్రతినిధి అయినా చట్టానికి ఎవరూ అతీతులు కారని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు చెలరేగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. విషాద సంఘటనలు, అంత్యక్రియలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని బిఆర్ఎస్ నేతలు యత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాల గొంతు నొక్కి, ధర్నా చౌక్‌ను ఎత్తివేసి, హౌస్ అరెస్టులను పరిపాటిగా మార్చిన చరిత్ర ఆ పార్టీదేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను కాపాడుతూ, శాంతియుత వాతావరణంలో ప్రజాపాలన అందిస్తోందని చరణ్ కౌశిక్ యాదవ్ పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష ఉపనాయకత్వం ఇవ్వాలి

బినోయ్ విశ్వం పునరుద్ఘాటన

తిరువనంతపురం : కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనాయకుడి పదవిని తమకే ఇవ్వాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పునరుద్ఘాటించింది. కేరళం అసెంబ్లీలో వామపక్ష ప్రజాప్రజాస్వామ్య సంఘటన ఉమ్మడి నాయకత్వాన్ని బలోపేతం చేయడంకోసమే సిపిఐ ఉపనాయకుడి పదవి ఇవ్వాలని కోరుతోందని ఆ రాష్ట్ర పార్టీ కార్యదర్శి బినోయ్ విశ్వం సోమవారం చెప్పారు. ఈ పదవి ఇవ్వడం ద్వారా అసెంబ్లీలో వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన ఉమ్మడి నాయకత్వం మరింతగా బలపడుతుందని, ప్రజల సమస్యలు సభలో ప్రస్తావించి వాటి పరిష్కారాలకోసం పోరాటం చేయడానికి, సభ లోపలా, సభ వెలుపలా కూడా ప్రజావాణి వినిపించడానికి ఈ ఏర్పాటు ఉండాలని బినోయ్ విశ్వం పునరుద్ఘాటించారు. ఈ డిమాండ్‌ను ఒక రాజకీయస్థానంలో పరిశీలించాలి తప్ప, వామపక్ష ప్రజాస్వామ్య సంఘటనలో విభేదాలు సృష్టించే కోణంలో చూడకూడదన్నారు. ఎల్‌డిఎఫ్‌లో కొన్ని సమస్యలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, భాగస్వామ్య పార్టీలు వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. ఎల్‌డిఎఫ్ ఏకపక్షంగా వ్యవహరించకూడదని, భాగస్వామ్య పార్టీలు చర్చల ద్వారా పరిష్కారాలతో ముందుకు వెళ్ళాలన్నారు. వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన పనివిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది, ఉమ్మడి వైఖరికి కొత్త అర్థాన్ని ఇవ్వాలి,ఉమ్మడి నాయకత్వాన్ని బలోపేతం చేయాలి అని చెప్పారు. ''సిపిఐకి ప్రతిపక్ష ఉపనాయకత్వం పదవి ఇస్తే ఎల్‌డిఎఫ్ మరింతగా బలపడుతుంది, ప్రజల పక్షాల పోరాటం ఉద్ధృతం చేసే సామర్థ్యం పెరుగుతుంది, ఎల్‌డిఎఫ్ పనితీరు మెరుగుపడాలి, ప్రజలకోసం పోరాటం అంటే ఉమ్మడి కృషి, ఇందులో భాగంగానే మేం ప్రతిపక్ష ఉపనాయకత్వ పదవిని అడుగుతున్నామని చెప్పారు. ఎల్‌డిఎఫ్ మొత్తంగా అనేక రాజకీయ సవాళ్ళను ఎదుర్కొంటున్నదని,దానిని పటిష్టపరచాల్సిన అవసరం ఉందని,రాష్ట్రంలో పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని,బిజెపి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా,యుడిఎఫ్ ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని బినోయ్‌విశ్వం చెప్పారు.సిపిఐ తన వైఖరికి కట్టుబడి ఉంటుందని,వామపక్ష సంఘటనను బలోపేతం చేసేదిశగా కృషి చేస్తుందని చెప్పారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలను ఆయన ప్రస్తావిస్తూ,సభలో ప్రజల సమస్యలను ప్రస్తావించే విషయంలో సిపిఐ ఎటువంటి రాజీపడబోదని,యుడిఎఫ్ విధానాలను బట్టబయలుచేస్తామని అన్నారు. ఎల్‌డిఎఫ్‌లో ఉన్న భిన్నాభిప్రాయాలు ఎప్పుడూ ప్రజల సమస్యలు లేదా,ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను బలహీనపరచబోవని అన్నారు. కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్‌కు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అవినీతి పేరుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ప్రయోగించడాన్ని ప్రస్తావిస్తూ,కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎప్పటికీ రాజకీయ ఆయుధాలుగా మారకూడదని అన్నారు. సిపిఐ ఎప్పటికీ ఇడిని ఒక రాజకీయ ఆయుధంగా ఉండకూడదనే చెబుతోందన్నారు. విజయన్‌ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని ఇడిని ప్రయోగించారని, ఇడిని ఆయనపై గురిపెట్టారని, ఈ నిరసన ప్రదర్శనల్లో సిపిఐ భాగంగా చేరుతుందని చెప్పారు. భూమి, విద్యుత్ సేకరణ,మద్యం వంటి విషయాలకు సంబంధించి యుడిఎఫ్ అనుసరిస్తున్న విధానాల ద్వారా రాష్ట్రంలో అవినీతిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు.ఈ విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాలు తన స్వప్రయోజనాలకోసం ఉపయోగించుకునేట్టుగా ఉన్నాయన్నారు. క్వారీయింగ్ నిబంధనల్లో మార్పులను ప్రభుత్వం ప్రతిపాదించిందని, సరళ్ పేరుతో నియంతరణ లేకుండా వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి భూ అన్వేషణకు, సహజ వనరుల అన్వేషణకు అనుమతించే ప్రయత్నం చేస్తోందన్నారు.

'ప్రశస్త్' అవగాహనకు అత్యంత ప్రాధాన్యత

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో వైకల్యాన్ని ముందస్తుగా గుర్తించేందుకు 'ప్రశస్త్' అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆదేశించారు. సుప్రీం కోర్టు ఆదేశాలకనుగుణంగా 3 నుంచి 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రవేశపెట్టిందని, రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ప్రశస్త్ పోర్టల్‌లో తప్పనిసరిగా ఆన్‌బోర్డింగ్ పూర్తిచేసుకోవాలని సూచించారు. యూడైస్ ప్లస్ రికార్డుల ప్రకారం పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరూ నిర్దేశిత అవగాహన కార్యక్రమాన్ని పూర్తిచేసేలా చూడాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా బోధనేతర సిబ్బందికి కూడా దీనిపై అవగాహన కల్పించాలన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లోని అర్హులైన విద్యార్థులందరికీ ప్రశస్త్ స్క్రీనింగ్ నిర్వహించాలని, ఈ ప్రక్రియ అమలులో నిర్లక్ష్యం వహించినా, విఫలమైనా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలే పూర్తి బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

వివాదాలు సృష్టించి అభివృద్ధికి అడ్డుకట్ట

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం
- కరీంనగర్‌లో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తున్నాం
- బిఆర్ఎస్ పాలనలో కేంద్రం నిధులిచ్చినా కెసిఆర్ పట్టించుకోలేదు : కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రజాపక్షం/కరీంనగర్ :కరీంనగర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే తపనతో అహర్నిశలు కష్టపడుతుంటే... కొంత మంది తమ కాళ్లలో కట్టెలు పెట్టి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు, స్థానిక నేతలతో కలిసి కరీంనగర్‌లో సోమవారం పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రాంనగర్ డివిజన్‌లో రూ.1.5 కోట్ల వ్యయంతో రూపొందించిన బాక్స్ టైప్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధిలో భాగంగా కేంద్రం అనేక పనులకు నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో ఆనిధులన్నీ మురిగిపోయి అభివృద్ధి ఆగిపోయిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలంలో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించలేకపోయిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమృత్ స్కీం కింద రూ.17 కోట్లు, యుసిఎఫ్ స్కీంలో భాగంగా రూ.80 కోట్ల నిధులతో పనులు మొదలు పెడుతున్నామని చెప్పారు. అందులో భాగంగా రూ.17 కోట్లతో టెండర్ పనులను ప్రారంభిస్తే... లేనిపోని వివాదాలు సృష్టించి అడ్డుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రజలతో పాటు అభివృద్ధిని కాంక్షించే వాళ్లంతా వాస్తవాలు గ్రహించాలన్నారు. అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కళ్లు. గతంలో జరిగిన పరిస్థితికి, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలన్నారు. కేంద్రం నుండి నిధులు తేవడంతో పాటు మ్యాచింగ్ గ్రాంట్ మంజూరుతో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో సహకరిస్తోందన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం అమృత్ స్కీం కింద రూ.17 కోట్లతో పనులకు టెండర్ పనులు స్టార్ట్ అయ్యాయని, యుసిఎఫ్ కింద మరో రూ.80 కోట్లతో ఈ సమస్యను పరిష్కరించబోతున్నామన్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రాసెస్ మొదలైన క్రమంలో ఈ అంశాన్ని వివాదస్పదం చేసి ఆ పనులను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు పదేపదే కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. పని చేసే వాళ్ల కాళ్లల్లో కట్టెలు పెడుతూ ఇబ్బంది పెడుతున్నాయని, వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు పని చేయరు. ఇప్పుడు చేస్తుంటే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.అలాంటి వాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండి బుద్ధి చెప్పాలని, టెండర్ పనుల విషయంలో నిబంధనల ప్రకారం అధికారులు వ్యవహరించాలన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని, కరీంనగర్ అభివృద్ధి చేయాలని తపనతో పనిచేస్తున్నామని, కరీంనగర్ కార్పొరేషన్ లోని గల్లీగల్లీలో ఇంటర్నల్ రోడ్లను ఏడాదిలో పూర్తి చేయాలని నిర్ణయించామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



నూతన గృహ మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు తండా గ్రామపంచాయలో, వెంకటాద్రిపాలెం గ్రామంలో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించి, లబ్ధిదారు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే దీపావళి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాలను జరుపుకొని, వారికి ప్రత్యేకంగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు



ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే బీర్ల

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాచిళ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి వేడుకలలో భాగంగా లబ్దిదారుడు ఉపేంద్ర ఇంట్లో దీపావళి వేడుకలను నిర్వహించి టపాసులు కాల్చి లబ్దిదారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హుడికి లబ్దిచేకూరుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుతుందని ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, సీనియర్‌నాయకులు వెంకన్న, రాంరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే ఫిర్యాదుల దినం లక్ష్యమని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ఫిర్యాదుల దినం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు కేంద్రాల పరిధుల నుంచి వచ్చిన 22 మంది బాధితులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జిల్లా పోలీసు అధిక్షకుడికి అందజేశారు.ఈ సందర్భంగా ప్రతి బాధితుడి ఫిర్యాదును ఆయన స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసం, ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పురాతన కట్టడాలు పరిరక్షించాలని వినతి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో పురాతన కట్టడాలను మరమ్మతు చేయుటకు అనుమతులు, నిధులు కేటాయించాలని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం అందజేశారు. పురాతన కట్టడాలు మన చరిత్రకు సంస్కృతికి ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించేలా పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన పురాతన కట్టడాలు కాలక్రమేన శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి అభివృద్ధి, మరమ్మత్తుల పునరుద్ధరణకు అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు స్థానిక ప్రజలకు వాటిని సంరక్షించుకునే అవకాశం కల్పించాలని కోరారు. పురావస్తు శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత స్టడీ మెటీరియల్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ మరియు కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులు,నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి టి. విజేందర్ రెడ్డి తెలిపారు.తెలంగాణ పోలీసు నియామక మండలి పోలీసు కానిస్టేబుల్, ఎస్సై మరియు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1, 2, 3, 4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతోఈనెల 12లోపు దరఖాస్తులను మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కోరారు.

కోహెన్స్ లైఫ్‌సైన్సెస్ ఎదుట తండావాసుల ఆందోళన

పరిశ్రమను పూర్తిగా మూసివేయాలంటూ డిమాండ్



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని దాసాయి గూడెం సమీపంలోని వస్రాం తండ 65వ జాతీయ రహదారిపై ఉన్న కోహెన్స్ (సువెన్) లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఎదుట సోమవారం ఆ ప్రాంత గిరిజన వాసులు ఆందోళన చేశారు. పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులతోపాటు ఇటీవల వరుస ప్రమాదాలతో కార్మికులు మృతి చెందారు. దీనితో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదులు పెద్దఎత్తున అందాయి. స్పందించిన అధికారులు మూసివేయాలని ఆదేశిస్తూ ఈనెల 5వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విష యం అందరికి తెలిసిందే. పరిశ్రమకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివే యాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో అధికారులు మరుసటి రోజు నిలిపివేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పరిశ్రమ యాజమాన్యం మాత్రం సోలార్ విద్యుత్, జనరేటర్ సహాయంతో పరిశ్రమను నడుపుతుండడంతో విషయం తెలుసుకున్న తండావాసులు పరిశ్రమను పూర్తిస్థాయిలో మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. వీరికి స్థానిక 5, 6, 18వ వార్డుల కౌన్సిలర్లు విజయ చక్రునాయక్, సునీల్ రెడ్డి, డాక్టర్ రామ్మూర్తి యాదవ్‌లు మద్దతు తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కోహెన్స్ (సువెన్) ఫార్మా పరిశ్రమను పూర్తిగా మూసివేయాలన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మూసివేయాలని ఉత్తర్వులు ఇస్తూ చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. తక్షణమే మూసివేయాలని లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమలోకి ప్రవేశించి తనిఖీలు నిర్వహించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ రామచంద్రారెడ్డి



ప్రజాపక్షం/ రామగిరి : సిఎంపిఎఫ్ కమిషనర్ మంగళవారం అర్జీ3ఏరియాకు వచ్చిన సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్సిరెడ్డి ఎపిఎ జిఎం. నాగేశ్వరావు ద్వారా అర్జీ 3 ఎపిఎఉద్యోగులు, పెన్షనర్లు వితంతువులు, ఎదుర్కొంటున్నసమస్యలపై వినతి పత్రం అందజేశారు 1.వితంతు పెన్షన్స్ కేసులు పరిష్కారంలో ఆలస్యం జరుగుచున్నవి దీనివల్ల మృతుల కు టుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు 2. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధి ంచిన సిఎం ఇ ఎఫ్ బ్యాలెన్స్ స్లిప్లను జారీ చే యాలని అలాగే వెబ్ సైడ్ సిఎం పిఎఫ్ బ్యాలె న్సులు అవకతవకలు లేకుండా చూడాలని 3. చిన్న చిన్న కారణాలతో సిఎం పి ఎఫ్ అడ్వా న్సు లోన్ దరఖాస్తులను తిరిగి పంపించడం దీ నివల్ల ఉద్యోగులకు అనవసరమైన ఇబ్బందులు జాప్యాలు ఎదుర్కొంటున్నారు.4.మాజీ ఉద్యోగులు జీవించి ఉన్న పెన్షన్ లబ్ధిదారులకు సంబంధించిన సవరించిన పెన్షన్ చె ల్లింపులు ఉత్తర్వు(పిపిఒ)లు సుమారు 800 కేసులు ఇంకాపెండింగ్‌లో ఉన్నాయి. ఆలస్యం జరుగుతూ ఉండటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిఎంపిఎఫ్ లైవ్‌లో పరిష్కారంలో విపరీతమైన ఆలస్యం జరుగుతున్నది. ముఖ్యంగా తుది ప్రయోజనాల కోసం ఎ దురుచూస్తున్న ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. సిఎం పిఎఫ్ క్లైమ్‌లను ఇతర సం బంధిత సేవలను సకాలంలో ప్రాసెస్ చేసి పరిష్కరించేలా సంబంధిత సేవలను సకాలంలో అ ధికారులకు ఆదేశాలు జారీ చేయాలని అర్జీ3 ఎఐయుటిసి బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్ర రెడ్డి వినతి పత్రం అందజేశాడు కార్యక్రమంలో ఎస్ ఒటు జిఎం రామ్మోహన్ పాల్గొన్నారు.


రోడ్డెక్కిన సన్నధాన్యం రైతులు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రైస్ మిల్లర్లు సన్నధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లి పరిధిలోని కోదాడ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. పట్టణ శివారులోని మిల్లులకు ధాన్యం విక్రయించేందుకు రైతులు ట్రాక్టర్లలో రాగా మిల్లర్లు క్వింటా ధాన్యం ధరను అమాంతం తగ్గించేశారు. గత 25 రోజులుగా రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు కొనుగోలు చేసిన సన్నధాన్యాన్ని రూ.2,900 నుంచి రూ.3,200 వరకు మాత్రమే కొనుగోలు చేయడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. యాద్గార్‌పల్లి వద్ద కోదాడ రహదారిపై ధాన్యం లోడు ట్రాక్టర్లను అడ్డంగా నిలిపి రాకపోకలను అడ్డుకున్నారు. ఒకవైపు ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ఎకరానికి 5 నుంచి 10 సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు తెలిపారు. బోరు బావులు, ఊట బావుల కింద కష్టపడి ఆరుతడి పద్ధతిలో పంటలు పండిస్తే తీరా అమ్మకానికి వచ్చాక మిల్లర్లు సిండికేట్‌గా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధర క్వింటాకు రూ.8,500 పైగా ఉంటే, రైతులకు మాత్రం క్వింటా ధాన్యానికి రూ.5 వేలకు పైగా చెల్లించాల్సి ఉందన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ అక్కడికి చేరుకుని నాణ్యమైన ధాన్యానికి క్వింటాకు రూ.3,500 చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

అధిక ఉష్ణోగ్రతల సంవత్సరాల జాబితాలోకి 2026

- వచ్చేఏడాది సముద్రం నుండి మరింత వేడిగాలులు
- పేదరికం,వలసలు పెరిగే ప్రమాదం
- యూరప్‌లో 30వేల అదనపు మరణాలు
- భారత్‌లో 14.65 కోట్లమంది ఉష్ణ బాధితులు
- కాప్–31 సదస్సులో డబ్ల్యుఎంఓ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ:అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదైన నాలుగు సంవత్సరాల జాబితాలోకి 2026వ సంవత్సరం కూడా చేరనున్నది.ఈ ఏడాది డిసెంబరు నాటికి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యుఎంఓ) శుక్రవారం కాప్–31 సదస్సులో విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. యూరప్‌లో వేడిగాలులు పెరుగుతాయని, కరువు,వన్యప్రాణులకు ప్రమాదం వస్తుందని,30,000 అదనపు మరణాలు సంభవిస్తాయని నివేదిక ముందస్తు అంచనా వేసింది.భారతదేశంలో 2026 ఏప్రిల్‌లో 14.65 కోట్ల మంది ప్రజలు వేడిగాలుల బారిన పడ్డారని నివేదిక పేర్కొంది. 2023 నుండి వరుసగా ప్రతి సంవత్సరం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఐతే 2026వ సంవత్సరం మాత్రం 2024 నాటి కంటే కొంచెం తక్కువ ఉష్ణోగ్రతలనే నమోదు చేస్తుందని ఈ నివేదిక తెలిజేసింది.ఈజిప్టులోని అంటాల్యా నగరంలోనవంబరు తొమ్మిదో తేదీ నుండి 20వ తేదీ వరకూ జరుగుతున్న ప్రపంచ వాతావరణ సదస్సు ఈ నివేదికపై చర్చించింది.డబ్ల్యుఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సాలో ఒక ప్రకటన చేస్తూ,''గడచిన నాలుగు సంవత్సరాలు 177 సంవత్సరాల చరిత్రలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు చేశాయని చెప్పారు.సముద్రాలలో వేడి గడచిన పది సంవత్సరాలుగా వరుగా పెరుగుతూ వస్తోందని చెప్పారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినోకు అత్యంత బలమైన రికార్డు ఉందని,ఆగస్టు నుండి ప్రారంభమై ఈ ఎల్‌నినో డిసెంబరు నాటికి బలపడుతుందని,దీనివల్ల క్రమంగా ఉష్ణోగ్రతలు 2027 చివరి నాటికి పెరుగుతాయని ఆమె చెప్పారు.ప్రస్తుతం ఎల్‌నినో ముందస్తు హెచ్చరికలు కొనసాగుతున్నాయని,ఇది వచ్చేనెల నాటికి బలపడుతుందని చెపారు.సముద్రం నుండి వేడి విడుదల అవుతోందని,ఈ విడుదల అత్యంత బలంగా ఉంటుందని చెప్పారు.భూమి ఉష్ణోగ్రతలో అసమతౌల్యం కారణంగా భూతాపం పెరుగుతోందని,భూగోళవ్యవస్థలో ఉష్ణం పేరుకుపోతోందని,ఈ నిష్పత్తి వేగం పెరిగిందని వేడిగాలుల పెరుగుదలకు ఇదే కీలకమైన కారణమని నివేదిక పేర్కొన్నట్లు ఆమె చెప్పారు.సూర్యుడి నుండి భూమిపైకి ప్రసరిస్తున్న ఉష్ణోగ్రతకు,భూమిలోంచి బయటకు ప్రసరిస్తున్న శక్తికి మధ్య అసమతుల్యత వచ్చిందని,దీనివల్ల ఉష్ణబంధనం పెరిగిందని,వేడి పేరుకుపోయిందని నివేదిక పేర్కొంది.వాతావరణాన్ని శాస్త్రవేత్తలు పర్యవేక్షించడం ప్రారంభించినప్పటినుండీ పరిశీలిస్తే,భూమిపై జీవుల ఆవాసానికి వీలుగా సూర్యుడి నుండి వచ్చే ఉష్ణోగ్రతను సమతుల్యంచేసే గ్రీన్‌హౌస్ వాయువులు(నీటి ఆవిరి, కార్బండయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఓజోన్) లేదా హరితగృహ వాయువుల పరిమాణం విపరీతంగా పెరిగిపోవడంవల్ల భూతాపం పెరుగుతోందని నివేదిక పేర్కొంది.ఈ హరితగృహ వాయువులలో కార్బండైయాక్సైడ్ పరిమాణం వాతావరణంలో అనూహ్యస్థాయిలో పేరుకుపోతోందని, 1750వ సంవత్సరంలో ఒక మిలియన్‌కు 278 భాగాలు వంతున ఉన్న కార్బండైయాక్సైడ్ 2025 సంవత్సరంనాటికి 426.8 భాగాలవంతున 53 శాతానికి పెరిగిందని నివేదిక పేర్కొంది.అదేవిధంగా మీథేన్ కూడా 1750లో సగటున ఒక బిలియన్‌కు 729 భాగాలు (పిపిబి)ఉండగా, 2025 సంవత్సరం నాటికి 1,948 పిపిబిలు వంతున167 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. అంతకుమించి సముద్రం కూడా 90 శాతం అదనపు వేడిని తనలో ఇముడ్చుకుంటోందని, 2026 నాటికి వరుసగా పదో సంవత్సరంలో కూడా రికార్డుస్థాయిలో సముద్రం వేడెక్కుతుందని డబ్ల్యుఎంఓ నివేదిక వెల్లడించింది.కాగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఒక ప్రకటనలో,''మనం వాతావరణ మార్పుల కొత్త యుగంలోకి ప్రవేశించాం, దిగ్భ్రాంతి కలిగించే ఎల్‌నినో భూగ్రహాన్ని ఢీకొట్టింది, భూగ్రహం ఇప్పటికే దీని బారినపడింది,భూగ్రహం ఇప్పటికే వాతావరణ మార్పులవల్ల వేడెక్కింది,మానవులు మూల్యం చెల్లించుకోవడం పెరిగింది,ఈ సమస్యకు ఎటువంటి బాధ్యతాలేని కట్టకడపటి జీవులు మొదటిగా దీని బారిన పడుతున్నాయి, దుర్భరస్థితిని ఎదుర్కొంటున్నాయి, నాయకులు అనివార్యంగా దీనిని తీవ్రంగా పరిగణించాలి.

దక్షిణ తీర రైల్వే
విశాఖపట్నం
Follow us on X @SCoRailway
వెబ్‌సైట్: www.scor.indianrailways.gov.in
PUB/SCoR-479

టెండర్ నెం.GTL-EM-63-2026-27
తేది: 04.11.2026

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ మెయింటెనెన్స్/ గుంతకల్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం.: GTL-EM-63-26-27 **పని పేరు:** గుంతకల్ డివిజన్-1. విద్యుత్ సంస్థాపనలలో పవర్ క్వాలిటీ రిస్టోరర్ ఏర్పాటు మరియు IGEA సిఫార్సులకు మెరుగుదలలు (ఫేజ్-II). **సుమారు విలువ (రూ.):** 2,17,60,119.20/-

ముగింపు తేదీ మరియు సమయం: 25-11-2026, మధ్యాహ్నం 3:00 గంటలకు

టెండర్‌లో బిడ్డింగ్ చేయడానికి మరియు ఇతర వివరాల కోసం, http://www.ireps.gov.in లోకి లాగిన్ అవ్వండి. టెండర్‌కు ఏవైనా సవరణలు ఉంటే, అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.
గమనిక: ఈ ఇ-టెండర్‌లో పాల్గొనడానికి/ బిడ్ చేయడానికి, టెండరర్‌కు చెల్లుబాటు అయ్యే DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) ఉండాలి.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (M), గుంతకల్

ఇ-టెండర్ నోటీసు నెం. 32-2026
తేది: 06/11/2026

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఇంజనీర్/ కోఆర్డినేషన్/ గుంతకల్, కింది పనుల కోసం ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.
ముగింపు తేదీ & సమయం: 02/12/2026, మధ్యాహ్నం 3:00 గంటలకు

క్ర.నం.: 01 **టెండర్ నెం.:** Engg-GTL-West-2171 **పని వివరణ:** DMM-PAK సెక్షన్: DEN/West అధికార పరిధిలోని SSE/P/MPL సెక్షన్‌లో 1180M పొడవున Toe వాల్ నిర్మాణ ప్రతిపాదన. **ప్రకటిత విలువ (రూ.):** 1,87,79,279.93 పైసలు **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.):** 3,75,600.00 పైసలు

క్ర.నం.: 02 **టెండర్ నెం.:** Engg-GTL-West-2172 **పని వివరణ :** గుంతకల్ డివిజన్: DMM-GY సెక్షన్: ADEN/ATP-ఉప-విభాగంలో వంతెన మరమ్మతులు మరియు వంతెన రక్షణ పనులు. (2026-2027). **ప్రకటిత విలువ (రూ.):** 95,23,922.14 పైసలు **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.):** 1,90,500.00 పైసలు

క్ర.నం.: 03 **టెండర్ నెం.:** Engg-GTL-West-2173 **పని వివరణ:** గుంతకల్ డివిజన్-SW(I) TPTY స్టేషన్ వద్ద PF డ్రెయిన్ గోడలు, ఫ్లోరింగ్ & PF డ్రెయిన్ గ్రిల్స్ & ప్రీ కాస్ట్ స్లాబ్‌లకు మరమ్మతులు. SW(II) TPTY స్టేషన్ వద్ద వాష్‌అవుట్ పంప్ హౌస్, మెయిన్ మరియు మినీ వాష్‌అవుట్లకు మరమ్మతులు, వాష్ అవుట్ బావిని శుభ్రపరచడం, మూసుకుపోయిన ETP పైప్‌లైన్‌ను సరిచేయడం. **ప్రకటిత విలువ (రూ.):** 1,50,19,479.39 పైసలు. **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.):** 3,00,400.00 పైసలు.

క్ర.నం.: 04 **టెండర్ నెం.:** Engg-GTL-West-2174 **పని వివరణ:** గుంతకల్ డివిజన్- గుంతకల్ డివిజన్‌లోని అనంతపురం, ధోన్ మరియు ధర్మవరం స్టేషన్‌లలో కొత్త పార్సెల్ కార్యాలయాల నిర్మాణం. **ప్రకటిత విలువ (రూ.):** 5,63,89,428.63 పైసలు. **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.):** 11,27,800.00 పైసలు.

బిడ్ పత్రాలు మరియు ఇతర వివరాల కోసం https://www.ireps.gov.in లోకి లాగిన్ అవ్వండి. ఏవైనా సవరణలు ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.
డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్/గుంతకల్

ఇ-టెండర్ నోటీస్ నెం. B/E.EGS/ 12/2026-27 తేది: 05/11/2026

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి పేరు మీద, ఈ క్రింద సంతకం చేసిన నేను, ఈ క్రింద పేర్కొన్న తేదీన 15-00 గంటల వరకు, ఈ క్రింది పనుల కొరకు ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నాను:

క్ర.నం.: 01 **టెండర్ నెం.:** B/E.29/1/ EGS/32/26-27 తేది:05/11/2026 **పని పేరు:** విజయవాడ డివిజన్ 1) GDR- BZA సెక్షన్: DEN//central/BZA అధికార పరిధిలోని ADEN/ BPP ఉప-విభాగంలోని SSE/ Works/TEL సెక్షన్‌లలోని TEL స్టేషన్ వద్ద PF 1 లో జనరల్ వెయిటింగ్ హాల్ భవనం మరియు PF 2&3 మరియు 4&5 లలో యుటిలిటీ కేబుల్ డక్ట్‌ల ఏర్పాటు; 2) BZA-VSKP సెక్షన్:- ADEN/ EE ఉప-విభాగంలోని SSE/Works/ EE సెక్షన్‌లో ఉన్న ఏలూరు స్టేషన్‌లో SW-I ఎలక్ట్రికల్ ఆఫీస్, పార్సెల్ ఆఫీస్, హెల్త్ యూనిట్, RPF barracks, SSE/Works ఆఫీస్ నిర్మాణం మరియు ఇప్పటికే ఉన్న స్టేషన్ భవన గదుల పునరుద్ధరణ. SW-II ఏలూరు స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు గల FOB నిర్మాణం; 3) BZA-GDR సెక్షన్:- DEN/ Central/BZA అధికార పరిధిలోని ADEN/ BPP ఉప-విభాగంలోని SSE/Works/BPP సెక్షన్‌లో ఉన్న CLX స్టేషన్‌లో PF 1, 2&3, 4&5 లలో దివ్యాంగజన టాయిలెట్ల ఏర్పాటు మరియు ఇప్పటికే ఉన్న సౌకర్యాల మెరుగుదల; 4) BZA- GDR విభాగం:- DEN/Central/BZA ఎలక్ట్రికల్ ఏర్పాట్ల అధికార పరిధిలోని ADEN/BPP ఉప-విభాగంలో ఉన్న SSE/Works/BPP విభాగంలోని BPP స్టేషన్‌లో PF 2&3 పై దివ్యాంగజన టాయిలెట్లు మరియు జనరల్ వెయిటింగ్ హాల్ భవన నిర్మాణం మరియు ఇప్పటికే ఉన్న సౌకర్యాల మెరుగుదల. **టెండర్ విలువ (రూ):** 2,83,07,147.00/- **E.M.D. / బిడ్ సెక్యూరిటీ (రూ):** 5,66,200.00/- **టెండర్ పత్రం ఖర్చు (రూ):** ఏమీ లేదు **పూర్తి చేసే కాలపరిమితి:** 6 నెలలు **చివరి తేదీ:** 27/11/2026

1) పని పూర్తి పేరు, పైన పేర్కొన్న పనుల సారూప్య స్వభావం, అర్హత ప్రమాణాలు మొదలైన టెండర్ షరతులు / ఇతర వివరాలు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్‌లలో పాల్గొనబోయే వారు, టెండర్ల గడువు ముగిసే తేదీ లోపు, ఏవైనా టెండర్లకు సంబంధించిన మార్పులు / సవరణలను గమనించడానికి "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ
SCoR-A536

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి https://www.ireps.gov.in లేదా www.scor.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
10-11-2026
www.prajapaksham.in

మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

రీల్

నాగదుర్గ సూపర్ డాన్స్



బన్నీ వాస్ , స్విఫ్ట్ డైరెక్షన్ వంశీరెడ్డి దొండపాటి

బన్నీ వాస్ పర్‌ఫెక్ట్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న వరల్డ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ రోజు దీపావళి పండుగ సందర్భంగా ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ 'ఇడుపు కాయితం' సినిమా నుంచి 'బారాత్ బీట్..' సాంగ్ రిలీజ్ చేశారు. శ్రీలత (నాగదుర్గ), శ్రీనివాస్ (ప్రియదర్శి) పెళ్లి బారాత్ సందర్భంగా వచ్చే డ్యాన్స్ నెంబర్‌గా ఈ సాంగ్‌ను రూపొందించారు. ఈ పాటలో నాగదుర్గ మాస్ డ్యాన్స్ స్టెప్స్ హైలైట్‌గా నిలుస్తున్నాయి. థియేటర్స్‌లో ఈ పాటకు ఆడియెన్స్ స్టెప్స్ వేయబోతున్నారు. ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాత: బన్నీ వాస్ , స్విఫ్ట్ డైరెక్షన్ వంశీరెడ్డి దొండపాటి

కొడవలి పట్టిన 'కాకా'



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. వర్షంతో తడిసిన వాతావరణంలో, పచ్చని పొలాల మధ్య చేతిలో కొడవలి పట్టుకుని ఇంటెన్స్‌గా నిలబడిన చిరంజీవి లుక్ ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ సినిమా రా అండ్ ఇంటెన్స్ ప్రజెంట్ చేస్తోంది. చిరంజీవి ఫియర్స్ అవతార్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ సందర్భంగా 'కాకా' చిత్రాన్ని 2027 జనవరి 13న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో వచ్చే సంక్రాంతి బరిలో 'కాకా' మేజర్ ఎట్రాక్షన్ గా నిలవనుంది.ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేదా థామస్‌తో పాటు బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పనిచేస్తోంది. ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఆంటోనీ ఎల్. రూబెన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషనల్ రైటర్స్‌గా పనిచేస్తున్నారు. భానుసందు డైలాగ్స్ అందిస్తున్నారు.



'ధర్మన్'లో రామ్ పోతినేని

రజనీకాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్ర 'ధర్మన్'లోకి మరో క్రేజీ హీరో చేరారు. ఈ చిత్రంలో ప్రముఖ తెలుగు హీరో రామ్ పోతినేని నటిస్తున్నారు. డైనమిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఆకట్టుకునే నటన, ప్రత్యేకమైన ఎనర్జీతో రామ్ పోతినేని తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 'దేవదాస్'తో గుర్తుండిపోయే అరంగేట్రం చేసిన ఆయన, 'రెడీ', 'కందిరీగ', 'ఇస్మార్ట్ శంకర్' వంటి పలు విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. వరుస విజయాలతో ప్రేక్షకులని అలరిస్తున్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్, రామ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన క్షణం ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకుంటుంది. విమానంలో ప్రయాణికులకు ముందున్న ప్రయాణంలో టర్బులెన్స్ ఉండబోతోందని ప్రకటన రావడంతో ఈ గ్లింప్స్ ప్రారంభమవుతుంది. 'ధర్మన్' చిత్రంతో రామ్ పోతినేని కెరీర్‌లో మరో కీలకమైన మైలురాయిని అందుకోబోతున్నారు. ఈ సినిమాతో ఆయన తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. అంతేకాదు, తొలిసారి లెజెండరీ రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అన్బరివ్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ప్రతిష్టాత్మక రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నయనతార, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

13న 'దాదా ధమాకా' సాంగ్ రిలీజ్



నందమూరి బాలకృష్ణ తన మోస్ట్ అవేటేడ్ మాస్ ఎంటర్‌టైనర్ 'దాదా'తో ఈ పండగ సీజన్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ కావడంతో ఈ హై వోల్టేజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఓ ప్రత్యేక ప్రకటనతో పాటు కలర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణతో పాటు బాలీవుడ్ నటి నర్గిస్ ఫక్రీ అలరించారు. ఈ పోస్టర్ ద్వారానే సినిమా ఫస్ట్ సింగిల్ టైటిల్‌ను 'దాదా ధమాకా'గా ప్రకటించారు. ఈ పాటను నవంబర్ 13న విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం సినిమాకు పనిచేస్తోంది. అరవింద్ ఎస్. కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు రాశారు. రామ్‌లక్ష్మణ్, రవివర్మ, వి. వెంకట్ యాక్షన్ సీక్వెన్స్‌లను కంపోజ్ చేస్తున్నారు. 'దాదా' చిత్రం డిసెంబర్ 24న థియేటర్లలో విడుదల కానుంది. నవంబర్ 13న విడుదల కానుంది.

'కింగ్ 100'లో కర్ణగా అశోక్ సెల్వన్



నాగార్జున అక్కినేని కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 100వ ప్రాజెక్ట్ 'కింగ్ 100', అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో పాత్ర ను పరిచయం చేయడంపై అంచనాలు పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి అశోక్ సెల్వన్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కర్ణగా ఆయనలోని వైల్డ్‌నెస్‌ను ప్రజె ంట్ చేస్తూ ఈ పోస్టర్‌ను ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ విడుదలైన వెంటనే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పూర్తి ఇంటెన్స్ అవతార్‌లో అశోక్ సెల్వన్ అదిరిపోయారు. స్టైలిష్ మెరూన్ షర్ట్, పొడవాటి జుట్టు, ఒత్తైన గడ్డంతో కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్న ఆయన లుక్‌లో అటిట్యూడ కనిపిస్తోంది. అశోక్ సెల్వన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనను మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్‌లో పరిచయం చేశారు. ఈ పాత్ర కోసం ఆయనలో వచ్చిన ట్రాన్స్‌ఫర్మేషన్ 'కింగ్ 100'కు మరో ఆసక్తికరమైన కోణాన్ని జోడించింది. ఈ ఫస్ట్ లుక్‌తో కర్ణ పాత్ర ఎలా ఉండబోతోంది? కథలో ఆయన పాత్ర ఎలాంటి ప్రభావం చూపించనుంది? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, రాజా మహదేవన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా, సతీష్ కుమార్ ఎన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

'ఆర్ ఎక్స్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



దర్శకుడు లోకేష్ కనగరాజ్ జీ స్క్వార్డ్, మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి 'ఆర్ ఎక్స్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు.రెజీనా కసాండ్రా, నాజర్, రమేష్ తిలక్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దీపావళి సందర్భంగా విడుదల చేశారు. వివిధ భాషల్లో తన నిర్మాణ సంస్థ పరిధిని విస్తరిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్, తమిళ చిత్రసీమలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ అగ్లీ', 'మొద రాత్రి ' వంటి చిత్రాలతో తమిళంలోనూ అలరించింది. 'ఆర్ ఎక్స్' ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రెజీనా కసాండ్రా ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 'ట్రూత్ ఆల్వేస్ డిమాండ్స్ ఎ వాయిస్!' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ మిస్టరీ, ఉత్కంఠను పెంచుతోంది. హరిహరన్ రాజు అందించిన కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆశమీర అయ్యప్పన్ సంభాషణలు రాశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, ఎస్.కె. సెల్వకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటర్‌గా, కె. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

బెంగాల్‌లో మరో ఎన్‌కౌంటర్!

పోలీస్ కాల్పుల్లో హత్యాచార నిందితుడి హతం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మరో పోలీసు ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్న దిలీప్ రాయ్ పోలీసుల కాల్పుల్లో మతి చెందాడు. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా రాయ్‌గంజ్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నమోదైన ఎన్‌కౌంటర్ల సంఖ్య నాలుగుకు చేరింది. గౌరీ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ప్రాంతంలో దిలీప్ రాయ్ దాక్కున్నట్లు సోమవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాత్రి 3.30 గంటల సమయంలో ప్రత్యేక బందం అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టింది. ఈ క్రమంలో తనను పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపై దిలీప్ రాయ్ కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు ఎదురుకాల్పులు జరపడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రాయ్‌గంజ్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. కులిక్ నది సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం ఓ బాలిక మతదేహం లభ్యమైంది. కుళ్లిపోయిన స్థితిలో, దుస్తులు లేకుండా ఉన్న మతదేహాన్ని గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికపై అత్యాచారం చేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న దిలీప్ రాయ్ కోసం పోలీసులు నాలుగు రోజులుగా గాలిస్తున్నారు. బిహార్ సరిహద్దు మీదుగా రాష్ట్రం నుంచి పారిపోయేందుకు అతడు ప్రయత్నిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

వీడని ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

దారితీసింది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు సంబంధించి రాజ్యాంగ సవరణను చేపట్టేందుకు ప్రభుత్వం ఇలా చేయవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదిత సవరణ ద్వారా, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ చేపట్టి, లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి గరిష్టంగా 850కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత సమావేశాల పరిధిలోనే పార్లమెంటును తిరిగి సమావేశపరచడానికి కనీసం రెండు రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది; అదే కొత్త సమావేశాలను ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో, బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో, రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మద్దతును పొందలేక విఫలమైంది. కాబట్టి, దీంతో ప్రస్తుత పరిస్థితికి మరింత ప్రాముఖ్యత ఏర్పడింది. ఒక సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత, దానికి ఎంత కాలంలోపు అధికారికంగా ముగింపు (ప్రొరోగ్) ప్రకటించాలో రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. ఒక సభ సుదీర్ఘకాలం పాటు ముగింపు ప్రకటించబడకుండా ఉన్నంత మాత్రాన, అది రాజ్యాంగపరంగా లేదా విధానపరంగా తప్పు అని అర్థం కాదు. రికార్డుల ప్రకారం, గతంలో పార్లమెంటు సమావేశాలు ముగింపు ప్రకటించబడకుండా ఇలాగే కొనసాగిన సందర్భాలు ఉన్నాయి: 2008లో 87 రోజులు, 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లలో 49 రోజుల చొప్పున, అలాగే 1963లో 41 రోజుల పాటు ఇలాగే కొనసాగాయి. 2008లో, అప్పటి యుపిఎ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు లోక్‌సభ జూలై 21, 22 తేదీలలో సమావేశమైంది. తదనంతరం సభను వాయిదా వేయకుండా, అక్టోబర్ 17న తిరిగి సమావేశపరిచి, డిసెంబర్ 10న మళ్లీ సమావేశమయ్యేందుకు అక్టోబర్ 24న వాయిదా వేశారు.

బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్‌కు హసీనా దరఖాస్తు

వచ్చేనెల స్వదేశం వెళ్ళేందుకు సన్నాహాలు



ఢాకా: పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా ఆ దేశానికి వెళ్ళేందుకు కొత్త పాస్‌పోర్టుకోసం, జాతీయ గుర్తింపు కార్డుకోసం దాఖలు చేసుకున్నారు. బంగ్లాదేశ్‌లోని అమె సొంతపార్టీ అవామీలీగ్ సోమవారం ఈ విషయం ధృవీకరించింది. ఐతే ఆమె చర్య రాజకీయ ప్రచారంకోసమేనని,స్వదేశానికి వచ్చే ఉద్దేశం ఆమెకు లేదని బంగ్లాదేశ్ ప్రభుత్వం తోసిపుచ్చింది. 2024 ఆగస్టునెలలో విద్యార్థుల తిరుగుబాటు తర్వాత భారతదేశంలో తలదాచుకుంటున్న షేక్ హసీనా డిసెంబరులో స్వదేశం వెళతారని నవంబరు ఐదో తేదీన ప్రకటించారు. అందుకు అనుగుణంగానే సన్నాహాలు వేగం పుంజుకున్నాయని అవామీలీగ్ చేసిన ప్రకటన తెలియజేసింది. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న మాట్రిక్స్ ఛాంబర్స్‌లో షేక్ హసీనాకున్న న్యాయ ప్రతినిధి న్యూఢిల్లీలో ఉన్న బంగ్లాదేశ్ హై కమిషన్‌కు కొత్త పాస్‌పోర్టు జారీ చేయాల్సిందిగా ఒక విజ్ఞప్తి చేశారు. అమెకు ఉన్న పాస్‌పోర్టును, ఇతర గుర్తింపు కార్డులను మహ్మద్ యూనుస్ నాయకత్వానగల తాత్కాలిక ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికలకు ముందే రద్దుచేసింది. దీంతో ఆమె కొత్త పాస్‌పోర్టుకు దరఖాస్తు చేశారు. తన జాతీయత దృష్ట్యా, అంతర్జాతీయ మానవహక్కులకు అనుగుణంగా తనకు కొత్త పాస్‌పోర్టు ఇవ్వాలని ఆమె తన దరఖాస్తులో కోరారు. ఐతే, భారతదేశంలో ప్రవాస జీవితం ముగించి వచ్చేనెలలో స్వదేశం వెళతానని షేక్ హసీనా గడచిన గురువారం అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.''ఉరిశిక్షను లెక్కచేయను,నా నిర్ణయంలో మార్పు లేదు,స్వదేశం చేరుకుంటాను'' అని ఉద్ఘాటించారు.''నేను స్వదేశం చేరుకోగానే నన్ను అరెస్టు చేస్తారు, నన్ను జైలులో ఉంచుతారు, హింసిస్తారు, చివరకు చంపను కూడా చంపుతారు, నాకు పూర్తిగా ఈ విషయాలన్నీ తెలుసు, ఈ పరిణామాలన్నీ జరిగే అవకాశాలున్నాయి, కానీ నా దేశంలో నా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు, వారి కష్టాలకు దూరంగా నా అంతిమ జీవితాన్ని గడపలేను''అని చెప్పారు. రక్షణ కల్పించాలని బంగ్లాదేశ్‌పై అమెరికా, భారత్‌ల ద్వారా ఒత్తిడి చేయించలేకపోయారా? అని ప్రశ్నించగా, విదేశీ జోక్యాన్ని తాను కోరుకోవడంలేదని సమాధానం చెప్పారు. అన్ని దేశాల మైత్రిని, సహకారాన్ని తాను కోరుకుంటున్నానని, అదే ఎప్పటికీ బంగ్లాదేశ్ విదేశాంగ విధానంగా ఉంటుందని చెప్పారు. బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రిబ్యునల్ న్యాయస్థానం ఆమెకు ఉరిశిక్ష విధించింది.

దేశంలో జరుగుతున్న మరణాలపై కాలుష్యం ప్రభావం చూపిస్తోందనడాన్ని మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది.గాలిలో కాలుష్య కారకాలు ప్రస్తుతం ఉన్న 2.5 పరిమాణం,ఓజోన్ ప్రామాణికతలను మరింత కఠినతరం చేయాలని,జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేసింది.1981 నాటి గాలిలో కాలుష్య నియంత్రణ చట్టం బదులుగా సరికొత్త స్వచ్ఛమైన గాలి చట్టాన్ని ప్రస్తుత కాలానికి అనుగుణంగా తీసుకురావాలని ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com